# కాంతి కిరణం

(ఉదయంలో రెండవ బహుమతి వచ్చిన చిన్న నవల)

---

సాంఘికంగా, ఆర్థికంగా, మానసికంగా -
ఏ వ్యక్తీ ఎల్లకాలం చీకట్లో మగ్గడం - ఓ శాపం
వాళ్లని ఎవరైనా శాపవిముక్తుల్ని చేసే
వాళ్లని 'దేవుడు' అనేపేరు పెడ్తే అదే న్యాయం

---

'ఆమె.. ఆమె నెక్కడో చూసినట్లుంది... ఎక్కడ? ఎక్కడ??'

ఎదుటి బర్త్‌మీద కూర్చున్నతని మేధస్సు వేగంగా పని చేయడానికి అతృత పడ్తోంది. కానీ అతని జ్ఞాపక శక్తి అతన్ని ఓడిస్తోంది.

ఎక్కడో చూశాడు బాగా పరిచయం వున్న వ్యక్తి ఆమె. ఆమెతో తనకు కొన్నాళ్ళ పరిచయం, అదీ గాఢ పరిచయం వుందని సబ్ కాన్షియస్ లెవల్ చెప్తోంది. కానీ ఆమేటర్ కాన్షియస్‌లోకి రావడం లేదు. అది స్పైనల్ కార్డ్ లెవల్‌లోనే ఆగిపోతోంది.

ఆమె కూడా అతని వైపే చూస్తుంది. ఆమె ఒడిలో నాలుగేళ్ళ బాబు, ప్రక్కన ఎనిమది సంవత్సరాల పాప.

"అమ్మా మంచి నీళ్ళు"

"వుండు నాన్నగారు వెళ్ళారుగా తెస్తారు" తన కూతురితో చెప్పి మరలా ఇటే చూడసాగిందామె.

అది మద్రాస్. హైద్రాబాద్ ఎక్స్‌ప్రెస్. రిజర్వ్‌డ్ కంపార్ట్‌మెంట్ న్యూ ఆ రోజు అనూజ్‌వల్‌గా కొద్ది ఖాళీగా ఉంది. అది ఆరుబర్త్‌ల భాగమయితే అందులో రెండు ఖాళీగా ఉన్నాయి.

ఆమె తనవేపే చూడ్డంతో అతను తలవంచుకున్నాడు.

ఆమెజ్ఞాపకపు పొరల్లో నుండి అతనితో తన పరిచయం వెలుగులో కొచ్చింది.

---

కారు బెంగుళూరులోకి ఎంటరవగానే భార్యవైపు చూస్తూ అడిగాడు విమల్.

"చల్లగా హాయిగా ఉంది కదూ ప్రీతి!"

"ఊ" ఎటో చూస్తూ అంది జాహ్నవి.

ఆకాశాన్నంటిని ఈ తురాయి చెట్టుపూలు ఆకు కన్పించకుండా ఎర్రగా ఎంతందంగా ఉన్నాయో చూడు" కాలి క్రింద ఉన్న వస్తువుల్ని ప్రక్కకునెడ్తూ అన్నాడు.

"అనవసరంగా యింత ఖర్చు పెట్టి నన్నిక్కడకు తీసుకొస్తున్నావ్"ఎటో చూస్తూ అందామె.

"అవసరం కాబట్టే తీసుకొచ్చాను ప్రీతీ!"

"ఏం కాదు!"

"కాకపోవడమేమిటి? అప్పటి చలాకితనం నీలో మచ్చుకైనా వుందా? జబ్బు కాకుంటే అలా ఎందుకుంటావ్ చెప్పు"

"నాకేం జబ్బు" భర్త ప్రక్కకు జరుగుతూ అంది.

"నాకు మాత్రం ఏం తెలుసు. మన డాక్టరు చెప్పబట్టి నేనూ అలా అనుకున్నాను గానీ పోనీలే ప్రీతీ! ఎంత ఖర్చయినా ఫర్వాలేదు నేనెన్ని రోజులు శెలవు పెట్టినా పర్వా లేదు నువ్వు మామూలు మనిషివయితే చాలు.

ఆమె జీవం లేని కళ్ళల్లో కొద్ది కాంతి.

"అయితే హాస్పిటల్లో నేనున్నన్ని రోజులు మీరు నా దగ్గరే ఉంటారా?"

"తప్పకుండా" అనేసి డ్రైవర్కి కాగితం అందించాడు.

"నిమ్హాన్స్ అడ్రస్ ఇది అక్కడకు పోనీ"

విశాలమైన గేటుగుండా కారులోపలికొచ్చి అక్కడ ఆగింది.

"వద్దంటే విన్నారు కాదు అడ్మిట్టయిపోనా?" ఆమెకు భయంగా ఉంది. 'ఇక్కడ పిచ్చి వాళ్ళమధ్య ఎలా మెలగడం?' కానీ ఆమె వూహించినట్టు ఎలాటి గందరగోళ వాతావరణం లేదక్కడ. నిశ్శబ్దంగా ఉంది. రోడ్లు పరిశుభ్రంగా ఉన్నాయి. ఎదురుగా ఒక పెద్ద బిల్డింగ్ దానికి దక్షిణాన మరో బిల్డింగ్. ఓ ప్రక్కన వినాయకుడి గుడి. మొదట ఎక్కడికెళ్లాలో అర్థంగాక కారు దిగాడు విమల్. కాస్త దూరాన స్టెత్ మెళ్ళో వేసుకుని ఒక యంగ్ డాక్టర్ స్పీడ్గా నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఇంచుమించు పరుగులాటి నడకతో అతన్ని చెరుకున్నాడు విమల్.

"ఎక్స్క్యూజ్మీ ఓ.పి. ఎక్కడో చెప్పగలరా?" ఇంగ్లీషులో అడిగాడు.

"ఎవర్ని కలవాలి మీరు?" ఒంటరిగా వచ్చినతన్ని తిరిగి ప్రశ్నించాడు డాక్టర్. మురళీకృష్ణ. అతను ఫస్టియర్ యం.డి. స్టూడెంట్.

"మా మిసెస్ని చూపించడానికి నెల్లూరు నుండి తీసుకొచ్చాను ఛీఫ్ సైకియాట్రిస్టుని కలిసి సలహా తీసుకోవాలి. వాళ్ళు అడ్మిట్ అవమంటే అడ్మిట్ చేస్తాను."

"ఓ.కే. నాతో రండి. ఈ రోజు డాక్టర్ పాల్గారి డే. నేనాయన స్టూడెంట్ని. ఈరోజు మా ఓ.పి. కానీ పాల్గారు ఈరోజు శెలవు"

నిరాశగా చూశాడు విమల్.

"ఫర్వాలేదు రండి. మేము కేస్ హిస్టరీ తీసుకుని అవసరమైతే అడ్మిట్ చేసుకుంటాం. మా ఛీఫ్ ఏమీ అనరు. ఆయన రేపు వస్తారు. రౌండ్స్లో మిమ్మల్ని పరిచయం చేస్తాను."

సంతోషంగా చూశాడు విమల్.

"మీ మిసెస్ని పిలవండి!"

వెనక్కు వెళ్ళే జాహ్నవిని పిలుచుకొచ్చాడు విమల్. అంతవరకు తమ కొరకు అక్కడే వెయిట్ చేస్తున్న ఆయువ డాక్టరంటే ఇష్టం, ఏర్పడింది అతనిలో.

తల వేలాడేసుకుని విమల్ ప్రక్కన నడిచొస్తున్న తన ఫ్యూచర్ పేషెంటు వంక ఆసక్తిగా చూసి వాళ్ళతో కదిలాడు మురళీకృష్ణ.

"మీ కేం బాగలేదో చెప్పమ్మా" తెలుగులో అడిగాడు మురళీకృష్ణ. విమల్‌తో ఇంటర్వ్యూ అయ్యాక. అతనిది విజయవాడ. ఇక్కడకు ఆంధ్రా పేషెంట్సు ఎక్కువగానే వస్తుంటారు.

"నాకు బాగుంది"

"మీలో కొంత మార్పుందని మీ హస్బెండ్ చెప్తున్నారు"

"నాలో మార్పు నాకేం కన్పించడం లేదు"

"మీరు డల్‌గా ఉంటున్నారని ఇది వరకిలా వుండేవారు కారని అంటున్నారయన"

జాహ్నవి మాట్లాడలేదు.

"మీకీ క్షణంలో ఎలా ఉంది?"

"ఇక్కడ నుండి పారిపోవాలనుంది" విసుగ్గా అంది.

కారులో భర్తతో వస్తున్నంత సేపు బాగానే ఉంది జాహ్నవికి. కానీ ఈ హాస్పిటల్ వాతావరణం చూడగానె ఆమెకు విసుగ్గా చిరాగ్గా, కోపంగా ఉంది. ఆమె మనోభావాల్ని గమనించిన మురళీకృష్ణ ఆమెను బయటకు పంపి విమల్‌తో అన్నాడు.

"ఆమె ప్రయాణం చేసొచ్చింది కదూ! అలసటగా ఉన్నట్టుంది. ఆమెతో రేపు మాట్లాడుతాను. ఇలాటి కేసెస్ గురించి ఒక్కరోజులో సలహా ఇవ్వలేం మీరు అడ్మిట్ చేస్తే అబ్జర్వేషన్‌లో పెట్టుకోవాలి".

"మీ ఇష్టం. మీరెలా చేస్తే అలాఫాలో అవుతాను"

విమల్‌ని చూస్తే ముచ్చటేసింది మురళీకృష్ణకు. ఈ మూడు నెలలుగా చూస్తున్నాడు మరీ అల్లరిచేసే పేషంట్లయితే తప్ప ఇలా నిశ్శబ్దంగా వుండే పేషంట్స్‌ని అడ్మిట్ చేయ మంటే ఒక పట్టాన ఒప్పుకోరు హాస్బెండ్స్. 'ఏదో చూసి మందు వ్రాసిచ్చేయమని' ప్రాధేయపడ్తారు"

అడ్మిషన్ నోట్ వ్రాసి విమల్ చేతిలో పెట్టాడు డాక్టర్ మురళీ కృష్ణ.

"ఫామిలీ రూమ్ కెళ్లండి అక్కడ రూమ్ నెంబరు టెన్ అలాట్ చేశాను మీకు. అక్కడ సోషల్ వర్కర్, నర్స్ ఉంటారు. వాళ్ళు మీకు రూమ్ చూపిస్తారు."

లేచి నిల్చున్నాడు విమల్.

"సారీ మీరేమనుకోకపోతే ఆవార్డు ఎక్కడుందో!"

"ఈ వార్డుకి ఉత్తరం వైపున్న బిల్డింగ్ అదే వెళ్ళగలరా?"

వెళ్ళగలన్నట్టు తలూపాడు విమల్.

భర్త వెనక విసుగ్గా ఆ వార్డులో ఎంటరయింది జాహ్నవి. పెద్దహాలు. హాల్‌లో మూల ఒక టేబుల్. దాని వెనుక ఓ కుర్చీ టేబుల్ మీద ఫ్యాన్. మరోవైపు సోఫాసెట్. ఎడంవైపు అద్దాలతో పెద్ద హాలు. కుడివైపు చూశాడు. మధ్యలో లాన్ చుట్టూవరండా నానుకుని గదులు. లాన్‌లో ఇద్దరు ముగ్గురు జంటలు తప్ప కాంపౌండర్లుగానీ, నర్సులుగానీ కన్పించ లేదు. ఆ వరండా చుట్టుకుని కుడివైపు తిరగారిద్దరూ. అక్కడ వరుసగా వంట గదు లున్నాయి. మరలా వెనక్కు వచ్చారు. ఎదురుగా చిన్న ఆఫీసు రూమ్ కన్పించింది. తలుపు మీద టేప్ చేశాడు విమల్.

"ప్లీజ్! కమిన్"

జాహ్నవి లోపలికెళ్ళలేదు.

అక్కడ కూర్చున్న తనికి అడ్మిషన్ కార్డు చూపించాడు విమల్.

"రండి" అతను లేచాడు.

"రూమ్ నెంబర్ టెన్ చూపించి ఇక్కడ వెయిట్ చేయండి. రూమ్ బాయ్ వస్తాడు" రూమ్ తీసి వెళ్ళిపోయాడు. అతనెవరో తెలీలేదు విమల్‌కి.

ఐదు నిముషాల్లో బెడ్ షీటు పట్టుకుని బాయ్ వచ్చాడు. రూమ్ శుభ్రం చేసి బెడ్ షీట్ వేసి లోపలికెళ్ళ మన్నట్టు చూసి వెళ్ళిపోయాడు. ఇక్కడకొచ్చాక చిత్రంగా జాహ్నవిలో కొంత ప్రశాంతత ఏర్పడింది.

"ఇక్కడ బావుందా ప్రీతీ!"

బావుందన్నట్టు చూసిందామె.

"దా. లోపలికి పోదాం." భార్య భుజం మీద చెయ్యివేసి లోపలికి తీసుకెళ్ళి పడకమీద పడుకోబెట్టి "సామాను తెస్తాను ఇక్కడే వుండు" అన్నాడు.

"నేనూ వస్తాను"

"వద్దులే"

క్షణంలో ఆమె మనసులో చీకటి.

---

బిలబిలమంటూ ఆ రూమ్‌లోకొచ్చిన జనాన్ని చూసి ఉలిక్కిపడి లేచింది జాహ్నవి. విమల్ బాత్‌రూమ్‌లో ఉన్నాడు.

డాక్టర్ పాల్ ఆయన వెనుక అసిస్టెంట్స్, సోషల్ వర్కర్ మిస్టర్ సుబ్రహ్మణ్యం, పోస్టు గ్రాడ్యుయేట్స్.

బాత్‌రూమ్‌లో నుండి బయటికొచ్చి అందరి కంటే వయసులో పెద్దగా వున్న డాక్టర్ పాల్‌గార్కి విష్‌చేసి తర్వాత మిగతా వాళ్ళకి విష్‌చేశాడు విమల్.

డాక్టర్ మురళీకృష్ణ ముందుకొచ్చాడు.

"సర్! ఈమెనే నేను నిన్న అడ్మిట్ చేసింది. మిసెస్ జాహ్నవి ఆంధ్రా. ఆమె హస్బెండ్ మిస్టర్..." ఆగాడు.

"విమల్" చెప్పాడు విమల్.

"హిస్టరీ తీసుకున్నారా?"

"నిన్న ఆమె హిస్టరీ ఇవ్వడానికి అంగీకరించలేదు. ఈరోజు తీసుకుంటాను." చిన్నగా అన్నాడు.

"ఒ.కే" ముందుకు కదిలాడు డాక్టర్ పాల్.

"ఎమ్మా ఇక్కడ బాగుందా నీకు?"

బాగుందన్నట్టు తలూపిందామె.

"ఇక్కడ మీకెలాటి అభ్యంతరాలూ లేవు. మీరు పేషెంట్లని అనుకోనక్కర్లేదు. ఇది ఫేమిలీ వార్డు అంటే మనందరం ఫేమిలీ మెంబర్స్. నీ మనస్సులో ఏముందో అంతా మీ డాక్టర్‌కి చెప్పండి!" సరేనా!" వచ్చీరాని తెలుగులో జాహ్నవితో మాట్లాడి వెళ్ళిపోయాడు.

## 2

"చెప్పండి. మీ మనసులో అసంతృప్తి ఏమిటో చెప్తే మేమేమన్నా చేయగలం?"

డాక్టర్ మురళీకృష్ణ ఆరవసారి ఓపిగ్గా అడిగాడు జాహ్నవిని.

ఆనాచ్ఛాదితమైన ఆ పెద్ద టేబిల్‌ముందు చెక్క కుర్చీలో మురళీకృష్ణ ఎదురుగా కూర్చున్న జాహ్నవి అసహనంగా కదిలింది.

"చెప్పండి ప్లీజ్"

"నాకు బాగానే ఉంది" ఆమె మొండిగా మౌనంగా ఉండిపోయింది.

"మీకు బాగుంటే ఇక్కడకు రారు ప్లీజ్ చెప్పండి" కాస్త ముందుకు వంగాడు డాక్టర్ మురళీకృష్ణ. అతను పోస్టు గ్రాడ్యుయేట్ చెయ్యడానికి ఇక్కడికొచ్చిన స్టూడెంటే అయినా అతనిలో ఉత్సాహం, జిజ్ఞాస పట్టుదల జాస్తి.

పాల్‌గారు చెప్పినట్లు పేషెంట్లతో ఓర్పుగా మాట్లాడి వాళ్ళ మనసులో మాటను పైకి తీసుకురావాలనే మొదటి స్టెప్‌లో ఉన్నాడు డాక్టర్ మురళీకృష్ణ. ఆమె ఎన్నిసార్లు అడిగినా మౌనంగా వున్నందుకు ఆమె మీద చిరాకు పడలేదు.

మరలా అడిగాడు

"నీకేం భయం లేదిక్కడ ప్లీజ్ మీ మనసులో బాధ ఏమిటో చెప్పండి"

"నాకీ జీవితం ఇష్టపడ్డం లేదు అంతే" ఈసారి తప్పదన్నట్టుగా విసుగ్గా అంది ఆమె. తెల్లటి అందమైన ఆమె ముఖంలో విశాలమైన ఆ కళ్లల్లో కూడా విసుగు.

'ఎందుకని? ఎందుకని ఇష్టంలేదు"

ఆమె మరలా మాట్లాడలేదు.

'మీ జీవితంలో ఏ భాగం మీ కిష్టపడడం లేదు".

ఆమె కొద్దిగా తలెత్తింది. కానీ జవాబు చెప్పే ప్రయత్నంచేయలేదు.

"అంటే నా ఉద్దేశ్యం ఈ జీవితం ఏ విధంగా మీరు తృప్తిగాలేదు? ఆర్థికంగానా?"

ఆమె కళ్లెత్తింది ఆ కళ్లల్లో కళ లేదు.

ఐదు నిముషాలు ఆమె జవాబుకొరకు ఎదురుచూసిన ఆ ఆంధ్రా డాక్టర్ మరలా అదే ప్రశ్న వేశాడు.

ఈసారి తల అడ్డంగా తిప్పింది జాహ్నవి.

"మీ ఇంట్లో మెంబర్సంతా మిమ్మల్ని బాగా ట్రీట్ చేస్తారా?

ఈసారి డాక్టర్‌ని విసిగించకుండా బాగా చూస్తారన్నట్టు తలూపిందామె.

'మీకు మీ పెళ్లి మీ ఇష్టం మీదే జరిగిందా?"

ఇష్టమే అన్నట్టు తలూపింది

"పిల్లలు లేరని వెల్తివుందా?" ఆమె ముఖం వంక పరిశీలనగా చూస్తూ అడిగాడు.

ఆమెకు పెళ్లయి రెండేళ్లయినట్టు, పిల్లలు లేరన్నట్టు అతని ముందున్న కేస్ షీటు చెప్తోంది.

'ఉహూ నాకు పిల్లలు ఇష్టంలేదు' దృఢంగా అంది

"వెరీ గుడ్. మరి చెప్పండి ఈ జీవితం మీ కెందుకిష్టపడడం లేదు. ఇంకా చదువుకోవాలని గాని, ఉద్యోగం చేయాలనిగాని ఏమైనా కోరికలున్నాయా?"

ఏదో చెప్పబోయిందామె బిగుసుకుపోయిన ఆమె పెదాలు విడిపడలేదు

'మే ఐ కమిన్ సర్'

'ప్లీజ్'

తెల్లటి యూనిఫారంలో ఉన్న నర్స్ తలుపు తోసుకుని లోపలికొచ్చి ఎవరిదో కేస్

సీట్ తీసుకుని మరలా తలుపు ముందుకు లాక్కుని వెళ్లిపోయింది

"ప్లీజ్ చెప్పండి"

"అలాటి కోరికలేం లేవు. నాకీ జీవితం వద్దు, నాకు రెండేళ్ల క్రితం జీవితం కావాలి" హఠాత్తుగా ఆవేశంగా అంది జాహ్నవి.

డాక్టర్ మురళీకృష్ణ కళ్లుమెరిశాయి. ఆరిపోతున్న అతని ఆశ ప్రాణం పోసుకుంది. అతని కళ్లు ఆమెకు సరిగ్గా రెండేళ్ల క్రితమే ఆమెకు పెళ్లయిన వైనం చెప్పే కేస్ షీట్‌లో ఆ లైన్ మీద నిల్చిపోయాయి.

అలా ఆవేశంగా అన్న ఆమె తర్వాత కిటికీ అవతల కొద్దిగా పరుచుకున్న వెన్నెల్లోకి చూస్తూ ఉండిపోయింది. ఆ కళ్లలో జీవం లేదు అసలవి ఆ వెన్నలను గమనిస్తున్నట్టు కూడా లేవు.

ఆ జూనియర్ డాక్టర్ గబ గబ లెక్కలు కట్టాడు. ఆలోచించాడు.

"జాహ్నవీ!" పిల్చాడు.

ఆమె కళ్లు కొద్దిగా తిప్పి నిరాసక్తంగా చూసింది. ఆవిశాలమైన కళ్లల్లో ఎంతవైరాగ్యం! ఎంత దిగులు!

"అయితే మీకు మీ భర్త ఇష్టంలేదు అవునా? అబద్ధం చెప్పొద్దు"

'నో.. నాకు విమల్ అంటే చాలా ఇష్టం' వెంటనే క్షణం కూడా ఆలస్యం చేయకుండా అరిచినట్టుగా అందామె.

"నో... మీకీ పెళ్లి ఇష్టంలేదు" ఆమె ముఖ కవళికల వంక చూస్తూ అన్నాడు మురళీకృష్ణ. అతనికి ఆమె బాధేంటో మొదట అర్థం కావాలి. అది తెలిస్తేకానీ ఆమెకు అక్కడ డాక్టర్లెవ్వరూ సహాయం చేయలేరు ఆమెకు శారీరక వ్యాధి లేదు. అది మానసిక వ్యాధి.

చాలా మంది ఆడపిల్లలు ఇష్టంలేని పెళ్లి చేసుకుని, మనసులో అసంతృప్తినీదుతూ భర్తంటే తమకు చాలా ఇష్టమన్నట్టు ప్రవర్తించి ఇలాటి జబ్బులు కొనుక్కుంటారు.

ఆమె అతని వైపు చాలా కోపంగా చూసింది. చటుక్కున లేచి నిల్చుంది.

అతను తగ్గాడు "ప్లీజ్ జాహ్నవీ! కూర్చోండి ప్లీజ్"

హఠాత్తుగా చాలా నీరసం వచ్చినదానిలా కుప్పలా మరలా అదే కుర్చీలో కూల బడిందామె.

'పోనివ్వండి. ఏమైనా కబుర్లు' చెప్పండి"

"ఏ ముంటాయి మీతో కబుర్లు అన్నట్టుగా మౌనంగా కూర్చుందామె.

"ఈ ఫేమిలీ వార్డు మీకు నచ్చిందా?"

ఆమె తలూపింది. ఆ తలూపడంలో అది నచ్చిందో లేదో అతనికి బోధ పడలేదు. అతని కసలు ఆ ప్రశ్నకు జవాబు అవసరం లేదు. ఏ పేషెంటుకూ ఆస్పత్రి నచ్చదు.

"భోం చేశారా?"

"లేదా"

"చాలా పొద్దుపోయింది. వెళ్ళండి భోం చెయ్యండి"

ఆమె లేచింది. అతనూ లేచి నిల్చున్నాడు. ఆమె నీరసంగా అడుగులేస్తూ వాకిటదాకా వెళ్లడానికి రెండు నిముషాలు పట్టింది. ఆమె వెళ్తున్న ఆ రెండు నిముషాలు ఆమె వైపే చూస్తూ ఆలోచిస్తున్నాడు డాక్టర్ మురళీ కృష్ణ.

ఈమెలో ఎందుకు అసంతృప్తి అవసరాలకు, సరదాలకు మించిన డబ్బు, ప్రేమగా చూచుకునే భర్త సంఘంలో గౌరవం ఆమె కొరకు ప్రాకులాడే తల్లిదండ్రీ భర్త చెల్లెళ్లు

ఇంతమంది ప్రేమ అయినా ఆమెలో అసంతృప్తి

'ఓ మనసా నువ్వెంత చిత్రాతి చిత్రమైన దానివి!' నవ్వుకుంటూ క్వార్టర్సు కెళ్లాడు.

---

తలుపు మూయబోతూ ప్రక్కన చప్పుడయితే అటు తిరిగాడు. విమల్ పోడవైన ఆకారిడార్‌లో ఆతృతగా నడిచి వస్తున్నాడు.

తలుపుకు తాళం వేయబోతున్న అతని చేతులు అగిపోయాయి.తగిలించిన లాక్ తీసి బోల్టుతీసి తలుపులు బార్లా తెరిచి తనుఅడుగులోపలేసి వెనక్కు తిరిగి జాహ్నవి భర్త విమల్ వైపు చూసి "రండి" అన్నాడు.

"సారీ మీకుమీల్స్‌కి టైమ్ అయింది మెస్ క్లోజ్ చెస్తారేమో".

అంటూనే లోపలికోచ్చాడు విమల్. అతనికి చాలా ఆతృతగా వుంది.

ఎప్పడూ సెల ఏరులా గల గల ఉరకే భార్యలో హఠత్తుగా వచ్చిన ఈమార్పు, నిరాసక్తత స్తబ్దత అతన్ని కలవర పెడ్తోంది. ఎప్పుడూ ఆప్యాయంగా దగ్గర చేరే ఆమె ప్రవర్తనలో మార్పుకు అర్థం ఆమె చేత చెప్పించుకోలేక ఓడిపోయి ఫామిలీ డాక్టర్ సలహా మీద బెంగుళూరులో 'ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ 'సహాయాన్ని ఆశ్రయించాడు..తన భార్యను ఇక్కడ చేర్చి అప్పుడే మూడు రోజులయి పోయింది. అతనికదే మూడు యుగాల్లా ఉన్నాయి.

"ఏమి చెప్పింది?" తీరా కుర్చీలో కూర్చోకుండానే అడిగాడు.

డాక్టర్ మురళీ కృష్ణ ఓపిగ్గా తామిద్దరి మధ్య జరిగిందంతా అతనికి చెప్పాడు. ఆ సుదీర్ఘమైన సంభాషణలో ఆమె అంతర్యం సైకియాట్రీలో మొదటి మెట్టు మీదున్న ఆ డాక్టరుకి, ఆమెతో మూడేళ్ళ పరిచయం ఉన్న విమల్‌కీ కూడా బోధ పడలేదు. ఇది వరకు ఎన్నో సార్లు అడిగిన ప్రశ్నె మరలా" ఆమెకు మీరంటే ఇష్టమే కదూ?" అడిగాడు మురళీకృష్ణ.

"చాలా చెప్పలేనంత"

"మీ నమ్మకం మిమ్మల్ని మోసం చేయదు కదా!"

"నో, నెవర్ డాక్టర్ ఆమెకు నేనంటే ఇష్టం" ప్రాణంకూడా.

"ఎప్పుడూ ఇలా డల్‌గా ఉండేదా?

"లేదు. లేదు. జాహ్నవి చాలా అల్లరిది. ఇప్పుడు ఇలా ఆమెను చూడాలంటే చాలా వర్రీడ్‌గా ఉంది డాక్టర్"

"ఆమెలో ఈ మార్పు ఎప్పటి నుండి!"

క్షణం ఆలోచించాడతను.

"ఈ మధ్యనే నేను గమనించాను. ఆలోచిస్తే పెళ్లయిన ఆరు నెలల తర్వాత నుండి ఆమె కొద్ది కొద్దిగా మారిందనిపిస్తోంది"

"అలా ఎందుకుందో మీరడగేరా?"

"ఉహు మొదట్లో నేనుఆమెలో మార్పు గమనించలేదు. గమనించినా ఈ ఆరు నెలల్లో అడిగినా జవాబు చెప్పేది కాదు"

డాక్టర్ మురళీకృష్ణ ఆలోచిస్తూ ఉండిపోయాడు.

"సారీ మిమ్మల్ని రిటైన్ చేశాను. మీరెళ్ళండి డాక్టర్ మెస్ క్లోజ్ చేస్తారేమో?" అని నిరాశగా లేచాడు విమల్.

"పర్వాలేదు" అంటూ లేచి బయలుదేరాడు మురళీకృష్ణ. ప్రస్తుతం అతని పూర్తి జీవితం రోగుల చుట్టూ అల్లుకొనుంది దాన్నుండి డివిఏట్ అవడానికింకా అతనికి పెళ్ళి కాలేదు.

"ఏమంటోంది మీ రూమం నెంబర్ టెన్ పేషెంటు?" అని అడిగాడు డాక్టర్ పాల్ ఇలా తక్కువ మాట్లాడి పేషెంట్ల చేత చాలా ఎక్కువ మాట్లాడించగల నేర్పు అతని స్వంతం.

"ఏమీ చెప్పడం లేదు సర్"

"ఏమీ చెప్పడం లేదా?"

"ఏమీ అంటే.... ఈ జీవితం మట్టుకు వద్దంటుంది. రెండేళ్ళ క్రితం జీవితం కావాలంటోంది"

డాక్టర్ పాల్ ఆలోచనలో పడ్డాడు.

"అయితే చెప్పక పోవడమేం? చాలా చెప్పిందామె" అని మురళీ కృష్ణ భుజం తట్టి 'సీ మైబాయ్ - ఇక్కడ మనం డాక్టర్లలా ప్రశ్నలు వేస్తే లాభం లేదు. మొదట నువ్వు ఆమెకు స్నేహితుడుగా మారు. ఆమెను నీ కాన్ఫిడెన్స్‌లోకి తీసుకో ఆ తర్వాత ఆమె అన్నీ చెప్తుంది."

తన ఛీఫ్ వెళ్ళి పోయాక కొద్ది క్షణాలు అక్కడే నిల్చుని ఆ తర్వాత ఆ హాల్ నుండి వరండాల్లో కొచ్చాడు డాక్టర్ మురళీ కృష్ణ అతను ఇటీవలే ఆ వార్డులోకి పోస్ట్ చేయబడ్డాడు. అతనికి ఆ వాతావరణం ఎందుకో చాలా నచ్చుతుంది. అసంతృప్తి వంటి మానసిక వ్యాధులతోనూ, తాగుడు, డ్రగ్ అడిక్షన్‌తోనూ వచ్చినవాళ్ళను ఆ వార్డ్‌లో అడ్మిట్ చేస్తారు. హాస్పిటల్‌లో రూమ్‌లో ఉన్నట్లుగాక హోమ్లీగా వుంటుంది. పైగా అక్కడ పేషెంట్ల కెలాటి రిస్ట్రిక్షన్స్ లేవు. వాళ్ళు ఎక్కడికైనా తిరిగి రావొచ్చు. అక్కడ కొచ్చిన పేషెంట్లు తాలూకు వాళ్ళు చిత్రంగా చప్పున ఇట్టే స్నేహితులైపోతారు.

---

## 3

"హలో"

ఆమె వెనక్కు తిరిగి చూసింది.

"ఏమిటి వంట ఈ రోజు?"

ఆమె చిరునవ్వు నవ్వింది.

"మీకు వంటొచ్చా?"

"ఆ నావంట రుచి చూడ్డానికి ఈ రోజు మాతో సరదాగా భోంచేయ కూడదూ డాక్టర్"

ఆమె ఆ ఆహ్వానం అతన్ని ఆనందపర్చింది. నిన్న వున్న డల్‌నెస్ ఈ రోజు లేదామెలో.

"థాంక్యూ! తప్పకుండా భోం చేస్తాను. ఇంకా ఎనిమిదన్నా కాలేదు రండి బయట లాన్‌లో కాస్సేపు కూర్చుని తర్వాత భోంచేద్దాం"

"అలాగేఆయన్ని కూడా పిలుస్తానుండండి"

"నేను పిలిచాను. ఆయనకు తలనొప్పిగా ఉందట రానన్నారు" ఆమె ప్రక్కనే నడుస్తూ అన్నాడు మురళీకృష్ణ.

"అలాగా - ఇప్పుడు బాగానే ఉన్నారే ఆయన్ని ఒంటరిగా వదిలి ఊహూ రాలేను"

డాక్టరు చిక్కుల్లో పడ్డాడు. ఇప్పుడే విమల్‌ని ఇంటర్వ్యూ చేసి జాహ్నవితో పర్సనల్ ఇంటర్వ్యూకి పర్మిషన్ తీసుకుని వస్తున్నాడు.

"వస్తాను డాక్టర్ భోజనం టైంకి పిలుస్తాను ఎక్కడకూ వెళ్ళకండేం!" నీరసంగా నిలబడి పోయాడు డాక్టర్ మురళీకృష్ణ ఐదు నిముషాల తర్వాత మరో ట్రయిల్ వేయను రూమ్‌నంబర్ పదిలో ఎంటరయ్యాడు.

"తలనొప్పా అంతగా ఏమీ లేదు పద బయట వెన్నెల్లో కూర్చుందాం" అని బెడ్ మీదనుండి లేస్తున్నాడు విమల్.

ఆ హాస్పిటల్ రూమ్‌లో ప్రతిరోగికి కాస్త విశాలమైన బెడ్ ఒకటే వుంటుంది. దాని మీద భార్యాభర్తలిద్దరూ సర్దుకుని పడుకోవచ్చు. ఈ విషయంలో మిగతా హాస్పిటల్స్‌లో లాగ అబ్జెక్షన్ లేదు.

"హలో డాక్టరుగారూ! మీరా రండి. రండి మీకేం వర్క్ లేకపోతే అలా బయట కూర్చుందాం".

తనని ఎంతో క్యాజువల్‌గా ఆహ్వానిస్తున్నట్లు అంటున్న ఆ అందమైన యువకుడి వంక ఆప్రీషియేటింగ్‌గా చూశాడు మురళీకృష్ణ. ఈ కేస్‌లో అతనికి ఇంత ఇంటరెస్ట్ కలగడానికి మొదటి కారణం వాళ్ళిద్దరి మధ్యా వున్న ప్రేమకు అతను ముగ్ధుడు కావడమే. మామూలుగా ఆ ఫేమిలీ వార్డులో వున్న భార్యా భర్తల మధ్య కీచులాటలు, ఏడుపులు, అరుపులు ఉంటాయి. అలాంటివేమీ లేని జంట ఇది.

"ప్రీతీ! నాకు కరెస్పాండెన్స్ పనుంది నేను అట్యూబ్ లైట్ క్రింద కూర్చుని ఆపని చూసుకుంటాను. మీరు కబుర్లు చెప్పుకోండి. డాక్టర్‌గారూ! మీకేం వర్క్ లేదనుకుంటాను" అని వాళ్ళ జవాబు కాశించకుండా లేచి నిల్చున్నాడు విమల్.

"మేమూ వస్తాం పదండీ" అని లేవబోయిన భార్యను వారించాడు.

"వద్దు మీరొద్దులే"

ఆమె మొఖం నల్లబడడం ఆ క్రీనీడలో కూడా గమనించాడు మురళీకృష్ణ.

తన తప్పుతెలుసుకున్నాడు విమల్.

"నువ్వు ప్రక్కనుంటే నేనేదయినా పని చేయగలనా?" అని భార్యమీద ఓ జోక్ విసిరి నల్లబడ్డ ఆమె ముఖాన్ని ప్రకాశవంతం చేసి రూమ్‌లో కెళ్ళి ఇన్ని ఇన్‌లాండ్ కవర్లు తెచ్చుకుని అక్కడకు కాస్త దూరంలో రోడ్డు ప్రక్కన ఉన్న సిమెంటు బల్లమీద కూర్చుని అవసరం లేని వాళ్లకు కూడా నాలుగు ముక్కలు గీసి, ఇన్లండ్ కవర్లన్నీ పేస్ట్ చేయడం ప్రారంభించాడు.

అదే సమయంలో డాక్టర్ మురళీకృష్ణ జాహ్నవితో ఇన్‌వెస్టిగేషన్ స్టార్ట్ చేశాడు.

"నా గురించి మీకు చెప్పుకున్నందువల్ల నాకేమిటి ప్రయోజనం?" అంత వరకు ప్రసన్నంగా వున్న జాహ్నవి తీక్షణంగా చూస్తూ అంది.

మానసిక వ్యాధిగ్రస్థులు ఇలా హఠాత్తుగా కోపం తెచ్చుకుంటారు. ఎదుటి వ్యక్తిని హర్ట్ చేయడానికి కొంచెం కూడా వెనుకాడరు.

"ప్రయోజనం వుంటే చెప్తారా?"

నిరాశగా చూపిందామె.

"ఉహూ ప్రయోజనం వుండదు నాకు తెలుసు"

"ప్రయోజనం వుంటుందో లేదో ఆలోచించాల్సింది నేను జాహ్నవీ! మీకు నేను

ప్రామిస్ చేస్తున్నాను. ప్లీజ్ మీ ప్రాబ్లమ్ ఏమిటో చెప్పండి అది ఎంత గడ్డు సమస్యయినా సరే నేను మీకు పరిష్కరించి పెడ్తాను ప్రామిస్"

"ఇది సమస్యకాదు డాక్టర్ నేను కోరుకునేది నేను పొందలేననే పచ్చి నిజం"

"మీరు పొందగలరు నేను మాటిస్తున్నాను. చెప్పండి" ఆమె అలా నిరాశపడే కొద్దీ ఆ డాక్టర్‌లో కూడా ఆమె పట్ల కొంత జాలి కార్యదీక్షలో ఇంకాస్త పట్టుదల.

"నిజం ప్రామిస్"

"ప్రామిస్"

ఆమె ఐదు నిముషాలు మాట్లాడలేదు.

"ఓ.కే చెప్తాను కానీ డాక్టర్ కాలక్షేపానికి కాదు. నాకు మీరేదయినా చేయగలిగాలి."

"అందుకే కదా మేమున్నది" అతను నవ్వాడు.

"నో. డాక్టర్ నేను పేషెంటును కాను. అలా మీరు మాత్రలతో సహాయం చేస్తానంటే నేనేమీ చెప్పను. చెప్పడం సెంట్‌పర్సెంట్ వృధా"

డాక్టర్ మురళీకృష్ణ నవ్వు ఆపేశాడు.

"టాబ్లెట్స్ ద్వారా కాదు జాహ్నవీ! మీకు ఎలా వుంటే మనసుకు బాగుంటుందో చెప్తే మీ ఇంటి పరిస్థితులు అలా మారేలా నేను చేస్తాను"

"మీ కెలా వీలవుతుంది?" ఎదురు ప్రశ్న వేసింది.

"ఎందుకు వీలవదు?"

"మా ఆయన్ని మీరెలా మార్చగలరు?" అనుకోకుండా తన దారిలో కొస్తున్న పేషెంటుని చూసి ఆనందించాడు డాక్టర్ మురళీకృష్ణ.

"విమల్‌లో ఏమి లోపం వుంది జాహ్నవీ?"

"ఊహూ ఆయన నన్ను చూసుకోవడంలో లోపంవుందని ఎవరన్నారు" కాస్త చిరాగ్గా ముఖం పెట్టి అంది.

'ఎలా మాట్లాడినా తప్పుగా వుంది జాహ్నవి దగ్గర అందుకే శాంతంగా అడిగాడు.

"విమల్ మిమ్మల్ని ఎంతో అపురూపంగా చూసుకుంటున్నారు. ఆ విషయం మీరీ హాస్పిటల్‌కు వచ్చినప్పటి నుండి చూస్తూనే వున్నాను".

"ఇప్పుడేం చూశారు డాక్టరు గారూ! ఆరోజులెంత బాగుండేవి నాకోసం విమల్ ఎంత తపనపడే వాడనీ!

జాహ్నవి డాక్టర్ మురళీకృష్ణకు చెప్తోంది. తమా విమల్ ప్రేమించుకున్న రోజుల్లోకి మెల్లిగా వెళ్ళిపోతోంది. తన గుండెల్లో వున్న ఆనందాన్ని అసంతృప్తిని కూడా బయట పెడ్తోంది"

"అప్పుడు మేము ప్రేమించుకున్న కొత్తల్లో తరుచుగా మేము కల్సుకోడానికి వీలుపడేది కాదు. నేను ఒకసారి మా పిన్ని వాళ్ళింటికి కలకత్తా వెళ్ళాను. నాలుగురోజులు ఎలాగో ఓర్చుకున్నాను కానీ ఆ తర్వాత అంతా మా పిన్నికి చెప్పేసుకున్నాను. ఆమె నన్నర్థం చేసుకుంది. ఆ రాత్రే గుబులుమల్లి ఆయనకు నో డిలే కాల్ చేశాను. నా అదృష్టం విమల్ ఇంట్లోనే ఉన్నాడు" ఆమె పరవశంగా చెప్తోంది ఆమె కళ్ళల్లోకి ఓ కాంతి రేఖ వెన్నెట్లో నుండి జారి పడినట్లయింది.

"ఊ తర్వాత" కాస్త ముందుకు వంగి అడిగాడు డాక్టర్ మురళీకృష్ణ.

"ఫోన్‌లో రెండు నిముషాలు మాట్లాడాక సరదాకి 'నిన్ను చూడాల నుంది రాకూడదూ!" అన్నాను. అంతే వెంటనే కాల్ నన్ను ఎక్స్‌టెండ్ చేయమని పెన్ కాగితం

తెచ్చుకుని నా అడ్రస్ వ్రాసుకుని మరో కొన్ని గంటల్లో నా దగ్గర కొచ్చేశాడు".

మురళీకృష్ణ ఆమె కళ్ళల్లో కదలాడే కాంతి వంక చూస్తూ వింటున్నాడు.

"మీకు తెల్సా డాక్టరుగారూ? విమల్‌కి నాలుగు రోజుల్లో ఎ.జి.యం.ఎస్.సి. ఫైనల్ ఎగ్జామ్స్ స్టార్ట్ అవుతున్నాయి. ఆ విషయం నాకు తెలీదు. తెలిస్తే పిల్చేదాన్ని కాదు. అసలు ఆ ప్రయాణం ఎంత రిస్క్ అనీ బనారస్ నుండి రిజర్వేషన్ లేకుండా ట్రెయిన్‌లో ఢిల్లీ కొచ్చి అక్కడ నుండి ఎలా సంపాయించాడో ప్లెయిన్‌లో కలకత్తా వచ్చేశాడు.

రెండు గంటలు నాతో గడిపి నెక్స్ట్ ఫ్లైట్‌లో తిరిగి వెళ్ళిపోయి ఎగ్జామ్స్ వ్రాశాడు- అది తల్చుకుంటే నాకెంత థ్రిల్లింగ్‌గా వుంటుందో తెలుసా డాక్టర్.

"థ్రిల్లింగ్ గానా?"

" ఆ నాకోరకు అంత శ్రమ పడి వేలు ఖర్చు పెట్టుకుని విమల్ వచ్చాడంటే ఆ నిజం ఎంత హాయిగా ఉంటుంది. ఎంత పరవశంగా ఉంటుంది!" ఆమె చెప్తూ చెప్తూ సిగ్గుపడి పోయింది.

అలా ఆనందపుటంచులకు వెళ్లిపోయి హఠాత్తుగా ముఖం వ్రేలాడేసి దిగులుగా చూసింది.

"కానీ ఇప్పుడు మీరు చూశారుగా నేను ఆయన ప్రక్కన కూర్చుంటే ఏం? జాబులు వ్రాసుకోవడానికేం? వద్దనేశాడు" ఆమె కంఠంలో వీపరీతమైన అసంతృప్తి.

డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడలేదు. అతనీ రోజు ఆమెకు కీ ఇచ్చివదిలేయ దల్చుకున్నాడు.

"అసలు ఆరోజుల్లో అయితే గంటలు గంటలు మా మధ్య ఎలా దొర్లిపోయేవో మాకు తెలిసేదే లేదు. పెళ్ళయితే నిన్ను క్షణం కూడా వదలను అనేవాడు. కానీ ఇప్పుడు - ఉహూ ఆయనకు నాకంటే ఆయన వర్కే ఎక్కువ"

"ఇప్పుడు మీతో తీరిగ్గా మాట్లాడరా?" ఆమె వైపే నిశితంగా చూస్తూ అడిగాడతను.

ఇంతకు ముందే విమల్ తో జరిగిన ఇంటర్వ్యూలో ఈ ప్రశ్నలన్నింటికీ జవాబు పొందున్నాడు.

"మాట్లాడతారు. రెండు మూడు గంటలు మాట్లాడాక నిద్రొస్తోంది పడుకో. తలనొప్పి వస్తుంది నిద్రలేకపోతే అంటారు" నీరసంగా దిగులుగా అంది జొవ్నాని చల్లటి గాలితెల వాళ్ళమీదుగా ప్రయాణం చేసి వెళ్ళింది. కొబ్బరి చెట్ల ఆకుల సందుల్లో నుండి వెన్నెల వికిరణం చెంది వాళ్ళను తాకుతోంది.

"పెళ్ళయిన కొత్తల్లో అయితే మా కబుర్లతో తెల్లవారిందే తెలిసేది లేదు. అప్పుడంతా వచ్చిందా తలనొప్పి అదో సాకు కాకపోతే" మరలా తనే విరక్తిగా అంది.

"మీరిద్దరూ కలిసి తరుచుగా సినిమా కెళ్తుంటారా?"

"పెళ్ళయిన కొత్తల్లో కంటే ఇప్పుడు ఎక్కువ చూస్తున్నాం" అని ఆగి-

"ఆ సినిమాలో హీరోలు హీరోయిన్ల కళ్లల్లోకి ఎంత ఆరాధనగా చూస్తారనీ! ఆయన నాకళ్ళల్లోకి అలా ఆరాధనగా ఎందుకు చూడరు డాక్టరుగారూ!"

ఆ ప్రశ్న ఆమె మనోబలహీనతను స్పష్టం చేస్తోంది. ఆ ప్రశ్నకు జవాబు ఆమె ఎంతో బలంగా కోరుకుంటోంది.

"మీ వారెని అడక్కపోయారా?" డాక్టర్ మురళీకృష్ణ కొద్దిగా నవ్వుతూ అన్నాడు.

"అడిగాను. అది మూడు గంటల సినిమా- ఆ మూడు గంటలు సినిమా తర్వాత కథ

నడిస్తే వాళ్లూ మనలాగే ఉంటారు అంటారు- కాలం గడిచే కొద్దీ ఆరాధన తగ్గిపోతే అదేం బాగుంటుందీ!" ఆమె తనలో తాను మాట్లాడుకున్నట్టుగా మాట్లాడుతోంది.

"ఊహూ అది బాగుండదు అమ్మనో, నాన్ననో, చెల్లినో చూసి నట్లుంటుంది. ఊహూ అలా వుండకూడదు. దాంపత్యంలో ఆ ఆరాధన ఎప్పటికీ వుండాలి. ఆ ఆకర్షణ ఎప్పటికీ వుండాలి. లేకపోతే... లేకపోతే చప్పగా జీవం లేకుండా ఉహూ నా వల్లకాదు".

నిశ్శబ్దంగా వున్న అతని చెవులు రెండూ ఆమె కంఠంలో నుండి వచ్చే శబ్దాన్ని కీన్‌గా వింటున్నాయి. ఆమె కళ్ళల్లో కదలాడిన కన్నీళ్ళకు అతను కాస్త చలించి సర్దుకున్నాడు.

ఆర్నెళ్ల క్రితం మా చెల్లెలి పెళ్లికి వెళ్లాము. విమల్ పెళ్ళికి అంటెండయి వెళ్ళిపోయారు. 'నన్ను కూడా తీసుకెళ్ళండి' అంటే 'బావుండదు మీ చెల్లెలి పెళ్లికి నాలుగురోజులయినా వుండకపోతే' అని నన్ను వదిలేసి వెళ్లిపోయాడు" అలా చెప్పిమర్లా జాహ్నవి మురళీకృష్ణను అడిగింది.

"ఎందుకు బాగుండదు చెప్పండి. నేను ఆయన్ను వదలి వుండలేను. ఆయనతో వెళ్తాను. ఎందుకు బాగుండదనీ - 'పోనీ మీరైనా ఆఫీసుకు శెలవు పెట్టండీ అంటే శెలవులంతా ఇలా వృధా చేసుకుంటే ఎలా ప్రీతీ? సమ్మర్ వస్తోంది అప్పుడు శెలవుపెట్టి డార్జిలింగ్ వెళ్దాం" అని నన్ను మాయచేసి వెళ్ళిపోయాడు".

"చూడండి డాక్టర్‌గారూ! మీ కర్థమయిపోవడం లేదా విమల్‌కి నామీద ప్రేమ తగ్గిపోయిందని రెండు గంటలు నాతో మాట్లాడను అప్పుడు అన్నివేల ఖర్చు పెట్టి ఎగ్జామ్స్ పోగొట్టుకోడానికైనా సిద్ధపడి వచ్చాడే. ఇప్పుడు నేను వస్తానన్నా తీసుకువెళ్ళకుండా వెళ్లిపోయాడు. నాలుగు రోజులు నేను లేకపోయినా ఆయన బ్రతికేయగలడు.

ఆమె కళ్ళల్లో తడి - ఒక్క నిముషం తర్వాత సర్దుకుని పిల్చిందామె.

"డాక్టర్ గారూ!" అలా పిల్చి తర్వాత సంకోచంగా చూసింది.

"పర్వాలేదు చెప్పండి"

"నా పెళ్ళికాకముందు, పెళ్ళయిన కొత్తల్లో నా చెయ్యి ఎప్పుడయినా ఆయన మీద పడ్తే వెంటనే ఆయన చెయ్యి నాచేతిమీద పడేది. ఆయన కళ్ళు నావైపుఅప్యాయంగా చూసేవి. కానీ ఇప్పుడు నాచెయ్యి అతని మీద పడ్డట్టే ఆయనకు గుర్తింపు వుండదు".

ఓ ఆడపిల్ల మనస్సు ఎవరో సహాయం చేస్తే తప్ప తను బ్రతకలేవనే బలహీనతకు లోనైతే తప్ప తనకూ తన భర్తకూ మధ్య జరిగే అతి సున్నితమైన సంఘటనలను పరాయి మగాళ్లకుచెప్పదు.

"చూడండి డాక్టర్‌గారూ! అది వరకు నాకేదైనా వస్తువు కావాల్సి వచ్చి విమల్‌తో చెప్తే ఆపని చేయడం తప్ప తన జీవితానికేం పరమార్థమూ లేనట్టు చేసేవాడు. ఇప్పుడు ఏ చిన్నపని అతనితో చెయించుకోవాలన్నా రెండుసార్లు గుర్తు చేయాలి."

ఆమె కళ్ళు నిస్పృహగా వాలిపోయాయి.

"అతనిలోని మార్పుపట్ల మీ అసంతృప్తిని విమల్‌కెప్పుడయినా తెలియజేశారా?" ఆమెవైపు చూస్తు అడిగాడు మురళీకృష్ణ.

"ఊ చెప్పాను.చెప్పకున్నా బాగుండేది అలాటి పచ్చి యాదార్థాలు తెల్పుకుని ఏం లాభం?"

"పచ్చి యదార్థాలా? ఏమిటవి?"

"అదే విమల్ చెప్పేశాడు. పెళ్ళయిన రెండేళ్ళేనట ఆ ఆకర్షణలో భార్యభర్తలుగా

ఉండేది ఆ తర్వాత కేవలం బాధ్యతలు, ప్రేమలు మాత్రం మిగుల్తాయట"

"అలా అని విమల్ చెప్పాడా?"

'ఆ ఇంకా... ఎన్నాళ్ళు, ఎన్నేళ్ళు బ్రతకాలో ఇలా నిస్తేజంగా, మెషిన్‌లా, నా వల్లకాదు. నా వల్లకాదు.. నేనలా బ్రతికేసినా బాగుండేది పెళ్ళికాకుండా.." ఆమె గొంతులో కొండంత నిరాశ

"నాకీ సంసార జీవితం వద్దు. పిల్లలొద్దు, మేమిద్దరం ఇదివరకులా ఒకరినొకరు కావాలని గాఢంగా కోరుకుంటూ, మాట్లాడుకునే నాలుగు నిముషాలైనా ఒకరికొకరు అన్నట్లు మాట్లాడుకుంటూ,......."

"తరుచుగా కలుసుకోలేకపోయినా ఇద్దరి, గుండెల్లోను కలసుకోవాలనే తపన వుంటుందనే భావంతో, ఓహ్! ఆ జీవితం కావాలి... ఈమె ఎప్పటికీ నాదేలే అనే నిర్లక్ష్యం... నేను భరించలేను. నా వల్లకాదు... నా వల్లకాదు"

హిస్టీరియా వచ్చిన దానిలా ఏడుస్తున్న తన పేషెంటును ఎలా ఓదార్చాలో బోధపడక గబుక్కున లేచి నిల్చున్నాడు డాక్టర్ మురళీకృష్ణ.

తన భార్యను ఒక కంట గమనిస్తున్న విమల్ చప్పున రాబోయి స్పృహ తెచ్చుకున్నట్టుగా మరలా అక్కడే వాళ్లకు దూరంగా కూర్చున్నాడు.

జాహ్నవి కంట్రోల్‌లో లేదని అర్థమయి మురళీకృష్ణ అన్నాడు

"మీకా జీవితం తప్పకుండా వస్తుంది. మీరేదో భ్రమలో ఉన్నారంతే. మీరు కోరుకున్న మనిషి, మిమ్మల్నిష్టపడే వ్యక్తి మీ భాగస్వామి అయ్యాక మీరే విధంగా జీవితాన్ని మలుచుకోకూడదూ! ప్లీజ్ జాహ్నవీ! మీరు కోరుకున్న జీవితం మీకు లభ్యమవుతుంది నమ్మండి"

"ఊహు నాకు తెలుసు నాకా జీవితం మరలా అందదు. అలాఅని నాకు విమల్ చెప్పాడు"

"విమల్ చెప్పాడా?" విస్తుబోతూ చూసాడు మురళీకృష్ణ. అతనికి విమల్‌కి జాహ్నవి మీదుండే ప్రేమమీద కొండంత నమ్మకం ఉంది.

"అలా అని కాదు" అని క్షణం ఆగింది జాహ్నవి.

"ఒకరికొకరు క్షణం విడవకుండా వుండాలనే కోరిక కొన్నాళ్లతో పోతుందని ఆ ఆకర్షణలు పుస్తకాల్లో, సినిమాల్లో తప్ప వుండవనీ ఏదేదో' నైరాశ్యంతో ఆమె కంఠం పూడుకుపోయింది.

"సరదాకి అలా అనుంటాడు. ఆకర్షణ లేకపోవడమేమిటి?"

వంగి క్రింద నేలమీద గులకరాయి అందుకుంటూ అన్నాడతను. అలా అన్నాడేగాని ఆ సైకియాట్రిస్ట్ బ్రహ్మచారి కూడా క్షణం అనుమానంలో పడిపోయాడు. 'నిజమా! ఆకర్షణ తగ్గిపోతుందా!' అని

'నిజంగా విమల్ సరదాకే అనుంటాడంటారా మీరు' ఆశగా చూస్తూ అంది జాహ్నవి.

ఆమె ఆశానేత్రాలనుముగ్ధుడై చూస్తున్నాడు డాక్టర్‌మురళీకృష్ణ. చెప్పండిడాక్టరు గారూ! విమల్ సరదాకే అనుంటాడంటారా? అదే నిజమైతే ఎంత బాగుణ్ణు. ఆయన అలా అన్నప్పటినుండి ఎంత గుండె కోతగా ఉందనీ!"

"తప్పకుండా జాహ్నవీ! తప్పకుండా సరదాకె మిమ్మల్ని కవ్వించాలని అనుంటారు. నాకు విమల్ సంగతి పూర్తిగా తెల్సు. మీరంటే ఎంత ఇష్టమనీ మీరు క్షణం కనబడకపోతే.

ఆయనకు తోచదు.

"నిజం" ఆమె కళ్లు వెన్నలకంటె మిలమిలా మెరిసిపోతున్నాయి.

"నిజం మీరు నమ్మాలి" డాక్టర్ మురళీకృష్ణ జాహ్నవిని పూర్తిగా తన కాన్ఫిడెన్స్‌లోకి లాక్కున్నాడు.

# 4

"రండీ డాక్టరుగారూ! మా జాహ్నవి కిచెన్‌లో ఉన్నట్లుంది పిలవనా!"

"వద్దు నేను మీతో మాట్లాడాలని వచ్చాను"

'నాతోనా.... అదేం, మీ పేషెంటుని వదిలేసి నన్ను ఇంటర్వ్యూ చేయాలని అనుకుంటున్నారా మరలా?'

'నో.. నో.. ఈ మారు మీతో ఇంటర్వ్యూ కాదు మీకు ఓ సలహా ఇవ్వాలని వచ్చాను'

"మీరు సలహా ఇవ్వాలేకాని జాహ్నవి బాగుపడ్తుందంటే అది ఎలాంటి సలహా అయినా పాటిస్తాను" అంటూ ఫ్లాస్క్‌లో కాఫీ వంచి డాక్టరుగారికి అందించిన తన ఎదురుగా వున్న కుర్చీల్లో దుమ్ము వుందేమోనని చేతిగుడ్డతో తుడిచి మురళీకృష్ణను కూర్చోమన్నాడు విమల్.

"మీరు జాహ్నవితో అలా అనుండాల్సిందికాదు" ఆ ముందు రోజు తామిద్దరి మధ్య జరిగిన సంభాషణ క్షుణ్ణంగా విమల్‌తో చెప్పి అన్నాడు.

'జాహ్నవి నా మాటల్ని అంత డీప్‌గా తీసుకుందా?' విపరీతంగా ఆశ్చర్యపోతున్నాడు విమల్.

ఒకరోజు వర్షం పడ్తున్న రాత్రి రూమ్‌లో పడుకున్న సమయంలో ప్రేమగా ఆమె కళ్లలోకి చూస్తే

ఎన్ని రోజులయింది ఇలా మీరు చూసి అంది

ఎన్ని రోజులు కవ్వింపుగా అన్నాడతను.

మన పెళ్లికి ముందు, పెళ్లయిన కొన్ని రోజులు యిలా చూసేవాడివంతే

మరీ మన పెళ్లయి రెండేళ్లు. అప్పటిలా ఇప్పుడెలా ఉంటాం?'

అంటే నేనంటే మీకు ఆకర్షణ లేదా?" దూరంగా జరుగుతూ అంది.

"ఆకర్షణలూ ఆ ఆరాటాలు ఇప్పుడుంటవు ప్రీతి! మిగిలేది అనుబంధం, ప్రేమ, బాధ్యత."

ఆమె చప్పున లేచిపోయింది.

'అదేం వెళ్తున్నావేం?'

'పనుంది ఇప్పుడే వస్తాను. ముఖం ప్రక్కకు తిప్పుకుని వెళ్లిపోయిన భార్య ఎంతకూ రాలేదు.

ఆసీను గుర్తుకు తెచ్చుకున్నాడు విమల్.

"ఇప్పుడు నేనేం చేయాలి?" బేలగా చూశాడతను.

"రేపు గ్రూప్ డిస్కషన్‌లో మాట్లాడుకుందాం" అని లేచాడు మురళీకృష్ణ.

"ఓ.కె. డాక్టర్‌గారూ! ఈ రోజునుండి జాహ్నవితో ప్రతి స్టెప్‌లో పరిశీలించి మాట్లాడ్డం నేర్చుకుంటాను"

---

ఆ ఫేమిలీ వార్డులో ఆ మీటింగ్ హాల్‌లో ఆ రోజు గ్రూప్ డిస్కషన్‌జరుగుతుంది. పేషెంట్ల తాలూకు అటెండెంట్స్ కూడా ఈ మీటింగ్‌లో పాల్గొంటారు. ఆ అందమైన

అద్దాల రూమ్‌లో కూర్చున్న రోగులు ముఖాల్లో నైరాశ్యం. అంటెండెంట్స్ కళ్లల్లో విసుగు స్పష్టంగా తెలుస్తోంది.

డాక్టర్ పాల్, డాక్టర్ రమేష్, డాక్టర్ మురళీకృష్ణ ఓపిగ్గా పేషెంట్ల అబద్ధాలనుస్వీకరిస్తున్నారు. అటెండెంట్స్ ప్రశ్నలకు జవాబు చెప్తున్నారు మాట్లాడందల్లా జాహ్నవి ఒక్కటే. ఆమెలో పూర్తి నైరాశ్యం.

అందరూ వెళ్లిపోయాక డాక్టర్ పాల్, డాక్టర్ మురళీకృష్ణతో అన్నాడు

"నువ్వు చెప్పిందంతా అనలైజ్ చేస్తే జాహ్నవి అందరి ఆడపిల్లల్లాగే కలల్లో బ్రతికి అది నిజం కానందుకు అందరి ఆడపిల్లల్లా నిరాశపడి రాజీపడి పూర్తొక్క ఇంచుమించు పిచ్చిదయిపోయింది. నువ్వు చెప్పావు ఆ అమ్మాయి విపరీతంగా పుస్తకాలు చదివేదని, ఆ పుస్తకాల్లో రచయితలు ఆకాశంలో విహరిస్తూ వ్రాస్తారేమో! ఒక్కటీ యాదార్థానికి దగ్గరుండదు. అదే నిజమని నమ్ముతారీ పిల్లలు. పైగా ఆ అమ్మాయికి ఫ్రెండ్ సర్కిల్‌గానీ, బంధువులతో ఎక్కువ టచెస్ లేవు గనుక. ఆ అమ్మాయి తన జీవితాన్నంతా అతని చుట్టూ నిర్మించుకుంది. పెళ్లయిన క్లోజ్ ఫ్రెండ్స్ ఆమెకు లేరు కనుక వాళ్లంతా భర్తతో ఎలా వుంటారో అనేది ఆమెకు తెలీదు" ఆగాడతను.

ఆశక్తిగా చూశాడు డాక్టర్ మురళీకృష్ణ

"ఇప్పుడు మనం చేయాల్సింది ఆ అమ్మాయి తనలాంటి జీవితం ఈ దేశంలో నూటికి ఒక్కరికీ కూడా అందదనేసత్యాన్ని చెప్పాలి. అది ఆమెకు మనం తెల్పాలంటే ఆమె కొందరితో పరిచయాన్ని పెంచుకోవాలి. ఇక్కడ కూడా ఎవ్వరితోనూ కలవదని చెప్పావు నువ్వు. ఆ అమ్మాయి ఇక్కడున్న ఆడవాళ్లతో కలిసేలా చూడు. వాళ్లతో స్నేహం చేసెలా చూడు. వాళ్లకంటే తను ఎంత ఎత్తులో వుండేది ఆమె కర్థం కావాలి. సైకోథెరపీలో ఇదొక భాగం"

"అప్పుడు ఆమె జీవితంతో రాజీ పడ్తుందంటారా?" అడిగాడు మురళీకృష్ణ.

'పూర్తిగా రాజీపడకపోవచ్చు. అని సాలోచనగా చూసి ఇంకొకటి కూడా ఆ అమ్మాయి కోరుకునే దగ్గరతనం, ఆ ఆకర్షణ అతను అతిగా ఆమెకు చూపాలి. నేచురల్‌గా ఆమె కొన్ని రోజులకు అతన్నుండి డీవియేట్ అయిపోతుంది అదిసహజం. ఇప్పుడున్న ఆకర్షణ, రోజులు గడిస్తె వుండదు. అలా వుండదనే సత్యాన్ని ఆమె స్వయంగా తెలుసుకోవాలి. కాలం దాన్ని నిరూపిస్తుంది. ఈ లోపల అతను కాస్త నటించాలి" అనేసి లేచాడు డాక్టర్ పాల్.

నిమ్‌హాన్స్ ఒక రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ అదృష్టం కొద్దీ ఇంకా ఈ ఇన్‌స్టిట్యూట్ కలుషితం కాలేదు. అక్కడ ప్రొఫెసర్స్‌కు స్వంత ప్రాక్టీస్ లేదు. ఎలాంటి ఈర్ష్యఅసూయలు లేకపోవడంలో రీసెర్చ్‌కు ఎక్కువ ప్రాధాన్యత దొరుకుతుంది ఆ నిమ్‌హాన్స్ నాలుగు గోడల మధ్య.

"మీరు నాకేదోపరిష్కారాన్ని చూపిస్తాననన్నారు?" వారం రోజుల తర్వాత నిరాశ, వ్యంగ్యం, సమపాళ్లలో కలిపి అడిగింది జాహ్నవి.

ఇందులో పాపం డాక్టర్ మురళీరకృష్ణఎస్కేపిజం ఏమి లేదు. అతనికి వారం రోజులుగా హాస్పిటల్‌కు రాలేనంత జ్వరం అదే సంజాయిషీ యిచ్చి 'తప్పకుండా మీకు పరిష్కారం చూపించడమే కాదు మీరు కోరుకున్న జీవితాన్నిస్తాను' అన్నాడు.

ఇద్దరూ ఫోన్ వున్న రూమ్‌లోకి వచ్చారు.

'ఐదు నిముషాలు కూర్చోండి ప్లీజ్'

ఆమె తలెత్తి అతని కళ్ళల్లోకి, అతని మేధస్సు కందని చూపొకటి విసిరి నిశ్శబ్దంగా నల్లటి సోఫాలో కూర్చుంది. ఆమెకు కాస్తదూరంలో మురళీకృష్ణ కూర్చున్నాడు. అతనికి ఆ వారం రోజుల విశ్రాంతిలో కూడా అతని ఆలోచననిండా జాహ్నవి. ఆ ఆలోచనల్లో ఆమెకేదో సహాయం చేయాలనే తపనలో అతను ఆమెను తనకు తెలీకుండానే అభిమానించడం ప్రారంభించాడు.

ఐదు నిముషాలు నిశ్శబ్దాన్ని భరించిన జాహ్నవి తలెత్తి అతనివైపు కాస్త విసుగ్గాచూసింది. అంతవరకు జాహ్నవిలో మార్పు తేవడానికి తను వేసుకున్న పథకంలో ఎక్కడనుండి ప్రారంభించాలా? అని ఆలోచిస్తూ

"మీరు రోజూ నాతో రౌండ్స్‌కి రావాలి. ఈ ఫేమిలీ వార్డులో ఆరుగురు ఆంధ్రులున్నారు. వాళ్ళ దగ్గరకు మిమ్మల్ని తీసుకెళ్తాను" ఆమె మాట్లాడలేదు.

"ఏం రారా? ఇష్టంలేదా?"

ఇష్టం లేదన్నట్టు తలూపిందామె.

"ఎందుకని? బోరా?"

"కాదు దానివల్ల నాకేమిటి ప్రయోజనం?"

జవాబుని సిద్ధం చేసుకోవడానికి అరనిముషం పట్టింది మురళీకృష్ణకు.

'అల్టిమేట్‌గా ప్రయోజనం తప్పకుండా వుంటుంది. కానీ నాతో మీరు కోఆపరేట్‌చేయాలి. నేను ఏదిచేసినా 'ఎందుకని?' అడక్కూడదు. అభ్యంతరం పెట్టకూడదు"

ఈసారి జాహ్నవి చూసిన చూపులో కొంత ఆశ కొంత ఆశ్చర్యం.

'ఓ.కె.'

'థ్యాంక్స్ జాహ్నవీ'

---

'గుడ్‌మార్నింగ్'

'గుడ్‌మార్నింగ్' కొద్ది గంటల క్రితమే పాల్ గారితో రౌండ్స్ కొచ్చి మరలా ఈ రూమ్‌లో అడుగుపెట్టిన ఆ యువడాక్టర్ వంక ఆయన వెనుక నిల్చున్న పదో నంబరు పేషెంటు వంక కుతూహలంగా చూసింది మాధవి.

ఒకటో నెంబరు రూమ్ పెషెంటు ఈమె

'డాక్టర్ రమేష్‌గారు శెలవులో వున్నారా? డాక్టర్లతో ఇలా పర్సనల్ విషయాలు మాట్లాడే చనువు ఈ ఫేమిలీ వార్డు పేషెంట్లకు మాత్రమే స్వంతం'

"కొద్దిగా సిక్ మూవ్ కాలేనంత కాదు. ఓపికలేక మీ హిస్టరీ నన్ను తీసుకోమన్నారు"

"మరలామొదలెట్టాలానేను" అని నవ్వింది మాధవి. మాధవిలో మొండితనం లేదు. తనలో క్రొత్తగా ప్రవేశించిన ఈ వ్యాధి నుండి తనెలా అయినా విముక్తి పొంది త్వరగా తన ముగ్గురిబిడ్డల దగరకు వెళ్ళాలనే కోరిక ఆమెలో బలంగా ఉంది. ఆ కొత్త వ్యాధి తాలూకు లక్షణాలను భరించలేక భర్తను బ్రతిమిలాడుకుని ఇక్కడ కొచ్చిందామె.

"మీ హస్బెండ్ వచ్చారా?'

"ఉహు రారు. ఎక్కడ వీలవుతుంది?" అని నవ్వింది మాధవి.

"ఈరోజు వస్తానని చెప్పారన్నారు కదూ!"

"ఆ అలా చెప్తూ ఉంటారు" అని మరలా నవ్వింది. ఆనవ్వులో జీవం వున్నా లేకపోయినా అది ఆమె నవ్విన నవ్వే. అసలలా నవ్వడానికి ఆమె ఎంత సాధన చేసిందో!

"ఎందుకు రారు?" తను నోరు విప్పకూడదనుకుని వచ్చిన జాహ్నవి తాత్కాలికమైన కుతూహలంతో సంస్కారపు పరిధిని దాటేసింది.

"ఆయనకు చాలా పనులు" అని ఆ టాపిక్ నుండి డీవియేట్ చేయడానికి ప్రయత్నించబోయింది.

"మాధవీ! మీరు కూడా అబద్ధాలు చెప్తారా?" నవ్వుతూ అంటున్న డాక్టర్ వంక చూసిందామె.

"అబద్ధాలు చెప్పడం నాకు ప్రియమైన విషయమేమి కాదు డాక్టర్ గారూ! కానీ తప్పడంలేదు" అని ఆగి

'ఓ.కె. అబద్ధాలు చెప్పను అడగండి మీకేం కావాలో! కానీ ఈ నరకాన్నుండి మాత్రం తప్పించండి. నేనిక అతని గురించి పట్టించుకోను. నన్ను ఆరోగ్యవంతురాల్ని చేసి పంపిస్తే బి.ఎ. పూర్తిచేస్తాను. ఏదో ఉద్యోగం సంపాదించుకుని నా పిల్లల్ని అతని పరిధి నుండి తప్పిస్తాను' ఆమె రౌండ్స్ కొచ్చినపుడు నిల్చున్నది. ఇక నిల్చోలేనట్టు కూర్చుంది.

"అసలు అతని పరిధినుండే నీ బిడ్డల్ని తప్పించాలన్నంత విరక్తి నీకెందుకు కలిగింది?"

"అన్నీ డాక్టర్ రమేష్ గారికి చెప్పాను డాక్టరుగారూ!" "మరలాకాస్త చెప్పమ్మా"

"అలాగే అడగండి"

"కూర్చో జాహ్నవీ"

'అక్కడున్న చెక్క కుర్చీలో సంకోచంగా కూర్చుందామె. మరో కుర్చీ లాక్కుని కూర్చున్నాడు డాక్టర్ మురళీకృష్ణ. అతని చేతిలో ఆమె కేస్‌షీట్ పెన్.

"ఏమడిగారు డాక్టర్? విరక్తి ఎందుకొచ్చిందనికదూ! ఈ విరక్తి చాలా ఆలశ్యంగా వచ్చింది. ఇంకాస్త ముందు వచ్చుంటే నా బిడ్డల భవిష్యత్తు బాగుండేది." ఆమె చెప్తోంది

మాధవి మాట్లాడుతున్నట్టే వుంటుంది అన్నీ వదిలేసి తన కాళ్లమీద ఈ రోజే నిలబడ్డట్టే ప్రవర్తిస్తుంది. ఇంతలోనే హఠాత్తుగా పూర్తి విరక్తిలోకి, పూర్తి నైరాశ్యంలోకి, పూర్తి అసహాయతలోకి దొర్లిపోయి ఏడుపు తప్ప తననేదీ ఉద్ధరించలేదనే నమ్మకంతో పడిపోయి తనని తాను కంట్రోల్ చేసుకోలేనంత ఏడుపులోకి జారిపోతోంది. ఆ ఏడుపు చాలా భయంకరంగా ఉంటుంది. ఇవతలి వ్యక్తి భరించలేనంత ఉధృతంగా, వదిలి వెళ్లిపోలేనంత నిస్సహాయంగా ఉంటుంది.

"బాధ్యత లేని భర్త వుంటే ఏం? లేకపోతే ఏం చెప్పండి డాక్టర్ పోనీ మీరు చెప్పండి?"

జాహ్నవి ఉలిక్కిపడింది.

'తనస్వార్థం, తన సుఖం, తన సంతోషం, తప్ప ఆఖరుకు భార్యను, బిడ్డల్ని కూడా పట్టించుకోని భర్తను ఎందుకు పట్టించుకోవాలి?'

"లీవ్ ఇట్, లీవ్ఇట్ మాధవీ"

నవ్వింది మాధవి.

"నేను నాకీరోజు ఫ్రెష్ అయ్యాను అడగండి"

ఇప్పుడు మురళి జాహ్నవి జీవితాన్ని బాగుచేద్దామని పూర్తి సంకల్పంతో ఉన్న మురళీ కృష్ణ సైకియాట్రిస్ మురళి అయిపోయాడు ముందుకు వంగి కుతూహలంగా అడిగాడు.

"నేనో ప్రశ్న అడుగుతాను బాగా ఆలోచించి క్లియర్‌గా జవాబు చెప్పాలి మీరు"

అడగండన్నట్లు చూసింది మాధవి.

"ఈరోజు ఎందుకు ఫ్రెష్‌గా ఉంది మీకు ఆలోచించి చెప్పండి?"

"డిప్రెషన్ పేషెంటు ఈరోజు నాకు ఫ్రెష్‌గా వుందీ అంటే అందుకు కారణం వుంటే ఆ కారణంలో నుండి మందుకు తయారు చేస్తారు సైకియాట్రిస్ట్స్. ఒకటో నెంబరు రూమ్ పేషంటుకు తనేమయినా మందు తయారు చేయగలడేమోననే ఆరాటంలో ఆ ప్రశ్న వేశాడు డాక్టర్ మురళీకృష్ణ.

రెండు నిముషాలు ఆలోచించింది మాధవి.

"మీరు కారణం అడిగేదాక నా ఫ్రెష్‌నెస్‌కు కారణం నాకూ తెలియడం లేదు"

"కారణం తెలీదా?" అని నిరాశ పడ్డాడు మురళీకృష్ణ

"ఊహు మీరడిగితే తెలుస్తోంది డాక్టార్‌గారూ! నా నమ్మకాలెప్పుడూ నిజమే అవుతాయనే సత్యం మరోసారి రుజువయిందీరోజు"

"ఏమిటది?'

"మీ వారు రారనుకున్నాను రాలేదు" అని నవ్వింది కాస్త పేలవంగా.

ఈసారి పూర్తిగా నిరాశపడ్డాడతను తను ఆమెనుండి క్షణకాలం ఆశించినఆప్టిమిజం స్థానంలో పెసిమిజమ్ అతన్ని నిరాశ పర్చింది.

"అతనే కదా పాపం మిమ్మల్నిక్కడ చేర్పించింది"

"ఊ అతనేకానీ పాపం అతనాపని హృదయపూర్వకంగా చేయలేదు. బంధువుల బలవంతం మీద చేశాడు"

"అంటే అతనికి మీ మీద ప్రేమ లేదా? లేక మీరేమయిపోయినా బాధ లేదంటారా?" ఒక్కక్షణం ఆలోచించింది.

"ప్రేమ ఉందో లేదో నికింతవరకు తెలియదు డాక్టరుగారూ! ఒక్కటిమాత్రం నిజం నేనేమయిపోతున్నానాననేది మాత్రం ఆయన పట్టించుకోరు బహుశా నేను చచ్చిపోతే ఏడ్వొచ్చు"

"అదేమిటమ్మా అలా అంటావు"

ఆమె నవ్వింది. "నిజం చెప్పమన్నారుగా"

"ఓ"

"కాదు డాక్టరుగారూ! దీన్నేమంటారో మీరు చెప్పండి పోనీ! అతనికి పిల్లల చదువులు ఏమయిపోతున్నాయో తెలుసుకోవాలనే జిజ్ఞాసే ఉండదు. భార్య ఎవరితోనైనా లేచిపోతుందేమోననే స్పృహే ఉండదు"

మురళీ కృష్ణ ఆశ్చర్యపడలేదుగాని జాహ్నవి ఉలిక్కిపడింది.

ఓ అయినింటి ఆడపిల్ల నోటిగుండా అదేం మాటలు? కానీ ఒక్కటి నిజం ఎంత విసిగిపోకపోతే అయినింటి ఆడపడుచు అలా మాట్లాడుతుంది?

"అతను సంస్కారవంతుడు కనుక మిమ్మల్ని అలాంటిదృష్టితో అనుమానించ లేదని మీరెంకనుకోరు?"

"ఆవిషయం ఊరికే ఉదాహరణకు చెప్పానంతే 'అంతస్పృహ ఒంటిమీదవుండదు ఇంటి విషయంలో' అనిచెప్పడానికే చెప్పాను. నేను సినిమా కెళ్లినా 'ఎవరితో వెళ్లాలని అడగరు 'ఎందుకెళ్లావని' అనరు. పిల్లలు రాత్రి తొమ్మిది దాటి ఇంటికి రాకపోయినా 'ఎక్కడకెళ్లారో' అని బాధ పడరు. ఈ మనస్తత్వానికి ఏం పేరు పెట్టమంటారు?'

"అయితే మిమ్మల్ని హింసించదన్నమాట" ఊడిపోయిన కుర్చీ చెయ్యి రిపేర్

చేసే ప్రయత్నం చేస్తున్నాడు అసంకల్పితంగా మురళీ కృష్ణ.

ఆమె నవ్వింది చాలా విరక్తిగా.

"ఇంతకంటే ఏం హింసించాలి? రోజంతా ఆయన లోకం ఆయనది. నా లోకం నాది ఇంత మాత్రానికి పెళ్లెందుకు?"

'నిజమేకదా పాపం' అన్పించింది జాహ్నవికి

"అందుకా మీరు బాధపడుతున్నారు?"

"ఊహు!" వేగంగా తలత్రిప్పిందామె.

"లేదు. ఆ సున్నితమైన భావాలు పోయాయి. ఇప్పుడు నాకున్న బాధల్లా నా పిల్లలకు వాళ్ల తాత మిగిల్చిన ఆస్తిలో పదో వంతయినా మిగులుస్తాడా ఇతనని?"

"మిగల్చక ఏం చేస్తారు?"

"ఏం చేయరు? ఏదో చేసి బిజినెస్‌లో మోసగించబడ్డా అయ్యా! అనుకుందును. కేవలం బాధ్యతా రాహిత్యం, తన స్వార్థం, తన సుఖం, దానికోరకు తన చుట్టూ చీమల్లా స్నేహబృంధం"

'అయితే అతనెందుకు పెళ్లి చేసుకున్నట్టు?" గొణిగినట్టుగా అంది జాహ్నవి.

"జాహ్నవి వైపు తల తిప్పింది మాధవి."

"అదీ బాధ్యతా రాహిత్యమే. తనకి పెళ్లి అవసరమో, అనవసరమో అనుకోకుండా తల్లిదండ్రులు చేసుకోమన్నారుకనుక చేసుకోవడం"

"అతన్ని మీరు మార్చడానికి ప్రయత్నించాలేగాని, ఈ జబ్బు నయమయితే పిల్లల్ని తీసుకుని ఎటో పోతాననుకోవడం బాగలేదు" ఆమె రియాక్షన్ కొరకు ఎదురుచూస్తూ అన్నాడు మురళీకృష్ణ.

'అతను మారడని నాకర్థమయిపోయింది. అందుకే అతని పిల్లలయినా నా బాధ్యతా రాహిత్యాన్ని నేర్చుకోకూడదనే వాళ్లను దూరం చేయాలనుకునేది డాక్టరుగారూ!"

'డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడలేదు. 'ఎలాంటి ప్రశ్నలు వేస్తే మాధవి బాధపడకుండా వుంటుందో! జాహ్నవి మాధవి జీవితాన్ని అర్థం చేసుకుని తన జీవితంతో పోల్చి చూసుకుని తృప్తిపడుతుందోనని ఆలోచిస్తున్నాడు.

"నేనూ భార్యనే నాకూ సుఖపడాలనే ఉంటుంది. శాంతిగా బ్రతకాలనే ఉంటుంది. అదిమీరు మరిచిపోకూడదు. భార్యాత్వాన్ని, సంసార జీవితాన్ని, సాంఘిక భద్రతకూడా వదులుకుని వెళ్లడానికి నేను సిద్ధపడ్డానంటే అతని వ్యక్తిత్వాన్ని మీరు అంచనా వేసుకోవచ్చు"

---

"జాహ్నవీ మీతో ఏమి మాట్లాడలేదారాత్రి మాధవిని గురించి?"

త్రాగిన కాఫీ కప్పు క్రింద పెడ్తూ ఆసక్తిగా అడిగాడు డాక్టర్ మురళీకృష్ణ.

"చెప్పింది" ఎడ్జ్‌లో వున్న కప్పును సెంటర్‌కి జరుపుతూ తలాడించాడు విమల్

"ఏమి చెప్పింది"

"మాధవి భర్తను గురించి అతన్ని జాహ్నవి బాగా అసహ్యించుకుంటోంది"

"అంతేనా? ఆ తర్వాత మీ ఆదరణను అతని నిరాదనరణతో పోల్చి చూసుకోలేదా?" కాస్తయినా థ్యాంక్స్ చెప్పే హావభావాలేమీ ప్రదర్శించలేదా?" నవ్వాడతను దిగులుగా మానసికవైద్య రంగంలో ఇప్పుడే తొలిపాదం మోపుతున్న మొదటిలో ఏంక్సైటీ

"ఈ రోజు కూడా మీతో నేను రాండ్నా?" ఈ రోజు ఆమె కాస్త ఉషారుగా వచ్చింది కిచెన్ నుండి.

"రావడానికి మీకభ్యంతరమా?"

లేనట్టు తలూపిందామె.

"సింప్లీ, మీకు కాలక్షేపంగా ఉంటుందనీ అంతే"

"వెళ్లనా?" భర్తవైపు తిరుగుతూ అడిగిన జాహ్నవి ప్రసన్నమైన ముఖం క్షణంలో మలినమయింది.

"వెళ్లు"

ఆ వెళ్లు అనే పదం ఆమె మానసిక ఆరోగ్యం మీద మరో దెబ్బతీసింది.

"ఊహు. వద్దు" అనే అక్షరాల రూపంలో 'నువ్వు లేందే నేనుండలేను' అనే బాధ మిశ్రమాన్ని ఆమె గాఢంగా వాంఛించింది.

"పదండి" నీరసంగా కదిలిందామె.

భార్యముఖంలో వేదనని విమలం గమనించలేదుగాని డాక్టర్ మురళీ కృష్ణ దృష్టినుండి అది తప్పించుకోలేదు. అయినా అతను వదలదల్చుకోలేదు. 26

ఆమె ముందు అతను వెనుక

# 5

'తప్పంతానీదే. నీవల్లే నేనిలా ఈ హాస్పిటల్ బారిన పడ్డాను'

'తప్పునాదా?' ఆమె కంఠంలో కన్నీళ్లు

ఆరో నెంబర్ రూమ్‌లో అడుగుపెట్టిన మురళీకృష్ణ ఆగిపోయాడు. రూమ్ నెంబర్ పదినుండి బయలుదేరేప్పుడు జాహ్నవి ముందున్నా డాక్టర్ మురళీకృష్ణ అడుగులు పెద్దవి. రూమ్‌నంబర్ ఆరో కొచ్చేసరికి అతనే ముందున్నాడు.

"ప్లీజ్ ఆగండి" ఆమె అడుగులు అబ్‌రప్ట్‌గా నిల్చిపోయాయి.

"నువ్వు బాగుంటే నేనెందుకు తాగుతాను?"

"నేను మీకు నచ్చలేదు, నా ప్రవర్తన మీకు నచ్చలేదు, అయితేమాత్రం మీ జీవితాన్ని తాగి నాశనం చేసుకోమన్నానా?"

"ఏం చెయ్యాలి మనశ్శాంతి లేకపోతే"

"ఇప్పుడు నాకూ మనశ్శాంతి లేదు, నేనూతాగనా?"

"ఇలా బయట నిల్చుని వాళ్లమాటలు వినడం సభ్యతకాదు" చాలా తగ్గుస్వరంతో అంది జాహ్నవి.

చిన్నగా నవ్వాడు మురళీకృష్ణ

"కానీ నేను సైకియాట్రిస్ట్‌ని. వాళ్ల ఫ్యామిలీ విషయాలు వాళ్లు చెప్పనవి, చెప్పలేనివి ఇలా కొన్ని చాలా తెలుస్తూ ఉంటాయి. ఇదీ మా ప్రొఫెషన్‌లో ఒక భాగం'

ఆమె మరి మాట్లాడలేదు.

"తాగు. వద్దన్నానా?"

"అదొక్కటే తక్కువ ఈ బ్రతుక్కి"

"అంటే త్రాగాలని ఉందన్న మాట" అతను వ్యంగ్యంగా నవ్వుతున్నాడు.

'ఆ నవ్వు... అలాంటి నవ్వు విమల్ ఒక్కసారి నవ్వినా తను భరించగలదా?' క్షణంలో క్షణం సేపు జాహ్నవిలో కంపేరిజన్... ఏదో తృప్తి

"మే ఐ కమిన్"

తుళ్ళిపడ్డట్టుగా చూసిందామ్మాయి. ఆ అమ్మాయిని చూసి ఆశ్చర్యపోయింది జాహ్నవి. ఆ పిల్లకు నిండా పది హేడేళ్లుండవు. తెల్లగా విరబూసిన కలువ పూవులా వుంది. ఆడుతూ పాడుతూ చదువుకోవాల్సిన వయస్సు, అప్పుడే జీవితం అయిపోయింది.

"ఏమిటమ్మా పోట్లాడుకుంటున్నారా?" చనువుగా కుర్చీలాక్కుని, కూర్చుని మరో కుర్చీ కాస్త ముందుకు లాగాడు జాహ్నవిని కూర్చోమన్నట్టుగా.

ఆ అమ్మాయి మాట్లడలేదు. ఆ పిల్ల కళ్లల్లో నీళ్లు కన్పించకుండా తలదించుకుంది "ఏముంది? మా ఇద్దరికిది మామూలే" అని నవ్వాడాయువకుడు.

అతను చాలా అందంగా ఉన్నాడు ఆ అబ్బాయికి సరి అయిన జత ఆ అమ్మాయి. ఇద్దరికీ జీవితం మొదలెట్టే దశే అయిన ఇద్దరి కళ్లక్రిందా నల్లటిమచ్చలు.

'ఇంతకీ ఏమిటి తగువు? చెప్పండి తీర్చేస్తాను... అన్నట్టు ఈ అమ్మాయి నాకు దూరపు బంధువవుతుంది పేరు జాహ్నవి ఊర్కేనాతో వచ్చింది మీకు అభ్యంతరం లేదుగా'

అతను కాస్త బిగ్గరగా నవ్వాడు.

'భలేవారే మా జిల్లా అంతా మావిషయం తెల్సు, పరాయి జిల్లా ఆమెగార్కి తెలిస్తే ఏమయింది?'

అతని భార్య పేరు రూ. ఆమె కుంచించుకున్నట్టు ముడుచుకుపోయింది.

ఆ యువకుడే మొదలుపెట్టాడు.

"ఈమె నన్ను లాల్‌బాగ్‌కు రమ్మంటుంది. రానంటే రావాలని మొండికేస్తోంది. చెప్పండి డాక్టర్ నామనోపరిస్థితి వెళ్లగలిగినట్టుందా? ఇప్పుడిప్పుడే తాగుడు మరిచిపోతున్నాను. ఈమె సరదాలు ఈమెవి. ఈమెందుకిక్కడనాకు?" ప్రసన్నంగా మొదలెట్టిన అతను ఆవాక్యం పూర్తయ్యేలోపల ఉద్విగ్నుడయ్యాడు.

మురళీకృష్ణ అతన్ని ఆపుతున్నట్టుగా కాస్త చెయ్యిగాలిలోకెత్తాడు "నో.. నో. మేమే ఆ అమ్మాయిని మిమ్మల్ని అలా షికారుకు తెసుకెళ్లమన్నాము. మీ మూడ్ మారుతుందని, ఇందులో ఆమె తప్పులేదు"

"మీరు ఆమెని సమర్థించకండి డాక్టర్. మీకు తెలీదు ఈమె ఉత్త సరదాల మనిషి"

ఆమె తల ఇంకా భూమిలోకి దిగిపోయింది.

"పోనివ్వండి అలా బయట కుర్చుందాం, రండి ఏమీ తోచడం లెదు. సమ్మర్ అయినా కొంతహాయి. ఐదయ్యేసరికి కొంతగాలి వీస్తోంది"

"ఊహూ నేనురాను ఆవిడగారు వస్తారేమో తీసుకెళ్లండి" ఆ అమ్మాయి ఈసారి తలెత్తింది చురుగ్గా చూసి ఏదో అనబోయి ఆగిపోయింది.

"మీకు ఈగదిలో ఈ డార్క్‌నెస్‌లో ఫ్రెష్‌గా ఉండదు. మీరిలారండి. ఆమె ఈ లోపల వంట చేస్తారనుకుంటాను. ఏమ్మా?"

ఆమె తలూపింది. ఆ తలూపడంలో కాస్త విసుగుంది. ఆ విసుగును కంట్రోలు చేసుకుంటున్న చర్యా వుంది.

"నేను రాను' మొండిగా అన్న ఆయువకుణ్ణి చూసి

'ఓ.కె. రేపు కలుద్దాము మీటింగ్ హాల్‌లో' అని కదిలాడు డాక్టర్ మురళీకృష్ణ అతని వెనుకేలేచి నిల్చుంది జాహ్నవి. ఆమెతోపాటు రూప కదిలింది కానీ ఆమె తలెత్తలేదు.

"ఆ పసిపిల్ల తన జీవిత విధానానికి ఎంత కించపడ్తోంది! ఒకరి ముందు తన ధౌర్భాగ్యపు జీవితాన్ని పరచడానికి ఎంత లజ్జపడ్తోంది!! అంది ఆమె నిల్చున్న తీరు,

తలవంగిపోయిన తీరులోనే తెలుస్తోంది. ఆ అమ్మాయిని చూస్తే జాహ్నవికి జాలేసింది.

"వెళ్లిపో, ఇలాంటి భర్త నీకు లేకపోతేనేం వెళ్లి స్వతంత్రంగా బ్రతుకు" అని చెప్పేయాలన్నంత ఆవేశం వచ్చింది.

"ఏం అలావున్నారు? నీరసంగా వుందా? వుంటె వెళ్లిపడుకోండి రేపు వద్దురు గాని" రౌండ్స్‌కు.

క్షణం మౌనంగా ఉన్న జాహ్నవి హఠాత్తుగా అంది.

"ఆ అమ్మాయి ఆ అబ్బాయికెందుకు విడాకులివ్వలేదు" నవ్వాడు మురళీకృష్ణ "అలా విడాకులివ్వాల్సి వస్తే.... ఇస్తే బహుశా మనదేశంలో తొంబైతొమ్మిది పర్సెంట్ ఆడపిల్లలు భర్తల్ని వదిలేయాల్సిందే."

"అలా ఎందుకనుకుంటారు మీరు వాళ్ల ప్రవర్తన నచ్చనపుడు భార్య విడాకులిస్తుందని భయంతో అప్పుడు ఈ భర్తమహాశయులు ఇంత నిరంకుశులుగా ఉండరేమో!"

నిట్టూర్చాడు డాక్టర్ మురళీకృష్ణ. జాహ్నవి ఆలోచించాల్సిన కోణంలో ఇంకా ఆలోచించడం లేదు.

"ఊహూ అది పరిష్కారం కాదు జాహ్నవీ"

"మరేది పరిష్కారం?"

దాని జవాబు మురళీకృష్ణ దగ్గరలేదు అయినా ఏదో థియరీ తీసుకొచ్చి ఏదో చెప్పబోయేంతలో ఆ వార్డ్ మధ్యలోనున్న లాన్‌లోనుండి కాస్త పెద్దగానే మాటలువినిపిస్తున్నాయి.

"ప్లీజ్ సూర్యా! అనవసరంగా లేనిపోనివి కల్పించుకుని జబ్బు తెచ్చుకున్నావు. కాస్త తెలివిగా ఆలోచించు నువ్వు నా భార్యవు, ఇరవై ఐదు సంవత్సరాలు కలిసి నాతో బ్రతికిన భార్యవు, నువ్వంటే నాకయిష్టం ఎందుకు కలుగుతుంది?"

అటు తిరిగింది జాహ్నవి తమకు చాలా దగ్గరలో ఓ జంట, ఎదురుగా నలభై సంవత్సరాలామెదివయస్సులో అద్భుతమైన అందమై ఉండాలి. ఆ ఛాయలు ఇంకా ఆమె తెల్లటి ముఖం మీద కన్పిస్తూనే ఉన్నాయి. వయస్సు తెచ్చిన చిన్న చిన్న మార్పుల మధ్యగా.

ఆమె ఏమి మాట్లాడలేదు. విరక్తిగా చూస్తోంది. తనకు జీవితం అయిపోయినట్లుగా చూస్తోంది.

డాక్టర్ మురళీకృష్ణ మౌనంగా నిల్చొనున్నాడు. జాహ్నవి అటే చూస్తోంది. ఆ తర్వాత వాళ్లిద్దరూ ఏమీ మాట్లాడుకోలేదు. అతను వీళ్లను చూసే అవకాశం లేదు. ఆమె మాత్రం ఒకసారి తలెత్తి చూసి తలదించుకుని పచ్చగడ్డిని పీకుతూ కూర్చొనుంది.

"రండి ఈరోజు నా ఆఫీస్ రూమ్‌కెళ్దాం" సంకోచిస్తున్నట్టుగాచూసి సరేఅంది జాహ్నవి.

"ఫైవ్ మినిట్స్‌లో వస్తాను విమల్ గూడా వస్తాడేమో కనుక్కుంటాను"

"ఓ.కె. రమ్మనండి"

"డాక్టర్ మురళీ ఆఫీస్‌రూమ్‌కు రమ్మంటున్నారు. మీర్దూరండి వెళ్దాం" నిద్రపోతున్న భర్తమీద చెయ్యివేసి, అతనులేవగానే అడిగింది జాహ్నవి. అతన్ని చూస్తే చాలా ఆశ్చర్యంగా ఉంటుంది జాహ్నవికి. ఎంత చప్పున నిద్రపోగలడో అంత ఫ్రెష్‌గా లేవగలడు. తనకు నిద్రరావాలంటే ఎంతో తపస్సుచేయాలి. మధ్యాహ్నం నిద్రయితే నిద్రనుండి లేవడానికే అంత ప్రయత్నించాలి, చప్పున పడకమీద నుండి లేవలేదు. లేస్తూ

మరలా మగతగా అన్పించి పడుకుండూ మరలా ఎవరో తట్టిలేపినట్టు మేల్కొంటూ... గుండెల్లో గుబగుబలాడే దిగుల్ని జీర్ణం చేసుకుంటూ.... అరడజనుసార్లు ఈ తతంగం జరిగితేగాని పడక దిగలేదు. దిగినా కూడా ఉషారుగా ఉండదు. మత్తుగా, దిగులుగా, నిస్సత్తువగా... విమల్ అలాకాదు అది పగటినిద్రగానీ, రాత్రినిద్రగానీ ఎంతగాఢ నిద్రలో లేపినా సరే లేవాల్సిన టైమ్‌లో లేచినట్టుగా నవ్వుతూ లేస్తాడు. కబుర్లు చెప్తూ చెప్తూనే క్షణంలో నిద్రలోకి జారుకుంటాడు. ఒక్కోసారి విమల్‌ని చూస్తే తనకెంత అసూయగా ఉంటుందో! అతను నిద్రపోయాక ఎంత తనకలాడాలనీ నిద్రపోవడానికి! కానీ పాపం విమల్ తను నిద్రలో వున్నపుడు ఎంత అవసరమొచ్చినా డిస్ట్రబ్ చేయడు. ఆయనకు తెలుసు తను మేల్కొంటే మరలా తనకి నిద్రపట్టదని.

"పదవెళ్దా" చొక్కా వేసుకుని కదిలాడు విమల్.

"ఎప్పుడు పడుకున్నారు?"

"ఇప్పుడే పదినిముషాలయింది"

"అయ్యో లేపేశాను. పోనీ పడుకుంటారా?"

తన భార్య చూపే ఈ ఆప్యాయత ఈ ప్రేమ అతన్ని ఆమెచుట్టూ అల్లుకునేలా చేస్తుంది. ఆమె అడిగే ఏ కోరికా అతనికి విసుగనిపించదు. ఆమెకోరే ప్రతి కోరికలో తను ఆమెకు ప్రతిక్షణమూ కావాలనే అర్థం స్పష్టంగా ఉంటుంది. ఆ ప్రేమే అతనికి కావాలి. భార్యదగ్గరనుండి అతను కోరుకునే మొదటిది ఆమె ప్రేమ.

"ఫర్వాలేదు రాత్రికి మరలా నిద్రపోవచ్చుగా పోదాంపద"

"తల చెదిరిపోయింది దువ్వుకోండి"

"దువ్వుకోవాలంటావా? బాగాలేనా?"

"బాగున్నారు" నవ్వింది జాహ్నవి. "దువ్వుకోండి ఇంకా బాగుంటారు"

అతను నవ్వాడు. విమల్ నవ్వు పెద్దరికంగా, కొద్ది గంభీరంగా వుంటుంది.

అద్దంముందు కూర్చుని తలదువ్వుకుంటున్నాడు. ఆమె అతని వెనుక మోకాళ్లమీద కూర్చుని అతని మడుముచుట్టూ చేతులుపోనిచ్చి అతని పొట్టమీద గిలిగింతలు పెట్టింది.

'ఎన్నిరోజులనీ, ఎన్ని రోజులకి చూస్తున్నాడు జాహ్నవిలో ఈ అల్లరిని! ఎంత ప్రియమైన అల్లరి తనకిది!!'

"ఏమిటి..... ఏమిటిది ప్రీతీ!"

"ఏమీలేదు.." ఆమెలేచి నిల్చుంది.

"ఏమీ బాగాలేదు మరలా దువ్వుకోండి" అతను కష్టపడి అందంగా నిలిపిన క్రాఫ్‌ని చెదరగొట్టేసింది.

విమల్ వెనక్కుతిరిగి భార్య కళ్లల్లోకి చూశాడు.

"చాలా బావున్నావు ప్రీతీ!"

ఆమె ముఖం చప్పున నల్లబడిపోయింది.

'నిజమే! ఇప్పుడు మనసు బాగుంది. మరి ఎప్పూడూ ఇలా ఎందుకుండదో అర్థంకాదు'.

అతను ఆమె చెయ్యిపట్టుకుని ముందుకి, తన ఎదురుగా వచ్చేలా లాక్కున్నాడు.

"ఎప్పుడూ ఇలాగే వుంటావు ప్రీతీ. ఇంకెంత ఇంకొన్ని రోజుల్లో."

"నిజంగానా?" నిజంగా బాగైపోతానంటారా? నాకూ మీలా ఎప్పుడుపడ్తే అప్పుడు

నిద్రపడుతుందంటారా?"

"ఎందుకుపట్టదు? బాగా పడ్తుంది?" అని ఆమె చేతిలో దువ్వెన పెట్టాడు

"నువ్వు దువ్వు"

"ఎలా దువ్వను"

"నీకు నచ్చేలా ఎలా అయినాసరే"

ఆమె దువ్వూ తూ ఆగి అతని గడ్డం పట్టుకుని ముఖం ఎత్తింది.

"మీకు నిద్ర అలా ఎలాపడ్తుందండీ?"

"ఎలా అంటే... అంటే... ఏమో అదే వచ్చేస్తుంది, ఎందుకు?"

"మీకు కళ్లుమూసుకున్నాక ఆలోచనలు రావా?" అతని తలమీద తన చెంప ఆనించుకుంది. ఆ క్షణంలో ఎంతో విశ్రాంతిగా అన్పించిదామెకు.

"ఆలోచనలా? ఏమాలోచనలొస్తాయి! ఏమీరావే" ఆమె తలమీద చెయ్యివేస్తూ చెప్పాడు.

"ఆలోచనలు రాకుండా ఎలా ఉంటాయండీ? మీరు ప్రొద్దుటినుండి సాయంత్రందాకా చేసే పనులగురించి ఆలోచనలు రావా?" తలెత్తి ఆశ్చర్యంగా చూస్తూ అంది.

"ఎందుకురావు? ఆపని చేసేప్పుడు వస్తాయి పడుకున్నపుడు ఏవీ గుర్తుకురావు"

"ఎంతదృష్టవంతులు! నాకు ఒక్క రోజువికావు ఆ నెలపొడవునా జరిగినవన్నీ ముందు ముందు జలగాలనుకున్నవన్నీ ఇక ఎప్పుడూ టైమ్‌లేనట్టు నాకు అప్పుడే గుర్తొస్తాయి". దిగులుగా అంటున్న భార్యవైపు జాలిగా చూశాడు విమల్.

"అది జబ్బంటున్నారుగా డాక్టరుగారు. అంతా బాగయిపోతుందిలే ప్రీతీ!"

"ఏమో! రాత్రిళ్లు మరీ నరకంగా వుంటోంది. మీరు నిద్రపోతారు. నాకేమో మీతో నాకు నిద్రొచ్చేదాకా కబుర్లు చెప్పాలనిపిస్తుంది. మరలా నిద్రపోతున్న మిమ్మల్ని లేపాలన్పించదు"

అతను తన భార్య రెండు చెంపల్ని తవ దోసిట్లోకి తీసుకున్నాడు. "సారీ ప్రీతీ!" నేను గమనించలేదు. ఈరోజుటినుండి నువ్వు నిద్రపోయాకే నేను నిద్రపోతాను. ఓ.కె.

"పాపం మీకు నిద్రొస్తుంది"

"రాదులే నువ్వు రౌండ్స్‌కి, కాన్ఫరెన్స్‌హాల్‌కి వెళ్లినపుడు నేను బాగా నిద్రపోతాలే" విమల్ దువ్వెన చేతిలోకి తీసుకున్నాడు.

"అవును దొరగారికి పడకమీద వాలేదే తడువు నిద్రవచ్చేస్తుంది" కాస్త తేలికపడిన మనసుతో జోక్ విసిరింది జాహ్నవి. హాయిగా ఊపిరి తీసుకున్నాడు విమల్

---

పూలచెట్ల మధ్య కుర్చీవేసుకుని ఆకాశంలోని చంద్రుణ్ణి చూస్తూ తన పెషెంట్ల మనస్తత్వాన్ని తల్చుకుంటున్నాడు డాక్టర్ మురళీకృష్ణ.

"డాక్టర్‌గారూ!"

"అరే విమల్‌గారా! ఏమిటి ఇలా వచ్చారు రండి కూర్చోండి" జాహ్నవి ఎక్కడికెళ్లిందేమిటి? మీరు ఫ్రీగా వున్నారు.

కొద్దిగా సిగ్గుపడ్డాడు విమల్. జాహ్నవి తనని ఒంటరిగా వదలదని అక్కడ స్టాఫ్ అందరికీ అర్థమయిపోయింది. ఆ లజ్జాభావం నుంచి ఓ గర్వపురేఖ కూడా అతని మనసుకు తాకింది.

"కిచెన్‌లో వుంది మాధవిగారితో కబుర్లు చెప్పుకుంటోంది. మీకు హోమ్‌సిక్‌గా

ఉంటుందా ఎప్పుడైనా"

"ఎందుకుండదు? వుంటుంది కాని పోస్టు గ్రాడ్యుయేట్‌ని కదా! ఇంతకు ముందుకంటే కొంత రెస్పాన్సిబులిటీ ఫీల్ అవుతాము కదా! అందుకే కొంత తక్కువనే చెప్పాలి"

"చెట్లు చాలా బాగా పెంచారు"

"ఇక్కడ చెట్లు పెంచక్కరలేదండీ అవే వచ్చేసాయి. వీటిని చూసి ముచ్చటపడి ఎన్నిసార్లు నర్సరీలో చెట్లు తీసుకెళ్లి మా విజయవాడలో నాటానో ఏదో ఒకటో అరా బ్రతికినా ఇంత నవనవలాడ్తూ ఉండవు. ఇక్కడ రోజెస్ తీసుకొళ్లి అక్కడవేస్తే ఓ సంవత్సరం రోజులు ఒకటి అరా పువ్వులు పూసి సమ్మర్‌కల్లా చచ్చిపోతాయి"

"నిజమే అసలు ఇంతింత పెద్దపూలు మనకు పూయవు" విమల్ మాట కలిపాడేకాని అతనికిలాంటి కబుర్లతో టైంవేస్ట్ చేయాలని లేదు. జాహ్నవికి నయమవుతుందో లేదో తెలుసుకోవాలనుంది. ఎప్పటికి నయమవుతుందో అడగాలనుంది కానీ అతనేమనుకంటాడో!

విమల్ ఆరాటం డాక్టర్ మురళీకృష్ణకు అర్థమయింది.

మీరు జాహ్నవి గురించి చాలా వర్రీ అవుతున్నట్టున్నాడు. మీరు గాభరాపడాల్సినంత పెద్ద జబ్బేమీ కాదామెది. ఆమెది కాస్త సున్నితమైన మనస్సు దానికి తోడు కాస్త భావుకత జాస్తి. చిన్నదానికే నిరాశపడేతత్వం, విపరీతంగా ప్రేమించే మనస్సుతోపాటు అలాగే ప్రేమించబడ్డాలనే కోరిక ఇవన్నీ కలిసి ఆమెనిక్కడదాకా తీసుకొచ్చాయిగానీ నిజానికిది పెద్ద మానసిక జబ్బేమీకాదు.

"అంతేనంటారా?" గుప్పెట్లో వున్న గడ్డిని నలుపుతూ సిగ్గుపడ్తున్నట్టుగా అడిగాడు.

"అవును విమల్ ఒక నిజం చెప్పనా? ఆమెకు మీరుకాకుండా కాస్త కఠినమైన మనస్సుండే భర్త దొరుకుంటే జాహ్నవే అడ్జస్ట్ అయ్యుండేది"

"అదేంటీ?" ఆశ్చర్యపోయాడు విమల్.

"నా అనుభవంలో ప్రియంగా చూసుకున్న భర్తలున్న భార్యలకే ఇలాంటి జబ్బులొస్తున్నాయి"

"అయితే నేను కఠినంగా వుండాలంటారా?"

"ఇప్పుడు మీరు కఠినంగా మార్తే ఇంకా ఆమె దెబ్బతింటుంది"

"అసలు నేను ఆమెను నొప్పించలేనులెండి"

నవ్వాడు మురళీకృష్ణ

"అందుకే చెప్తునాను. మిమ్మల్ని అర్థంచేసుకున్నాక ఆమె మారుతుంది. మా మందులు, మా ప్రయోగాలు అక్కరలేదు ఆమే మార్తుంది" అంటే ఆమెను కాలమే మారుస్తుంది.

"కాలం మారుస్తుందా?" అనుమానంగా చూశాడు విమల్.

"కాలం అంటే నా ఉద్దేశ్యం అనుభవాలు తన జీవితం నుండి ప్రక్క వాళ్ల జీవితాలనుండి ఏరుకున్న వాటితో మార్తారు"

"మీకు నమ్మకం కలుగడంలేదు అవునా!"

విమల్ నవ్వాడు మెల్లిగా. అది చూసి అన్నాడు డాక్టర్ మురళీకృష్ణ.

"ఆమె ఇప్పుడు కలల్లో బ్రతికే ఆడపిల్ల. బాధ్యతలు నెత్తినపడ్డాక ఆమే మార్తుంది"

"ఇక్కడ మారదంటారా? ఇంకా చాలాకాలం ఎదురుచూడాలా?" నిరాశపడ్డాడు

విమల్.

"లేదు ఇప్పటికే ఆమె చాలా మారింది మీరెళ్లే లోపల మార్తుంది నిరాశపడకండి, మా మీద కాన్ఫిడెన్స్ వుంచండి"

నిరాశపడ్డ విమల్‌ని చూస్తే చాలా జాలేసింది మురళీకృష్ణకు.

'తప్పకుండా విమల్ ఇంకో నెలచాలు. ఇంకో నెలలో మీ జాహ్నవి మీ పెళ్లికి ముందు జాహ్నవిలా మార్చేపూచీ నాది.'

"థాంక్స్ డాక్టర్" అతని కళ్లు మెరిశాయి.

"ప్రతిరోజూ జాహ్నవిని నేను రౌండ్స్‌కి తీసుకెళ్లేది ఆమె జీవితాన్ని ఇతరుల కష్టాలతో పోల్చుకుని తృప్తిపడి మీ ఆదరణను అర్థం చేసుకుని మామూలు జాహ్నవిగా మారాలనే ఆశతోనే విమల్"

"నాకు తెలుసు డాక్టర్‌గారూ! కానీ ఏమందులూ లేకుండానే జాహ్నవి జబ్బు నయమయిపోతుందంటారా?" సంకోచం వదిలి అడిగాడు.

"తప్పకుండా డ్రగ్స్ మీద ఆధారపడకూడదనే మా కోరిక"

"మీరు రెస్ట్ తీసుకునే టైంలో కూడా మిమ్మల్ని విసిగించాను సారీ డాక్టరుగారూ!"

"ఫర్వాలేదు. మాటల్లోపడి కాఫీ అయినా ఇచ్చానుకాదు ఒన్‌మినిట్"

లోపలకెళ్లబోతున్న డాక్టర్ని ఆపాడు విమల్.

ఇంక బలవంతం చేయలేదు డాక్టరు మురళీకృష్ణ.

## 6

"రౌండ్స్‌కు రావా?' అని అడుగుతున్నారు డాక్టరుగారూ" భార్య భుజం మీద చెయ్యివేస్తూ అన్నాడు విమల్.

'పదండి'

'ఇలాగే వెళ్తావా?'

'మన వార్డేకదా!' కుచ్చిళ్లు సరిచేసుకుంటూ అంది.

డాక్టర్ మురళీకృష్ణ వెనుక ఆమెనడిచింది.

బెదిరిపోయినట్టుగా మూడో నంబరు గది మధ్యలో నిల్చోనుంది యాభైసంవత్సరాలామె. బెడ్‌మీద కూర్చున్న వ్యక్తి కళ్లు ఎర్రగా, అగ్నిగోళాల్లా ఉన్నాయి. అతని పెదాలు మాటలు అప్పుడే ఆపిన సూచనగా ఇంకా కదుల్తూనే ఉన్నాయి. బాత్‌రూమ్ వాకిట, బిక్కుబిక్కుమని నిల్చుంది పదిహేడేళ్లమ్మాయి. ఓ ప్రక్కగా నిర్లక్ష్యంగా, విసుగ్గా నిల్చునున్నాడు ఇరవై సంవత్సరాల యువకుడు. గది మధ్యలో చాప మీద ఏడవబోయి అదిరిపోయి ఆగిపోయినట్టుగా నోరు తెరుచుకుని కూర్చొనుంది ఏడేళ్ల పాప.

అది జాహ్నవి డాక్టర్ మురళీకృష్ణ రూమ్‌లో అడుగుబెట్టబోయేముందు ఆ గది సౌందర్యం!

"ఇంకా కదలవేమే ముదనష్టపుదానా? నీక్కాదూ చెప్పేది నేను ఆ మురికి పంచె కట్టుకోనని."

ఆమె కదలబోయి గుమ్మంలో డాక్టరుని ఓ అపరిచిత వ్యక్తిని చూసి ఆగింది. మూడో నంబర్ రూమ్ రోగి ప్రతాపరావు తలతిప్పిచూసి, వాళ్లతో తనకు పనిలేనట్టుగా మరలా గొంతెత్తాడు.

"ఏం? వీపువిరగాలా? కదలవేం?" ఆమె తలవంచుకుని లోపలికెళ్లింది. ఆ పదిహేడేళ్ల ఆడపిల్ల తెలివి తెచ్చుకున్నట్టుగా కుర్చీ ముందుకు జరిపింది.

ఓ వారగా కూర్చున్న వి ...రావు "కూర్చోండి" అని తన బాధ్యత తీర్చుకున్నట్టుగా బయట కెళ్ళిపోయాడు.

"వాట్ మిస్టర్ ప్రతాప్‌రావ్ ఏ... మైంది?" లోపలికొస్తూనే అడిగాడు డా... ర్ మురళీకృష్ణ

"చూడండి మరీ నేనంటే లెక్కలే... సుండా పోయింది దానికిపంచె చూశారా ఎంత మురికిగా ఉందో?"

మురళీకృష్ణకు నుదురు ముడుచుకు... ంది. అతను తన భార్యను, ఓ పరాయి మగాడిముందు 'అది' అని మాట్లాడ్డం అతనికి బొ... ాగా నచ్చినట్లులేదు. అతను ఆమె చేతిలో పంచెఉన్నప్పుడే చూశాడు. ఏమంత మురిగాలేదు.

"నిదానంగా చెప్తే వింటారుకదా!" బి.పి. చూసి... ా అన్నాడు. బి.పి. 190/120 వుంది.

అతను మాట్లాడలేదు.

"ఓ సత్యం చెప్పనా ప్రతాపరావుగారూ! మన ఆడ... వాళ్ల చాలా అల్పసంతోషులు, ఓ చిన్న అనునయంమాట మాట్లాడితే చాలు పొంగిపోతా... . అసలు భర్తకు సేవ చేయడమనేది వాళ్లకెంతో సంతోషమైన సంగతి. అది బరువని వాళ్లె... కోరు."

"ఏమో! అందరి ఆడవాళ్లసంగతి నాకు తెలియదు. ఈ దయ్య... ం మాత్రం నేనెప్పుడూ ఛస్తానా అని ఎదురు చూస్తోంది"

"ఛీ. అలా అనకండి, ఆమె అలాంటిది కాదు"

"నాకంటే మీకే నా భార్య గురించి తెలుసా? ఏం? ఏం చె... స్తున్నావ్వక్కడ? కొళాయన్నా తిప్పకుండానే ఉతికేస్తున్నావా? దరిద్రపుకొట్టుదానా బయటి... నురా చెప్తాను"

డాక్టర్ మురళీకృష్ణ కళ్లనిండా ఏవగింపు "మీకు బి.పి. చాలా ఎక్కువగా ఉంది. ఇంకా ఆవేశపడ్తే పక్షవాతం లాంటివి వస్తాయి" అనేసి "రండి వెళ్దాం" ఇక ఒక్కక్ష... ం కూడా అక్కడ నిలబడలేని వాడిలా విసురుగా బయటకొచ్చేశాడతను.

'ఫర్వాలేదే! ఈ డాక్టరుకు కూడా స్పందించే మనసుందే' అని మనసులోనే నవ్వుకుంది జాహ్నవి.

రెండడుగులేసిన మురళీకృష్ణ ఆగిపోయాడు.

ఆ కారిడార్‌లో ఒకకాలు వెనక్కువంచి స్థంభానికానించి నిలబడున్న ఆ మూడోగది పేషెంటు కొడుకుని డాక్టర్‌ని చూస్తూనే మరలా మమూలు మూడ్‌లోకొచ్చాడు డాక్టర్ మురళీకృష్ణ.

"ఏమయ్యా! ఎలా వున్నావ్? మీ నాన్నగారిలో ఏమైనా మార్పుందా?"

అతను నవ్వాడు చాలా శుష్కంగా

"అతనికి నయం అవుతుందిలే దిగులుపడొద్దు. ఇంకొద్ది రోజులు ఓపికపట్టండి" అతను తలెత్తాడు ఏదో అనబోయి ఆగిపోయాడు.

"ఫర్వాలేదు చెప్పు"

'డాక్టరుగారూ! మీరేమీ అనుకోకపోతే అది జబ్బని నేననుకోను. మా అమ్మ అంటె ఆయనకు పడదు. ఆమె చనిపోతే ఆయన బాగుపడ్తాడు'

'అమ్మ చనిపోతే' అన్నపుడు అతని కంఠం వణికింది.

"వాళ్లమ్మగార్ని దూరంగా పంపించేస్తే" కలుగజెసుకుంది జాహ్నవి. అందుకాపిల్లాడే జవాబు చెప్పాడు.

'లేదండీ అందుకు ఒప్పుకోడు మా నాన్న. మా అమ్మ ఇంకెక్కడికో వెళ్లి సుఖపడడం

ఆయనకిష్టం వుండదు. మా అక్కయ్య ఎన్నోసార్లడిగింది అమ్మను పంపించేయమని.... అది... అది మీ కర్థంకాదు డాక్టరుగారూ! చూస్తేగానీ ఆ రాక్షసత్వం మీకు అర్థంకాదు.

డాక్టర్ మురళీకృష్ణ అతని వైపు జాలిగా చూశాడు.

"లేదు బాబూ! మీ నాన్నకు జబ్బే. లేకపోతే తన వాళ్లయిన మిమ్మల్ని కాల్చుకుంటూ తనని తాను కూల్చుకోవడానికి అదేమంత సంతోషకరమైన విషయమా? మీ నాన్న మరో రెండు నెలల్లో మిమ్మల్నందర్నీ ప్రేమించే మనిషిగా మారతారు చూడు."

నవ్వాడతను. ఎదుటివ్యక్తి చెప్పిన విషయం తను నమ్మని నవ్వది. మురళీకృష్ణ ఆ నవ్వు నర్థం చేసుకున్నాడు.

"ఊహు నువ్వు నమ్మాలి. నీకు తెలిసింది మీ నాన్న ఒక్కరే నాకు ఇలాటి వాళ్లు ఎంతమందో?"

'కానీ డాక్టరుగారూ! మా నాన్న మీకు తెల్సింది వారం రోజుల నుండే కానీ నాకు తెలిసింది నేను ఒకటోక్లాసు చదివేటప్పడినుండి...ఒక్కోసారి నాకన్పిస్తుంది డాక్టరుగారూ! నాన్నలంతా ఇంతేనేమోనని అంత భ్రమలో నన్ను త్రోసేసింది మా నాన్న ప్రవర్తన. నాకు తెలిసి నేను ఇదే నాన్నను చూశాను. మరో నాన్నను చూస్తానని నాకాశలేదు"

"నో డోన్ట్‌బి పెసిమిస్టిక్.... ఎంతవరకు చదివావు?"

"మీరు మాట్లాడిన ఆ ఇంగ్లీషు పదం అర్థంకానంత" నవ్వాడా పిల్లాడు.

అతని మాటలు కాస్త సూటిగా, కరుగ్గావున్నా అసభ్యంగాలేవు. పైగా అతని ముఖం నవ్వు ముఖం. డాక్టర్ మురళీకృష్ణ ఆ సంభాషణ తుంచేయలేదు.

'రండి అలా హాల్‌లో కూర్చుందాం. మీ సిస్టర్‌ని కూడా పిలవండి' రెండడుగులేసి అతను లోపలికి తొంగిచూశాడు. ఆ అమ్మాయి అందుకే కాసుకుని వున్నట్టుగా వాళ్లకెదుట కొచ్చేసింది.

"రండి"

చుట్టూ అద్దాలున్న ఆ రూమ్‌లో నుండి బయట పచ్చటి ప్రకృతి మూడు వైపులనుండి అందంగా కన్పిస్తుంది. దూరానవున్న కొండల మీద నుండి తొంగిచూసే చంద్రుడు కూడా అందంగా కన్పిస్తుంటాడు రాత్రిపూట. హాలు చుట్టూ ఉన్న గాజు కిటికీలకు వేసిన కర్టన్లు అందంగా ఉన్నాయి.

'ఆ హాలు చాలా బాగుంది చాలా సార్లు అనుకుంది' జాహ్నవి.

"ఇప్పుడు చెప్పు ఏం చదువుకున్నావు?"

"మా వూరి జూనియర్ కాలేజిలో ఇంటర్ పాస్ అయ్యాను..... మెడికల్ లో సీట్ వచ్చింది"

"ఈ ఇయరా?" క్యూరియస్‌గా అడిగాడు మురళీకృష్ణ

"మూడేళ్లయింది" అదోలా నవ్వాడాబ్బాయి.

"ఆర్థిక ఇబ్బందా" మరలా నవ్వాడాబ్బాయి.

"డబ్బు చాలా వుంది డాక్టరుగారూ మాకు" అతని వాక్య నిర్మాణంలో హేళన.

ఆ అమ్మాయి తలవంచుకుని సిగ్గుపడ్తూ చెప్పింది.

"మా నాన్నకు మేము అడిగింది జరపడం అలవాటు లేదు. మేము సంతోషంగా, తృప్తిగా ఉండడం ఆయనకిష్టం ఉండదు"

ఆశ్చర్యపోయినట్టుగా చూసింది జాహ్నవి.

"నువ్వేం చదువుకున్నావమ్మా"

ఏమి చదవలేదన్నట్టుగా తల అడ్డంగా ఊపింది.

"మీకు నెల ఖర్చు ఎంతవుతుంది?"

"సుమారు రెండువేలు"

"బాడుగిల్లా"

"లేదండీ మా స్వంతిళ్ళే మూడున్నాయి. అందులో ఒకదాంట్లో వుంటాం"

"మీ ఫోన్ బిల్ ఎంతవుతుంది?"

"ఫోనా ఒకప్పుడు మూడునెలలకు ఆరొందలయ్యేది. ఇప్పుడు నాన్న దాన్ని డిస్కనెక్ట్ చేసేశాడు."

"ఎందుకని ఖర్చవుతుందనా?" వాళ్లద్దరి వంకా చాలా నిశితంగా చూస్తూ అడుగుతున్నాడు డాక్టర్ మురళీకృష్ణ.

నిశ్శబ్దంగా వింటోంది జాహ్నవి.

"ఖర్చా?' అని మరలా నవ్వాడాబ్బాయి.

ఆ అబ్బాయి నవ్వు చాలా అందంగా ఉంటుంది. చాలా తమాషాగా వుంటుంది. అందులో నుండి ఏరుకుంటె ఒక్కో నవ్వుకు ఒక్కో అర్థం వుంటుంది.

"మీరు నమ్మరు అప్పుడు మాకు నెలకు ఇంచుమించుగా రెండువందలు ఫోన్‌కు ఖర్చయ్యేది. ఇప్పుడాయన మా ప్రక్కింటివాళ్లకు నెలకు మూడువందలు లెక్కన ఇచ్చి తన కాల్స్ అన్నీ అక్కడనుండి చేసుకుంటాడు. ఈయనకు మాత్రం కాల్స్ వస్తే పిల్చే డ్యూటీ వాళ్లదన్నమాట"

"ఎందుకలా?" కూర్చీ వెనక్కు జారగిలబడ్తూ అడిగాడు. అతని ముఖంలో మాత్రం క్యూరియాసిటీ లేదు. అతను తనకెప్పుడో అర్థమయిపోయిన భావం వుంది. బహుశా జాహ్నవికి వాళ్లచేతే చెప్పించాలనే ఉద్దేశ్యమేమో!

"ఏముంది? మేము మా ఫ్రెండ్స్‌కి చేసుకుంటున్నామనే కుళ్లు సారీ ఆ మనస్తత్వానికి మీరేం పేరు పెడ్తారో నాకు తెలీదు"

"మీ నాన్న ఏం చేస్తుంటారు?" మధ్యలో అడిగింది జాహ్నవి.

"ఏమి చేయరు మా అమ్మని తిడ్తుంటారు" అనేసి తన అధిక ప్రసంగాన్ని అర్థంచేసుకున్న వాడిలా చెప్పాడు.

"మాకు చాలా పొలాలున్నాయి. అవన్నీ కౌలుకిస్తాడు. మరో రెండిళ్లమీద అద్దెలొస్తాయి. అన్నీ మా తాతగారి స్వార్జితం"

"కౌలుకెందు కివ్వడం మీరు చెయ్యొచ్చుగా?"

"నేనే! భలేవారే నేను చేస్తే పెత్తనమంతా నాకొచ్చేయదూ? అమ్మో!" అతను ఈసారి సరదాగానవ్వాడు.

ఐదు నిముషాలు డాక్టర్ మురళీకృష్ణ మౌనంగా ఉన్నాడు.

"నువ్వు మీ నాన్నను ఎదురించి చేసుండాల్సింది"

'ఆ..... ఎదురించాం. నేనుకాదు మా అమ్మ పాపం మా అమ్మ వీపు మీద అతను బెల్టుతో కొట్టిన వాతలు నా గుండెల్లో ఇంకా మండుతూనే ఉన్నాయి. డాక్టరుగారూ! నా చెవుల్లో ఇంకా గింగురు మంటూనే వున్నాయి.'

అతని కళ్లలో తడి అతనివైపు విచలితయి చూసింది జాహ్నవి.

"అతని గుండెల్లో అతని తల్లిపట్ల ఎంత ప్రేమ! ఎంత గౌరవం!"

"అందుకే... అందుకే డాక్టరుగారూ! ఆ ప్రసక్తి మానేసిన నేను అందరి బంధువుల్నీ

దేవిరించి కొంత డబ్బు కలెక్ట్ చేసుకుని వెళ్ళిచేరిపోయాను మెడిసన్‌లో"

"కానీ నాకు అగ్రకులస్థుడిగా స్కాలర్‌షిప్ రాలేదు. మా బంధువులు మరుసటి నెలలో పంపడానికి నిరాకరించారు. తిరిగివచ్చేశాను"

వాళ్ల మధ్య క్షణకాలం నిశ్శబ్దం. చావు నిశ్శబ్దం.

"మా అమ్మ ఒప్పుకోదుగానీ నేను మా నాన్నతో ఆస్తిపంచుకుని విడిపోయి ఇకనైనా మా అమ్మను మా చెళ్లెళ్లను సుఖపెట్టాలనుంటుంది"

అతని గొంతులో ఆవేశం టీనేజ్ ఆవేశం.

"మీరిక్కడున్నారా? మీ నాన్న అరుస్తున్నారు రండి" తల్లిని చూడగానే ఆ అబ్బాయి ముఖంలో ఆవేశం స్థానంలో విసుగు. "ఏమంట? ఏం పనంట?"

ఆమె అప్పుడు చూసింది ఓ ప్రక్కగావున్న డాక్టర్ని. చేతులు జోడించి ఓ ప్రక్కకు తప్పుకుంది.

"ఎందుకో రారా!" ఆమె గొంతులో అభ్యర్థన.

"మా అమ్మే డాక్టరుగారూ! మానాన్న చెడిపేసిందసలు!" అతను కదలబోయాడు డాక్టర్ మురళీకృష్ణ ఆమె నాపేశాడు.

"ఇప్పుడు వీళ్లు రారన్నారనుకో! ఆయన ఏం చేస్తారు?"

"నానా గందరగోళం చేస్తారు డాక్టరుగారూ! మనశ్శాంతి వుండనివ్వరు. చుట్టూ వస్తువులు మిగలనివ్వరు."

"ఇదో.....ఇదో అలా అని, అనే నాన్నను నెత్తికెక్కించుకున్నావు. ఇప్పుడు దిగిమంటే ఆ సింహాసనం దిగుతాడా?"

'పిల్లలు డాక్టరుగారూ! వీరికి తెలియదు. నేనూ ఆయన్ని అనుసరించి వుండకపోతే మా సంసారం వీధిన పడిపోయివుండేది'.

"ఇప్పుడేం ఉద్ధరించబడిందట మన సంసారం?"

"ఆయన కాలం అలా గడిచిపోనీరా పద. డాక్టర్‌గారి పుణ్యమా అని ఆ జబ్బు నయమయిపోతే అప్పుడు అందరం సంతోషంగా ఉండొచ్చు" నిట్టూర్చిందామె.

"అమ్మా ఒక్కటడుగుతాను చెప్పు. నీకు తెలిసి నాన్నగారు ఎప్పుడయినా ప్రశాంతంగా ఉన్నారా? నిజం చెప్పు"

జాహ్నవితో పాటు డాక్టర్ మురళీకృష్ణ కూడా కుతూహలంగా చూసాడు.

'ఎందుకనిరా పెళ్లయిన కొత్తలో బావుండేవారు' అలా అనేప్పుడు ఆమె కళ్లు సన్నగా మెరవడం గమనించింది జాహ్నవి. మనసు శరీరం, రెండూ ఇచ్చుకున్న భార్యలు ఆ మధురస్మృతులు మర్చిపోలేక పెంచుకున్న మమకారాల మధ్య బంధీలయిపోయి అతనెటువంటి వాడైనా సరే అతన్నే అల్లుకుని బ్రతుకుతున్నారు.

ఆ పిల్లాడు మరేమీ మాట్లాడలేదు. డాక్టర్ దగ్గర జాహ్నవి దగ్గర సెలవు తీసుకుని తల్లి వెనుకనే చెల్లెలితోపాటు నడచి పోయాడు.

"డాక్టర్! అది మనస్తత్వమా? మానసికమా?"

"ఏది?"

"అదే ఇప్పుడు చూసొచ్చిన వ్యక్తి గురించి"

"అది జబ్బే జాహ్నవీ! కాకపోతే వాళ్ల మనస్తత్వాల్ని, స్వార్థపు పర్సంటేజ్‌ని బట్టి ఆ జబ్బు లక్షణాలు మార్తుంటాయంతే"

జాహ్నవి మాట్లడలేదు.

"ఆమెను చూస్తే మీకే మనిపించింది?"

"ఆమె చాలామంచిదనిపిందించి. ఆమె భార్యకావడం అతనిఅదృష్టం అన్పించింది"

"ఆమె కంటే ఎవరైనా సరే అదృష్టవంతులనిపించలేదా?" ఆమె వంక నిశితంగా చూస్తూ అడిగాడు మురళీకృష్ణ.

"అది షాక్ డాక్టర్ నేను చెప్పక్కరలేదు"

"మరి ఆమెను చూసి ఆమెకంటే బెటర్ పొజిషన్‌లోవున్న ఎవరైనా తమ అదృష్టానికి ఆనందించాలిక" అవునన్నట్లు తలాపింది జాహ్నవి

# 7

"ఏమంటున్నారు మీ పేషెంట్లు?" స్నానం చేసి బనియన్ కొరకు వెతుకుతూ అడిగాడు విమల్.

"నేనేమయినా డాక్టర్‌నా వాళ్లు నా పేషెంట్లు కావడానికి ఇదిగోండి" భార్య చేతిలో బనియన్ అందుకుని వేసుకుని దువ్వెనందుకున్నాడతను.

"ఎక్కడికైనా వెళ్తున్నారా?"

"అబ్బే! వెళ్తే ఇద్దరం వెళ్లమూ?"

ఆమె కళ్లు మెరిశాయి.

"అందంగా తయారయి నీతో కబుర్లాడుకుందామని"

"అందంగా తయారవకపోతే శ్రీవారు కబుర్లు చెప్పరు కాబోలు శ్రీమతికి"

"ఏమో అందంగా లేనని అలిగితే?"

ఆమె కళ్లు కుంచించుకుపోయాయి.

అతనామెలో మార్పును గమనించాడు. ఆమెను సంతోషపెట్టడానికి అతను చేస్తున్న ఈ ప్రయత్నాలు అతన్ని చాలా ఇరుకున పెడుతున్నాయి. బొత్తిగా భావుకతలేని ప్రాక్టికల్ టైప్ మనిషి విమల్. భావుకతను నటించడం ఇరుకైన చొక్కాలో అడ్జస్ట్ అయినట్లుంది. ఏది మనసుకు తోస్తే అది ఫ్రీగా మాట్లాడుకోలేని దురవస్థలో వున్నాడు అతను.

"ప్రీతీ! సరదాకన్నాను నేనెలావున్నా నీకు ప్రియమైన మనిషినని నాకుతెలుసు. ఈ యవ్వనం జారిపోయి వృద్ధాప్యంలో కొచ్చినా ఈ అందం తరిగిపోయినా నువ్వంటే నాకు నేనంటే నీకు ఆకర్షణ ఎక్కడకు పోతుంది చెప్పు?" ఆమెను దగ్గరకు తీసుకుని వెంట్రుకల్లోకి వేళ్లుపోనిస్తూ లాలిస్తూ అన్నాడు.

ఆమె తృప్తి పడిపోయింది. అతని ఒడిలో పసిపిల్ల అయిపోయింది. "ఈరోజు పేషెంటు ఏమంటోంది" తిరిగి అడిగాడు విమల్. అతనికి తన భార్య వివిధ రకాల పేషెంట్లను చూసి తన స్థానం ఏమిటో అర్థం చేసుకుంటోందోలేక ఇది వృధాప్రయాసో తెలుసుకోవాలని ఆరాటంగా ఉంది. ఇంతలో డాక్టర్ మురళి వచ్చాడు.

"ఈరోజు ఏ రూమ్‌కి మన రౌండ్స్?" నవ్వుతూ అడిగింది జాహ్నవి.

"నాకీ రోజు మీ సహాయం కావాలి జాహ్నవీ!"

"నా సహాయమా?" కళ్లు పెద్దవి చేసుకుని చిత్రంగా చూసింది జాహ్నవి.

అతను సాలోచనగా చూశాడు.

"ఒక్కసారి డ్యూటీ రూమ్‌కెళ్దాం వస్తారా?"

నిస్సంకోచంగా తలూపింది జాహ్నవి.

ఈ హాస్పిటల్లో తను పేషెంటుగా చేరినప్పటి నుండి డాక్టర్ మురళీకృష్ణ ప్రవర్తన, అతను పేషెంట్ల మీద చూపే శ్రద్ధ, పేషెంటుఎంత విసిగించినా అతని ముఖంలో లేశమంతయినా చిరాకులేకపోగా చిరునవ్వుతో ఆ పేషెంటుని లాలించడం. ఇవన్నీ కలిపి అతని వ్యక్తిత్వాన్ని కొండంత ఎత్తులోకి లేపాయి. అతని మీదున్న ఆ సదభిప్రాయమే జాహ్నవి అలా తలూపేలా చేసింది.

డ్యూటీ రూమ్‌లోకి అడుగుపెడ్తూ అడిగింది.

"ఈరూమ్‌లో ఇంకాస్త మంచి కుర్చీలు, మంచి బల్లఉంటె బాగుండేదిడాక్టరు గారూ!"

"ఎందుకు?"

"మన చుట్టుప్రక్కల ప్రదేశం అందంగా ఉంటే మన బుర్రలో ఆలోచనలు కూడా అందంగా వస్తాయనీ" నవ్వుతూ అంది.

"అందమైన ప్రదేశానికి మా పేషెంట్లనంతా తీసుకెళ్లిపోతే ఇక ఈ ఇన్‌స్టిట్యూట్‌కు మేము అవసరం వుండదు కదండీ జాహ్నవీ!" అని జోక్ వేసాడు మురళి

"అలా అనికాదు. ఈ రోమ్‌లో రోజులో కొన్ని గంటలు మీరు గడపాలికదా అందుకంటున్నాను"

"నాకీ చెక్కబల్ల, చెక్క కుర్చీలు కన్పించవు జాహ్నవీ! ఏ పేషెంటు ఏ ట్రీట్‌మెంట్‌తో బాగవుతారా? అనే ఆలోచన తప్ప..." ఓ.కే. అసలింతకీ మిమ్మల్నెందుకు పిలిచానంటే.... ఒకటో నంబరు రూమ్‌లో పేషెంటు పేరు రాజమ్మ. ఆమె హిస్టరీ తెలుసుకోవడానికి రెండు రోజుల నుండి ట్రై చేస్తున్నాను వీలవలేదు"

"మాధవిగారు వెళ్లిపోయారా? ఆమె జబ్బు తగ్గిపోయిందా?"

"ఆ సర్దుకుంది. మిమ్మల్నే మార్చలేకపోతున్నాను నేను"

"నేను మారలేదా?" మురళీకృష్ణవైపు చూస్తూ అడిగింది.

డాక్టర్ మురళీకృష్ణ సంతోషంగా చూసాడు.

"మీరు మారారా?"

"భలేవారే మీరు డాక్టరు నేను పెషెంటును నా సంగతి మీరు చెప్పాలి"

"మీకు చెప్పాలనుకున్నది చెప్పలేదు నేను. మీరు లేడీ డాక్టరుగా వెళ్లి రాజమ్మ హిస్టరీ తీసుకోవాలి"

"నేనా? మీ స్థానంలో డాక్టరుగానా? భలే వారే నాకేం తెలుసనీ?" ఆశ్చర్యంగా అడిగింది.

"ఇన్ని రోజులుగా నాతో రౌండ్స్ కొస్తున్నారు గదా! నేనేం ప్రశ్నలు అడుగుతానో మీకు తెలుసు... పోనీ మీకేమి అడగాలనిపిస్తే అది అడగండి"

భయంగా చూసింది జాహ్నవి.

"లేడీ డాక్టరుతో తప్పమరెవరితోనూ మాట్లాడనని మొండికేస్తోందావిడ"

"ఎందుకని?"

"అదే... అదే మీరు కనుక్కోవాల్సింది"

"తర్వాత నేను డాక్టర్నికానని తెలిస్తే" జంకుగా అంది జాహ్నవి.

"ఆమెకు తెలీదు. ఆమె భర్తకు ముందుగా నేను చెప్పాను"

"అప్పుడే చెప్పేశారా? నేనొప్పుకోకముందే?"

"మీరు నామాట కాదరనుకున్నాను"

చిన్నగా నవ్వింది జాహ్నవి.

"ఓ.కె. మీరింతగా సహాయం చేస్తున్నారు నాకు..."

"నో.. నో.. అలా అనొద్దు మీకు సహాయం చేయడమనేది అది మా డ్యూటీ"

"ఎందుకో మీరు మా పట్ల చూపించే శ్రద్ధ చూస్తుంటే అది మీ డ్యూటీలా అన్పించడంలేదు డాక్టరుగారూ" కళ్లనిండా అతనిపట్ల కృతజ్ఞతతో అంది.

"మీ అభిమానానికి థ్యాంక్స్"

"మీకు నేను చెప్పాలి థ్యాంక్స్ డాక్టరుగారూ!"

'పోనీ ఇప్పుడు మీరు చేసే సహాయానికి నా అడ్వాన్స్ థ్యాంక్స్ అనుకోండి'

'మీరు భలేవారే' నవ్వుతూ లేచింది.

'నేనూ అక్కడ దాకారానా?'

వద్దులెండి డాక్టరుగారు నేనెళ్తాను' చెక్క కుర్చీలోంచి లేచి రూమ్ నంబర్ ఒకటివైపు దారితీసింది జాహ్నవి.

రూమ్‌లోకి ఒక లేడీ డాక్టరుగా అడుగుబెడ్తుంటె ఏదో కొత్త అనుభూతి ఆ అనుభూతి తాలూకు ప్రకంపన.

అక్కడే ఎదురుగా కుర్చీలో కూర్చొనున్న అతను ఆమెభర్త కాబోలు లేచి నిల్చున్నాడు.

"నమస్కారం డాక్టరుగారూ! రండీ!"

కొత్త అనుభూతి స్థానంలో భయం తను పేషెంటు. పైగా ప్రతి చిన్న అనుభవానికి, అనుభూతులకు కూడా తట్టుకోలేని మెంటల్ పేషెంటు. తను ఈ బాధ్యతను సంపూర్ణగా నిర్వర్తించగలదా?'

"రాజా! డాక్టరుగారొచ్చారు" ఆమె తలెత్తలేదు.

"నువ్వడిగావు గదా! లేడీ డాక్టరు కావాలని డాక్టరుగారు వచ్చారు చూడు"

ఆమె తలెత్తింది. ఆమె ముఖం వికసించింది. పడకమీద ముడుచుకుని కూర్చున్న ఆమె, డాక్టరుకు మర్యాదిస్తున్నట్టుగా కాళ్లుదింపింది.

"ఈమె నా భార్య డాక్టరుగారూ! ఒక చిన్న సంఘటన గురించి ఎక్కువ ఆలోచించి మనసు పాడుచేసుకుంది.."

"అది... అది చిన్న విషయమా?" భర్తవైపు కోపంగా చూసిందామె.

"పోనీ చిన్నదో, పెద్దదో... ఓ.కె. ఓ.కె నీ ఇష్టం... డాక్టరుగారు చాలా నెమ్మదస్తులు నువ్వన్నీ చెప్పు"

ఆమె మాట్లడలేదు. అతను జాహ్నవి వైపు తిరిగి చెతులు జోడించి మళ్లా వస్తానని చెప్పివెళ్లాడు.

జాహ్నవి గుండె నిముషానికి నూరుసార్లు కొట్టుకుంటున్నట్లుంది. ఆమె గుండె కొట్టుకునే శబ్దం ఆమెకే విన్పిస్తోంది.

'మీ పేరు?' తనని తాను సంబాళించుకుంటూ అడగాలని ప్రయత్నించినా గొంతు కాస్త కొతుకుపడనే పడింది.

'రాజమ్మ'

గొంతు సర్దుకున్నట్లు దగ్గి

"మీరు తెలుగువారా?" అంది జాహ్నవి ఈ సారి కాస్త స్పష్టంగానే అడిగింది.

"అవును"

"మీకెప్పటినుండి బాగాలేదు?"

"ఆ వెధవ... ఆవెధవ ఆ ఉత్తరం వ్రాసినప్పటినుండి" ఆ కళ్ళు నిప్పుకణికల్లా వున్నాయి. ఆ వెధవ ఎవరో, ఆ ఉత్తరం ఏమిటో గాని అతను ఎదురుపడితే చంపేసేలా ఉంది.

"ఏం వ్రాశాడమ్మా?"

"ఏం వ్రాశాడా?" ఎలా చెప్పేది డాక్టరుగారూ! ఒక ఆడపిల్లకు పైగా పెళ్లయిన ఆడదానికి ఓ పరాయి మగాడు ఎలాటి ఉత్తరం వ్రాయకూడదో అలాంటి ఉత్తరం వ్రాశాడు.

జాహ్నవికి తర్వాత ఏమి ప్రశ్న అడగాలో తోచలేదు. కానీ రాజమ్మ ఆగలేదు.

"వాడిని... వాడిని ఏమి చేయాలి? ఏ కోర్టు ఏ విధంగా శిక్షించాలి వాడిని? ఏ ఆడపిల్ల భరించే విషయమా ఇది? మా ఆయనేమో తేలిగ్గా తీసుకోవాలంటారు. మీరే చెప్పండి డాక్టరుగారూ! ఆడవాళ్లం అలాటి రాతలు చదివి ఎలా ఊర్కోగలం?"

"అసలు ఏం జరిగిందో నాకు చెప్తే..." సహజమైన కుతూహలంతో అడిగింది జాహ్నవి.

ఆమె కళ్లు నొసలు జుగుప్సతో ముడుచుకున్నాయి.

"వాడికి... వాడికి నేనొక్కసారి కావాలట"

"ఎవరతను?"

"ఎవరో... ఎవరో దోవనబోయే వెధవయితే నాకెందుకు బాధ డాక్టరుగారు! వాడిన్ని నేను పెంచాను డాక్టరుగారూ! ఆరేళ్ల వెధవగా వున్నపుడు నా పెళ్లయి మా అత్తగారింటికి వచ్చాను. ఎదురిళ్లవాళ్లం నాకు పిల్లలు లేరు. వాడిని దగ్గరకు తీశాను. పిన్నీ! పిన్నీ అని పిలుస్తూ తర్వాత ఇలాటి ఉత్తరం వ్రాస్తాడా వాడు..." ఆమె అయాసపడ్తోంది.

"చూడండి.డాక్టరమ్మా చిన్నా చితకావాడా? ఇరవై నాలుగేళ్లవాడు. వాడి మానాన వాడు పోతాడులే అంటారీయన. అదీ మాటేనా? ఇంకెప్పుడూ, ఎక్కడా ఎవర్నీ ఇలా అవమానించకుండా నేనైతే వాడి చేతులు నరికేసేదాన్ని"

"ఆ పని నువ్వు చేసుండాల్సింది" కోపంగా అంది జాహ్నవి.

రాజమ్మ కథ విన్నాక జాహ్నవి, పేషెంటు జాహ్నవిగా మారిపోయింది. డాక్టరు పాత్రను మర్చిపోయింది పూర్తిగా.

"అసలు చంపేద్దును ఈయన అడ్డం రాకుంటే"

"అలాటి వాళ్లు బ్రతక కూడదు. భూమాతకు భారం" వీళ్ల సంభాషణ వింటూ వాకిటకవతల నిల్చున్న రాజమ్మ భర్త ప్రణవమూర్తి తృళ్ళిపడ్డాడు.

జాహ్నవి డీవియేట్ అయిపోతోంది.

చప్పున లోపలకొచ్చాడతను

"మిమ్మల్ని డాక్టర్ మురళీకృష్ణగారు రమ్మంటున్నారు"

లేచి నిల్చుంది జాహ్నవి. ఆమెకు భయమేసింది ఎందుకు పిల్చుంటారు?'

హడావిడిగా తన దగ్గరకొచ్చి 'ఎందుకు పిల్చారు?' అంటున్న జాహ్నవి వైపు ప్రశ్నార్థకంగా చూసిన డాక్టర్ మురళీకృష్ణ మరుక్షణంలో ఆమె వెనుక కన్పించిన రాజమ్మ భర్త ప్రణవమూర్తి కళ్లలో భావాన్ని అర్థం చేసుకున్నాడు.

"ఏమీ లేదు మీ వర్క్ అయిపోయిందనుకున్నాను"

"లేదు మధ్యలో డిస్టర్బ్ చేశారు మీరు. ఓ పిచ్చి జులాయి వెధవ... వుండండి మరలా వెళ్లి ఆమెతో మాట్లాడివస్తాను"

జాహ్నవిలో మెంటల్ పేషెంట్స్‌లో వుండే టెంపర్‌మెంటుని చూసి ప్రణవమూర్తి భయపడ్డాడు.

"రెండోసారి పోతే అది విసుక్కుంటుంది. పెద్ద గొడవగా వుందామెతో" ప్రణవమూర్తి అడ్డుచెప్పటంతో నిరాశగా కూలబడింది జాహ్నవి.

ప్రణవమూర్తి మరలా వస్తానని చెప్పి వెళ్ళిపోయాడు.

"డాక్టరుగారూ! ఆ రోగ్‌ని చంపే ధైర్యం ఆ రాజమ్మకు మందుల ద్వారా ఇవ్వాలండీ"

నవ్వాడతను

"ఓ.కె. ఇస్తాను. ఆ తర్వాత రాజమ్మ జైలుకు పోదూ!"

"జైలుకా? అని సంకోచంగా ఆగి అంది" అసలు మీకు తెలుసా అతను ఎవరో"

"కొద్ది తెలుసు ఆమె భర్త చెప్పాడు"

"మరి తెలుసుకురమ్మని నన్ను పంపారు" అనుమానంగా చూసింది జాహ్నవి

"జరిగింది నాకు తెలుసు జాహ్నవీ! కానీ ఆమె మనసులో ఏముందో! ఎందుకలావుందో అది నాకు చెప్పదుకదా!"

"పాపం చెప్పబోతూ ఉండింది. మీరు పిల్చారు" సానుభూతిగా అంది జాహ్నవి. నెలక్రితం తనూ ఆమెదశలోనే ఎవరితో మాట్లాడకుండా మొండిగా ఉన్న విషయం గుర్తొచ్చింది జాహ్నవికి.

"పోనీలే జాహ్నవీ రేపెళ్దువు. విమల్ ఒంటరిగా ఉన్నట్టున్నారు వెళ్లిండి ఈవినింగ్ కలుద్దాం"

"అలాగే వెళ్తానుగానీ... అలాటి వాళ్లను బ్రతకనివ్వచ్చంటారా అసలు...? అవునూ మనది బారతదేశమనీ, అతి పవిత్రమైనదేశమనీ కబుర్లు చెప్తారు కదా! ఇలా భార్య ఎవరో తల్లెవరో తెలుసుకోలేనంత నీచానికి దిగజారిన ఇలాటి వాళ్లకు ఉరిశిక్ష వేయదేం! మన శిక్షాశ్మృతి?"

"ఆరోజులు వస్తాయి జాహ్నవి!"

"వస్తాయా? ఎప్పుడొచ్చేది? ఇప్పుడు చూడండి ఆరాజమ్మ ఎంత బాధపడ్తోందో!"

"రాజమ్మ ఎందుకు బాధపడాలి?"

చిత్రంగా చూసింది జాహ్నవి తర్వాత కోపంగా అంది.

"మీరు ఆడాళ్లయ్యుంటె, రాజమ్మ స్థానంలో వుండుంటె, ఓ జంతువు దగ్గర నుండి హేయమైన ఆ జాబు అందుకోనుండుంటే, అప్పు....అప్పుడు తెలిసేది మీకు"

అతను మరలా నవ్వాడు.

"నేనే అయితే బాధపడను జాహ్నవీ నేను ఆడపిల్లనయ్యుంటే కూడా"

ఆశ్చర్యపడిందామె..... "ఏమంటున్నారు మీరు?"

"అవును రాజమ్మ కాదుగా తప్పుచెసింది ఆమెందుకు బాధపడాలి?"

"మరేం చేయాలి?"

'అతన్ని నాలుగు దులిపేయాలి. శక్తుంటే కొట్టాలి లేదా కోర్టుకు పట్టివ్వాలి'

"కోర్టా? భవాలేరే కోర్టుఅంటే మీ కాన్ఫరెన్స్ హాల్ అనుకున్నారా? మా మనసుల్లోవిమీకు చెప్పుకోడానికి, ఛీ ఛీ మన కోర్టుల పద్ధతేం బాగాలేదు. ఓ అమ్మాయికి అన్యాయం జరిగితే కోర్టుకు వెళ్లను ఎందుకు భయపడ్తోంది. నలుగురిలో నిలబెట్టి ఆ అమ్మాయి జీవితాన్ని బట్టబయలు చేస్తున్నారు. అలాటప్పుడు ఇంకే స్త్రీ ముందు కొస్తుంది.

చెప్పండి డాక్టరుగారూ చెప్పండి"

ఆమె ఆవేశానికి మురళీకృష్ణ మరలా ఆమె తన గత మానసిక ధోరణిలోకి వెళ్లిపోతుందేమోనని కొద్ది భయపడ్డాడు. కానీ 'ఈమెను రాటుదేలనీ!' అనుకున్నాడు మరలా.

"జాహ్నవీ! ఏ మాత్రం కొంత తెలివివున్నా జంతువులు కూడా చేయనిపని వాడు చేశాడు. నేనొప్పుకుంటాను కానీ అలా వాడినేదో చేయబోయి మన జీవితాల్ని పాడుచేసుకోవన్లేదు ఏమంటారు?"

ఆమె ఆవేశం కాస్త చల్లబడింది.

# 8

ఆ ఉదయం కాన్ఫరెన్స్ హాలులో కలిసినపుడు డాక్టర్ పాల్ విమల్‌ని పిల్చాడు. ఆ రోజు మీటింగ్‌లో జాహ్నవి లేదు.

"జాహ్నవి మారిందా?" ఇంగ్లీషులో అడిగాడు.

"కొద్దిగా మారినట్టే అన్పిస్తోంది"

"అయితే మా మురళి ప్రయోగాలు సక్సెస్ అవుతున్నాయన్నమాట"

సంకోచంగా చూశాడు విమల్

"చెప్పండి పర్వాలేదు. ఫ్రాంక్స్‌గా చెప్పండి"

"డాక్టర్ మురళి రౌండ్స్‌కు తీసుకెళ్తున్న పేషెంట్ల జీవితాల గురించి విపరీతంగా బాధపడిపోతూ ఉంది"

'బాధపడనివ్వండి. వాళ్ల బాధను తనతో కంపేర్ చేసుకుని తనజీవితం అందరి జీవితాలకంటే బాగుందని మానసికంగా తను సంతరించుకున్న డిప్రెషన్ అనేవ్యాధి నుండి బయటపడాలన్నదే మా ఉద్దేశ్యం'

"థ్యాంక్స్ డాక్టర్! కానీ ఆమె అలా కంపేర్ చేసుకుంటోందని నాకన్పించడంలేదు"

"నో.. నో.." డాక్టర్ మురళీ అందుకున్నాడు.

"మీరు గమనించలేదు ఆమె నోటితో చెప్పకపోవచ్చు కానీ ఆమెలో మార్పు మీకు కన్పించడంలేదా? ఇది వరకటి డల్‌నెస్ ఆమెలో ఇప్పుడుందా?"

విమల్ ఆలోచించాడు.

'నిజమే అంత డల్‌నెస్, పెసిమిజమ్ ఇప్పుడులేవు' అదే అన్నాడు డాక్టర్ మురళీకృష్ణ వైపు తిరిగి.

"కానీ డాక్టరుగారూ! ఇతర పేషెంట్ల కథలు విని విపరీతంగా చలించిపోతోంది" తన భయాన్ని బయట పెట్టాడు.

"వెల్ మిస్టర్ విమల్ అలా చలించాలనే మేము చూస్తున్నది ఈ ప్రయోగం ఆమె జీవితం మీ చుట్టూ మాత్రమే ఉండకూడదు. అలా ఉండే చిన్న చిన్న నిరాశలకు కూడా ఆమె తట్టుకోలేకపోతోంది ఆమె చుట్టూ మరో ప్రపంచాన్ని మేము సృష్టిస్తున్నాం" పాల్ స్పష్టంగా అన్నాడు అతని పెదాలు నవ్వుతున్నాయి.

"మా ఊర్లోనూ ఇలాటి వాళ్లు ఎంతమందో!"

విమల్‌ని డాక్టర్ మురళి మధ్యలోనే ఆపేశాడు.

"అక్కడ వేరు ఇక్కడ వేరే అక్కడ సమస్యలలోకి ఆమె తొంగిచూడలేదు. ఇక్కడ అలా చూసేలా మేము చూస్తున్నాం."

"ఎంత కాలం ఇక్కడ ఉండలేముగా డాక్టరుగారూ! మేము"

"అక్కరలేదు ఇక్కడ మేము ఆమె మెదడులోకి 'ఇదీ వాస్తవం' అనే ఇంజక్షన్

ఇస్తున్నాం. అది మీరింటికెళ్లాక కూడా పనిచేస్తుంది బట్ ఓ సలహా మీకు... మీరు త్వరగా తండ్రికావాలి."

త్వరగా మీరు తండ్రి కావాలి అని అతను సలహా ఇస్తుంటే కాస్త సిగ్గపడ్డాడు విమల్ అతని గుండెల్లో సందడి.

'తను తండ్రి, జాహ్నవి బిడ్డకు తండ్రి' ఎంత హాయిగా ఉందా వూహ. మీటింగ్ హాల్‌నుండి నేరుగా కిచెన్ కెళ్లాడు విమల్.

కూర బాగా కుదిరిందో లేదో చూస్తోంది జాహ్నవి. ప్రక్కనే నిన్న తనభార్యడాక్టరుగా వెళ్లివచ్చిన పేషెంటు పీటమీదకూర్చొనుంది. భర్తను చూస్తూనే లోపలికి పిలిచింది జాహ్నవి.

"ఈమే రాజమ్మ నిన్న నేను చెప్పలా"

అర్థమయిందతనికి

"నేను డాక్టర్ని కానని తెలిసిపోయింది వంటచేసుకుంటున్నాను కదా మరి" అని నవ్వింది జాహ్నవి. రాజమ్మ కూడా కాస్త పేలవంగానైనా నవ్వింది.

"నిన్న సాయంత్రం రౌండ్స్‌కి మేల్ డాక్టరు వస్తే మీరే కావాలని పేచీ పెట్టాను నేను"

మరలా నవ్వేసి భర్తవైపు చూసి అంది జాహ్నవి.

"ఐదు నిముషాలే వచ్చేస్తాను. మీటింగ్ అయిపోయిందా? రూమ్‌లో కూర్చోండి"

విమల్ రాజమ్మ వైపు తిరిగి అడిగాడు "మీ ఆరోగ్యం బాగుందా?"

బావుందన్నట్లు తలూపిందామె. నిజానికి చూసే వాళ్లకు రోగి బాగున్నట్టే అన్పిస్తుంది. వాళ్లు బాగుందనే అన్నా ఆ టైమ్‌లో కూడా వాళ్ల మనసునిండా చీకటుంటుంది. మెదడునిండా బరువుంటుంది. శరీరం నిండా నిస్సత్తువ ఉంటుంది. అది ఎదుటి వ్యక్తికి తెలీదు పేషెంటు చెప్పకపోతే డాక్టరుకీ తెలీదు. చిత్రమైన వ్యాధి.

'ప్రీతీ! నీతో నాకో పాపకావాలి' అనే మధురమైన కోర్కెను తను దాచుకోలేక కిచెన్‌లోకొచ్చిన విమల్ నిరాశపడ్డాడనే చెప్పాలి. ఆ మాట ఆమెతో చెప్పాలంటే ఇంకా ఐదు నిముషాలాగాలి.

'వడియాలు వేయించాలనుకున్నాను. పోనీలెండి మరలా వచ్చి వేయిస్తాను మీకు బోర్ కొడ్తుంది పదండి పోదాం'

ఆమె లేచినిల్చుంది. రాజమ్మకు చెప్పేసి రూమ్‌వైపు నడవసాగారు తనని అలా వెతుక్కుంటూ భర్త కిచెన్‌లోకి రావడం చాలా సంతోషంగా ఉంది జాహ్నవికి కానీ ఇద్దరి ఆనందాన్ని చంపేస్తూ రూమ్ దగ్గర వరండాలో జాహ్నవి అమ్మానాన్న.

విమల్‌కి చాలా నిరాశనిపించింది. జాహ్నవిని తను కోరాలనుకున్న మొదటి కోరిక ఇది. ఈ రెండు సంవత్సరాలుగా ఆమె కోర్కెలను తీర్చడమేగాని తను జాహ్నవిని కోరిందే లేదు. అందుకే కాబోలు జాహ్నవి తనని జడపదార్థమనేది ఇలానే కాబోలు తనవల్ల ప్రతిస్టెప్‌లో నిరాశపడ్తోంది. పిచ్చిపిల్ల ఇంక ఆమెను నిరాశపర్చకూడదు భావుకత అలవర్చుకోవాలి.

నవ్వుకుని అత్తను మామను పలకరించి తలుపు తాళం తీసాడు. "ఎలాఉంది విమల్ ఇక్కడ బోర్ కొట్టడంలేదా?" ఆయన తిరుపతిలో డి.ఎస్.పి. బిజీ వర్క్‌తో ఊపిరాడని వ్యక్తికి ఇలా ఇంత విశ్రాంతిగా ఉండడమనేది బోర్‌కాక మరేమిటి?

"భలేవాడివే డాడీ! హాయిగా ఉన్నాము ఇద్దరం మీరెవ్వరూ లేకుండా" తమని

ఎవ్వరూ బాధపెట్టకూడదు. వాళ్లు మాత్రం అందర్నీ బాధపెడ్తారు. ఎల్లప్పుడూ తన భర్త తనతో ఉండాలని తనకెలా ఉందో! కనీసం తన కూతురు తన రాకకు సంతోషించాలని తండ్రికుండదా? ఆ విషయం ఆమెకు తట్టలేదు. తన సుఖం గురించి మాత్రమే ఆలోచిస్తారు. మెంటల్ పేషెంట్లు. రావుగారు మాత్రం చిన్న బుచ్చుకోలేదు. 'పోనీలే అన్నది కూతురే కదా! 'వాళ్లు సంతోషంగా ఉంటే అంతేచాలు అనుకున్నారు.

"బోర్ కొట్టడంలేదు మామగారూ! మా స్టూడెంట్ డేస్ మరొక్కసారి గుర్తు కొస్తున్నాయి. మా మీటింగ్స్, ఆ రూమ్స్, ఫ్రెండ్స్ కాలేజి రోజులు గుర్తొస్తున్నాయి"

'గుడ్'

అల్లుడంటే చాలా ప్రీతి ఆయనకు తన మొండి కూతురు కొరకు అగ్రికల్చర్ కాలేజిలో పోస్టుగ్రాడ్యుయేట్స్‌కి లెక్చరర్‌గా ఓ బాధ్యతగల జాబ్‌లో ఉంటూ బాధ్యతారాహిత్యం వల్ల ట్రాన్స్‌ఫర్ వస్తుందని తెలిసినా భార్యకొరకు నెలరోజులు లాంగ్‌లీవ్ పెట్టేసాడు. 'వాళ్లమ్మ ఉంటుందిలే నాయనా!' అంటే నవ్వేశాడు. మీ అమ్మాయి జబ్బు అలాటిది నేను ఉండడం తప్పనిసరి' అన్నాడు.

జాహ్నవి తల్లి మాత్రం కూతుర్ని తడుముతూనే చాలా ప్రశ్నలు వేస్తోంది. ఆ అమ్మాయి జవాబులు ఆమెకేమంత సంతృప్తికరంగాలేవు. ఏదో నాలుగు మందులిచ్చి తొందరగా కూతురి జబ్బు నయంచేసి పంపక ఇదేమిటిది అప్పుడే నెలయిపోతున్నా ఇంకా ఒక్క మాత్రన్నా ఇవ్వలేదట. ఆ సంగతే ఒంటరిగా దొరికినప్పుడు ఆ సాయంత్రం భర్తచేత డాక్టర్ మురళీ కృష్ణనడిగించింది. చాలా ఓపిగ్గా జవాబు చెప్పాడు మురళి.

"చూడమ్మా మీ అమ్మాయి వయసు పాతిక దాటలేదు. అప్పుడే ఈ మందులమీద ఆధారపడేలా చేస్తే ఆమె ప్రవర్తనలోనే కొంత మార్పు వచ్చే అవకాశం ఉంది. ఆ మార్పు అంత వాంఛనీయంకాదు' అతను మాట్లాడుతూ మాట్లాడుతూ రావుగారి వైపు తిరిగాడు.

'మీరు అర్థం చేసుకోండి మా బాస్ పాల్‌గారు మందులు వాడడానికి కొద్ది వ్యతిరేకులు' మందులు ఎంతవరకు మనిషి మానసిక శక్తిని పెంచగలవు? మేధస్సుని అణచి పెట్టగలవేగాని అంటారాయన. నిజమే మా అమ్మానాన్న కూడా డిప్రెషన్ వ్యాధిగ్రస్తులు. కడుపున పుట్టిన మొదటి బిడ్డ ఉండగా, హంతకుడిగా మారి మా మేనత్తని చంపడంతో సర్వోస్ బ్రౌన్‌డౌన్ వచ్చి డిప్రెషన్‌లో కెళ్లిపోయాడు. వాళ్లను ఓదార్చడానికి మేము చాలా చిన్న పిల్లలం డాక్టర్స్ ఇచ్చిన మందులకు వాళ్లు కాస్త కోలుకున్నారు. కానీ ఆ మందులకు వాళ్లు బానిసలైపోయారు. ఎంతో ఆర్ద్రంగా, ఎంతో మార్ధవంగా ఉండే మా తల్లిదండ్రులు వాళ్ల అపసాన దశముందు ఓ సంవత్సరం రోజులు మానసికంగా బలహీనులై ప్రతి దానికీ రెచ్చిపోతూ మాకు నరకం చూపించారు" మురళి తన స్వీయచరిత్రనుగూడా జోడించాడు.

"వెల్ డాక్టర్. మా అమ్మాయిని మీ చేతుల్లో పెట్టాం మీ ఇష్టం"

కొద్దిగా సిగ్గుపడ్డాడు డాక్టర్ మురళీ కృష్ణ తనింకా ప్రాథమిక దశలోనే ఉన్నాడు కనీసం సైకియాట్రీ మొదటి సంవత్సరమన్నా పూర్తికాలేదు అప్పుడే....

"కానీ డాక్టరుగారూ! అసలు మెంటల్ జబ్బులకు డ్రగ్స్ అవసరం లేదంటారా మీకు" తన సందేహాన్ని బయట పెట్టాడాయన.

డాక్టర్ మురళీకృష్ణ తలెత్తాడు.

"ఎందుకుండదండీ తప్పకుండా ఉంటుంది. ఎండో జీనస్ డిప్రెషన్ అనే వ్యాధి, కారణం లేకుండా వస్తుంది అందులో ప్రివలెన్ పేషెంట్లు చాలా మంది ఉంటారు.

ప్రక్కవాళ్లని కొట్టడం, కొరకడం ఆత్మహత్యాప్రయత్నం చేయడం ఇలాటి వాళ్లకు తప్పవు మందులు. వాళ్లను శాంతంగా పర్చాలిగదా! ఇంకా ఒక తెగవున్నారు తాగి తాగి మెదడును దానికి బానిసను చేసిన వాళ్లు. వాళ్లకీ డ్రగ్స్ తప్పవు కానీ మీ అమ్మాయి అలా కాదు ఏదో అసంతృప్తి మనసులో పెట్టుకుని డిప్రెషన్ తెచ్చుకున్న అమ్మాయి. దీన్ని రియాక్టివ్ డిప్రెషన్ అంటారు. పైగా మేము చెప్పినట్టు వింటున్న పేషెంటు, ఇలాంటి వాళ్ల పరిస్థితుల ప్రభావం వల్ల కొన్ని అనుభవాల నుండి నేర్చుకున్న పాఠాల వల్ల మార్తారని నా అభిప్రాయం. దీన్ని సపోర్టివ్ సైకో థెరపీ అంటారు. వాళ్లు మారే లోపలే ఈ డ్రెగ్సెందుకు? ఏమంటారు మీరు?"

గుండెల నిండా గాలి పీల్చుకున్నారు రావుగారు. తనబిడ్డకు మందులువేయకుండానే మార్చగలరనే భరోసా అతనిలో కలిగింది.

"మీతో ఏకీభవిస్తున్నాను" మనస్ఫూర్తిగా అన్నాడు.

---

"సారీ! మిమ్మల్ని డిస్టర్బ్ చేస్తున్నానా?"

"లేదు, రండి" ఈ సారి జాహ్నవి మొహమాటానికి కాకుండా ఉత్సాహంగా అంది.

"సెమినార్‌కెళ్తున్నాను ఒక్కమాట చెప్పి వెళ్దామని వచ్చాను"

"కూర్చోండి"

"టైమ్ లేదు వెళ్తున్నాను, మరోసారి ఐదో నంబర్ రూమ్‌కెళ్లండి. ఆ కేసు గురించి ఏ అనుమానాలున్నా ఆమెనడగండి"

"వాళ్లిద్దరూ సరదాగా ఉంటే.... మధ్యలో నేను...." జాహ్నవికి చాలాఆతృతగా ఉంది. ఆ కేసు గురించి తెలుసుకోవాలని. ఈ రోజు చిత్రంగా డాక్టర్ మురళీకృష్ణ జాహ్నవి ఆరోగ్యం గురించి ఒక్క ప్రశ్నన్నా వేయకుండా తన అభ్యర్థనను ఆమెముందు వుంచాడు.

"లేదు అతను కిచెన్‌కెళ్లాడు, నేనూ చూశాను"

"మీరు లేకుండానా?"

"ఏం పర్వాలేదు ఆ అమ్మాయి ఒంటరిగా, మనిషి దొరకాలేగాని మనసులో బాధ దాచుకోలేనంత విరక్తిలో ఉంది. మీకన్నీ చెప్తుంది"

'తను కొన్ని నిముషాల క్రితం ఆ రూమ్‌లోకి వెళ్లగానే బాత్‌రూమ్ లోకిదూరి తను తిరిగి వచ్చేదాక కన్పించని ఆ అమ్మాయి తనతో మాట్లాడుతుందా?' అనే బెరుకు భావం ఆమెను ఆ రూమ్ వాకిట దగ్గరే నిలిపేసింది.

"రండి అక్కడే నిలబడిపోయారేం?"

కించిత్ ఆశ్చర్యంగా చూసింది జాహ్నవి

"రండి" మరలా సాదరంగా పిలిచిందామ్మాయి

"నేనిలా రావడం మీకేమీ అభ్యంతరం లేదుకదా!"

"అబ్బే అలాంటిదేం లేదు"

"మీరు చాలా అందంగా ఉన్నారు. మరోసారి చూడాలన్పించి వచ్చాను" అందమూ, వాంఛనయమూ అయిన అబద్ధం అది.

"మీ పేరు?" ఆమె సిగ్గుపడుతూ అంది

"స్వర్ణ"

"మీ వారికేం బాగలేదు?"

ఆమె మరలా నవ్వింది.

"అనుమానపు జబ్బు?"

"అనుమానపు జబ్బా"

"ఈ మరి ఇందాక బాత్‌రూమ్‌లో ఎందుకు దాక్కున్నానంటారు?"

"దాక్కున్నారా? ఎందుకు?"

ఈ సారి స్వర్ణముఖం కొద్దిగా మలినమయింది.

'మా వారికి నేను మగవాళ్ళ కంటపడడం ఇష్టం ఉండదు"

అర్థమయింది జాహ్నవికి

'అందుకే ఇలా దాక్కుంటుంటాను" మరలా సర్దుకుని నవ్వింది స్వర్ణ.

"అదెలా వీలవుతుంది? ఈ రోజుల్లో మగవాడి కంటపడకుండా?"

'భలేవారే డబ్బుంటే ఏదైనా వీలవుతుంది ఎక్కడికయినా ప్రయాణం చేయాలంటే కారుతప్ప మరో వాహనం ఎక్కము. సినిమా చూడాలంటే ఇంట్లో వీడియో ఉంది. బట్టలు కావాలంటే సేల్స్‌గర్ల్స్ ఇంటికి బట్టలు తెస్తారు"

"బట్టలు కూడా షాపుకెళ్ళి కొనుక్కోకూడదా?"

"మరి అక్కడ మగవాళ్లుంటారు కదండీ" అని నవ్వింది. ఈ సారి ఆమెనవ్వులో ఏదో వెల్తి.

"బురఖాలేని నా అందం ఆయన్ని బాధపెడ్తోంది. అలా ఆయన బాధపడకుండా వుండాలంటే నాకు తోచినవి రెండు మార్గాలు. ఒకటి నా అందాన్ని కాల్చేసుకోవడం, రెండోది ఇదో ఇలా దాక్కోవడం. దాక్కోవడం కూడా సాగని రోజులొచ్చాయనుకోండి అప్పుడు మొదటి మార్గాన్ని అనుసరిస్తాను'

స్వర్ణ నవ్వుతూనే చెప్తోంది కానీ జాహ్నవికి చాలా బాధనిపించింది.

"ఛీ ఛీ అవేం మాటలు మీరు అతనికి నచ్చచెప్పుకోండి. మీరలాటివారుకాదని, మిమ్మల్ని ఏ మగాడిష్టపడ్డా మీమనస్సు చలించదనీ...."

ఆమె నవ్వు ఆపేసింది.

"చూడండి మీ పేరేమిటో తెలీదు"

"జాహ్నవి"

"జాహ్నవిగారూ! ఈ విషయం నేనాయనకు చెప్పాలాండీ ఈ ఆరేళ్లకాపురంలో నా మనసేమిటో ఆయనకు తెలీదా?"

"ఏ కాంతంలో ఆయనతో నేనలాటిదాన్ని కాదని మొత్తుకున్నాను. ఆయన మౌనంగా మిగిలిపోయారు. అంతే జాహ్నవిగారూ! అప్పటి నుండి నాకై నేను ఎవరితో నైనా మాట్లాడడానికి జంకేదాన్ని. కానీ అవతలి వాళ్లను ఆపలేను కదా! పెళ్ళిళ్లలాంటివి తప్పవుకదా!"

"అయితే పెళ్లిళ్లకు తప్ప మరెక్కడకీ ఇద్దరూ కలసి వెళ్లేవారు కాదా!"

ఆమె నిట్టూర్చింది.

'పెళ్లయిన మూడు నెలల తర్వాత నోరు తెరిచి అడిగాను సినిమాకు తీసుకెళ్లమని ఆ మర్నాడే మా ఇంట్లోకి వీడియో వచ్చింది. నాకర్థమయింది మరలా సినిమాకెళ్దామని అగడ లేదు. చీరలు కావాలా? అని అడిగాడోరోజు' దిగులుతో కృంగిపోతున్న నాకు అదేలా లనగా అన్పించింది, ఆ దిగులులో కావాలన్నట్టు తలూపాను. నా తలను ఆయన గుండె లకు ఆనించుకున్నారు. ఆ అనుభూతి నా గుండెలనుండి చెదిరిపోక మునుపే మరికొన్ని గంటల్లో బట్టల మూటతో ఓ షాపమ్మాయి మా ఇంట్లో ఉంది. ఆ రోజు నేను ఒక్క చీరా కొనలేదు విపరీతంగా అవమానించబడ్డట్టు ఫీల్ అయ్యాను నేను. ఇప్పుడు తలచుకుంటె

నవ్వొస్తోంది ఈ ఆరేళ్లుగా నేనెదుర్కున్న అవమానాల ముందు అదెంత చిన్నదో!" ఆమె చిన్నగా నిట్టూర్చింది.

'మీరు చాలా గ్రేట్. మీ ఓర్పుకు జోహార్లు' మనస్ఫూర్తిగా అభినందించిన జాహ్నవి. తనయితే అలాటి భర్తను భరించగలదా...? అని అతనిని ఇన్ని రోజులకు మొదటిసారిగా తన భర్తతో పోల్చుకుందామె.

"ఒక్కటి జాహ్నవిగారూ! ఆ బలహీనత ఒక్కటి తప్ప ఆయన చాలా మంచివాడు"

ఈ ఆడవాళ్లు ఇలా మెత్తబడిపోవడంతో ఈ మగవాళ్లు ఇలా తమ మాట సాగించుకుంటున్నారు ఆవేశంగా అంది జాహ్నవి.

"ఇద్దరి మాటా సాగాలనుకుంటే సంసారాలు సాగుతాయా జాహ్నవిగారూ!"

జాహ్నవి మాట్లాడలేకపోయింది. క్షణక్షణమూ స్వర్ణ ఎంతో ఎత్తుకెదిగిపోతోంది ఆమె దృష్టిలో.

"నేను పుట్టింటినుండి పిలుపందుకున్న వెంటనే మా అమ్మతో ఆయన మనస్తత్వం గురించి చెప్పేశాను. 'బావలనెవ్వర్నీ ఇంటికి రావద్దని చెప్పమ్మా!' అని ఏడ్చేశాను. నాతో పాటూ మా అమ్మ కూడా ఏడ్చింది. మరుదులతో కూడా వున్న విషయం చెప్పేయమని ఈ నరకయాతననుండి ఇకనైనా బయటపడమని సలహా ఇచ్చింది. సిగ్గుతో చచ్చిపోతూ ''బాబూ ఇదీ విషయం. మీరు మీ అన్నను అర్థంచేసుకుని మీ వదిన్ని క్షమించండి' అని వేడుకున్నాను. వాళ్లు మొదట ఆశ్చర్యపోయారు. తర్వాత వాళ్లన్నను అసహ్యించుకున్నారు'.

అలా వాళ్లందరి దృష్టిలో మా వారు పలచన కాకూడదనే ఆ సంవత్సరం రోజులు ఇదీ విషయం అని ఎవ్వరికీ చెప్పుకోకుండా నరకం అనుభవించాను ఒక రకంగా జాహ్నవిగారూ! ఈ ఐదేళ్లుగా కొంత మనశ్శాంతితో బ్రతుకుతున్నాను."

"ఇప్పుడు వాళ్లు మీతో మాట్లాడ్డంలేదుగా. మరి మీ వారికీ జబ్బు ఎందుకొచ్చింది?"

'వాళ్లేనా ఈ ప్రపంచంలో మగాళ్లు?' వాకిట ముందు కొచ్చే బిచ్చగాళ్లకి, గుడ్డలు ఉతికే చాకలాడికీ, ఫలానా ఇల్లు ఇదేనా అని అడిగే పరాయి మగాడికీ చెప్పుకోలేను కదా!"

ఆక్షణంలో చప్పున జాహ్నవికి విమల్ గుర్తొచ్చాడు.

బహుశా విమల్ కూడా తన మనస్సు నొచ్చుకోకుండా చేసే ప్రయత్నంలో ఇలా మనశ్శాంతిని కోల్పోతున్నాడా?

ఆమెకిక కాలు నిలవలేదు. వెంటనే విమల్ దగ్గరకెళ్లాలనిపించింది. మా వారు ఎదురు చూస్తుంటారు. రేపు గ్రూప్ సైకోథెరపీలో కలుసుకుందాం. సారీ మీరురారుగా నేనే మీ రూమ్‌కొస్తాను. అనేసి వడివడిగా రూమ్‌కొచ్చిన జాహ్నవి ఊహించినట్టు, విమల్ ఆమె కొరకు ఎదురుచూడడం లేదు. పక్కమీదపడుకుని హాయిగా నిద్రపోతున్నాడు.

అలా తనకొరకు ఎదురుచూడకుండా అతనలా నిద్రపోవడం ఆమెకీరోజు బాధ నిపించలేదు.

ఆమె వెళ్లి అతని ప్రక్కన కూర్చుంది. అనాచ్ఛాదితంగావున్న అతని ఎదమీద ప్రేమగా చెయ్యివేసింది. విమల్ కొద్దిగా కదిలి మరలా నిద్రపోయాడు.

ఇతను... ఇతను తన భర్త ఇతను ఏనాడైనా ఆ ఐదవ నంబరు పేషంటులా తనని అవమానించాడా? ఏనాడైనా పరుషంగా మాట్లాడాడా? ఎంత అదృష్టవంతురాలు తను! ఏ మాలిన్యమూ తెలీని ఈ మనిషి ఎంత హాయిగా నిద్రపోతున్నాడు. పసిబిడ్డను చూచుకున్నట్టు భర్తను చూసుకుంటోంది జాహ్నవి.

పెళ్లయిన రోజునుండి ఎందరి మగవాళ్లతో ఎన్ని విధాలుగా మాట్లాడుతుందీ! అంతెందుకు డాక్టర్ మురళీకృష్ణతో ఎన్ని రాత్రులు గంటలు, గంటలు ఆఫీసురూమ్‌లో గడిపివుంటదీ! భర్త ఎదురుగానే ఎంత నిశ్చింతగా అతనితో హాస్యలాడింది! మాట్లాడొద్దని నిషేదించాడా?'

జాహ్నవి భర్త ప్రక్కన చోటు వేసుకుని పడుకుంది. నిద్రపోతున్న అతని కళ్లవంకే చూస్తూ తనజీవితంలో అందిన అదృష్టాన్ని తెరలుతెరలుగా ఆస్వాదిస్తోంది. నెమరు వేసుకుంటోంది. అతని పట్ల ఆమె ప్రేమ ఆమె గుండెలు దాటి ఛాతిని ఛేదించుకుని బయట కొస్తూ ఆమెను నిలవనీయకుండా చేసింది. ఆమె చప్పున లేచి కూర్చుంది. ముందుకు వంగి ఆమె అతని నుదుటిమీద ముద్దు పెట్టుకుంది.

విమల్ కళ్లు తెరిచాడు. అతని చేతులు ఆమెను దగ్గరకు లాక్కున్నాయి అతను మరలా నిద్రలోకి జారిపోయాడు.

---

జాహ్నవి నిద్రనుండి మేల్కొంది.

'అరె! తనెప్పుడు నిద్రపోయింది' ప్రక్కకు చూసుకుంది విమల్‌లేడు. బాత్‌రూమ్ తలుపులేసుకుని భార్యలేస్తుందని కాబోలు గుడ్డలు మెల్లిగా, పెద్ద చప్పుడు చేయకుండా వుతుక్కుంటున్నాడు.

జాహ్నవి లేచి కూర్చుంది. ఆమెకు చాలా ఆశ్చర్యంగా ఉంది. ఈ రెండెళ్లుగా పగలెప్పుడయినా పొరపాటున నిద్రపోతే లేచేసరికి గుండెల్లో దిగులు, భారం తనకే వినపడే హార్ట్‌బిట్. ఈ రోజు అవేవి లేవు చాలా హాయిగా, తెలిగ్గా ఎంతో ఆనందంగా...

ఆమె బాత్‌రూమ్‌లో కొచ్చింది. అతని వెనగ్గా వచ్చి అతని మెడచుట్టూ చేతులు వేసింది. మెడత్రిప్పి పైకి చూశాడను.

"ప్రీతీ!"

"ఊ"

"ఏమిటీ అల్లరి?"

"బాగాలేదా?"

"చాలా బాగుంది"

"ఇక ఎప్పుడూ ఇలాగే ఉంటుంది"

అతను చేతిలో బట్టలు వదిలేశాడు. ఏదో కొంత అర్థమయీ అర్థమవ్వని భావం. అతను లేచి నిల్చున్నాడు చేతికంటుకున్న సబ్బు కడుక్కున్నాడు.

"రా"

"ఎక్కడికీ?"

"రూమ్‌లోకి"

"ఎందుకు?"

విమల్ ఆమెను పట్టుకుని బాత్‌రూమ్ గడపదాటి ఆమె కళ్లల్లోకి చూశాడు.

"ప్రీతీ! నీ అంత నీ అంత అల్లరి పాపకావాలి"

"ఎక్కడనుండి తేను?" చిలిపిగా చూసింది జాహ్నవి.

"ఇక్కడునుండి" ఆమె పొట్టమీద చెయ్యివేశాడు విమల్. సిగ్గుపడింది జాహ్నవి.

---

'ఇంకా జాహ్నవి చూడాల్సిన ఆంధ్రా పేషంట్లున్నారా!' వ్రాస్తున్న థీసీస్‌లో నుండి

తలెత్తారు డాక్టర్ మురళీకృష్ణ. ఎదురుగా విమల్.

"సారీ డిస్టర్బ్ చేశానా?"

"లేదు రండి నేను మా ఫ్రెండ్ పెళ్ళికి కేరళ వెళ్తున్నాను. నాలుగురోజుల తర్వాత వస్తాను. నేను వచ్చేసరికి జాహ్నవి జబ్బు నయమయిపోయుండాలి"

విమల్ ఆ డాక్టర్‌వైపు కృతజ్ఞతగా చూశాడు. అతను భావుకుడు కాకపోవచ్చుకాని తెలివిహీనుడు కాదు. ఆ యువకుడి పట్టుదలవల్లే తన భార్యలో ఈ మాత్రమైనా మార్పు వచ్చిందని అతనికి తెలుసు.

"జాహ్నవి ఎక్కడుంది? చెప్పండి నేనెళ్తున్నానని"

'అలాగే' అన్నట్టు తలూపి మురళీకృష్ణతో వరండాలో కొచ్చాడు విమల్. అతనికి డాక్టర్ మురళీకృష్ణకు కృతజ్ఞతలు చెప్పాలని ఉంది ఆ భావం అతని గుండెనిండా నిండిపోయింది కానీ అందంగా వ్యక్తం చేసే భాష అతనిలో లేదు.

"చాలా థ్యాంక్స్ డాక్టరుగారూ! మీ వల్లే మా జాహ్నవిలో మార్పొచ్చింది"

"మార్పొచ్చినట్టు మీకనిపిస్తోందా!"

"చాలా"

"గుడ్ మరో పదిరోజుల్లో మామూలు మనిషైపోతుంది నాకా నమ్మకముంది"

## 9

"ఏమిటి వ్రాస్తున్నారు?"

"లీవ్ పొడిగించమని"

"వద్దు" ఆమె అతను వ్రాస్తున్న పేపరు లాక్కుంది.

"వద్దంటే..."

"మనం మనూరెళ్ళిపోతున్నాం"

"ఎప్పుడు?"

"ఈ రోజే"

"ఈ రోజేనా? నీకు బాగుందా? డాక్టర్ డిశ్చార్జి చెయ్యొద్దూ?" తన భర్తముఖంలో ఆనందం ఆమె కర్థమయింది తనకోసం తన ఉద్యోగాన్ని జాబ్‌రెస్పాన్స్‌బిలిటీని వదలుకుని తనతో వుంటున్నారు పాపం. ఇక ఇతన్ని బాధపెట్టకూడదు ఇంత మంచి మనిషి నీడన తన జీవితం చల్లగా గడిచిపోతుంది అనుకుంది మనసులో జాహ్నవి.

"ఏమిటీ జవాబు చెప్పవేం?" ఆమె అతని ముఖాన్ని దోసిట్లోకి తీసుకుంది.

"నాకు పూర్తిగా బాగుంది ఇంకెప్పుడూ జబ్బురాదు. ఓ.కే."

"మరి డిశ్చార్జి సంగతి"

"నేనెళ్ళి అడుగుతాను" లేచింది జాహ్నవి.

"పాపం డాక్టర్ మురళీకృష్ణ ఊరెళ్ళి జాబు వ్రాసాను ఏమి అనుకోడు" ఇక మరొక్కక్షణం కూడా భర్తను ఇక బాధపెట్టి ఇక్కడ వుండాలని లేదు జాహ్నవికి.

విమల్‌కి మాత్రం భయంగానే ఉంది. తీరా అక్కడికెళ్ళాక తన పనుల్లోపడి అలక్ష్యం చేస్తే మరలా జబ్బు తిరగబెడ్తే.

"వద్దులే ప్రీతీ! ఇంకో పదిరోజులుందాం. నీకు ఇలా నువ్వూ నేను ఒంటరిగా వుంటే ఇష్టంకదా! అక్కడ చుట్టూ జనం దాన్ని కుదరనీరు".

ఆమె ఆరాధనగా అతని కళ్ళలోకి చూసింది.

"విమల్!" పిల్చింది.

ఈసారి అతని గుండెల్లో సందడి.

జాహ్నవి ఓ.పికి. నడిచింది. ఆమె అదృష్టం డాక్టర్ పాల్ ఉన్నారు.

"నమస్తే సర్"

అతను కూర్చోమన్నట్టు చూశాడు.

"నాకు పూర్తిగా బాగుంది దయచేసి నన్ను డిశ్చార్జి చేయండి."

"మీకు పూర్తిగా బాగుందా?"ఎలాంటి ఆందోళనగానీ, ఎలాంటి అసంతృప్తగానీ, "దిగులుగానీ భయంగానీ ఏమీ లేవా?"

'ఏమీ లేదు"

"ఎన్నిరోజులనుండి"

"వారం రోజుల నుండి" అబద్ధం ఆడేసింది జాహ్నవి.

"గుడ్ వెళ్ళండి నెలరోజుల తర్వాత చెకప్‌కు రండి."

"థ్యాంక్స్ సర్" డిశ్చార్జ్‌నోట్ తీసుకుని ఫామిలీ వార్డులో అడుగుపెట్టిన జాహ్నవి కాస్త ముందుకు పోయింది. గదిలో స్వర్ణ కనిపించింది.

ఆమె ప్రక్కన కూర్చుంది స్వర్ణ.

"నేనీరోజు డిశ్చార్జి అయివెళ్తున్నాను"

"ఈరోజే వెళ్తున్నారా?"

"ఊ, మీరూ అధైర్యపడకండి. డాక్టర్ మురళీకృష్ణ మీకు తప్పక సహాయం చేస్తారు"

కృతజ్ఞతగా చూసింది స్వర్ణ. "మీకు పూర్తిగా బావుందా?"

'బావుంది. మీ అందరి స్నేహం వల్ల నేను మామూలు మనిషినయ్యాను' మనస్ఫూర్తిగా అంది జాహ్నవి.

'మంచిది వెళ్లిరండి'

లేచి నిల్చుంది జాహ్నవి.

"మీ వారు మార్తారు. నేను మారినట్టే. ఇక్కడ రకరకాల రోగుల్ని చూసికానీ, లేక మందులతో కానీ తప్పక మార్తారు ఆయన మారాక మీరు నాకు ఉత్తరం వ్రాయాలి" అని తన అడ్రస్ చెప్పి బయట కొచ్చింది జాహ్నవి. రూమ్‌లో లగేజ్ సర్దుతున్నాడు విమల్. జాహ్నవి సరిన థింగ్స్‌ని బ్యాగ్‌లో పెట్టబోతుంటే వారించాడు.

"ప్రీతీ! మనం వెళ్లిపోతున్నాంకదా! నువ్వెళ్లి నీకు తెలిసిన వాళ్లందరికీ 'బై' చెప్పేసిరా. ఈ లోపల నా పని పూర్తయిపోతుంది. పొద్దుపోకముందే నెల్లూరు చేరితే మంచిది"

"సరే పదినిముషాల్లో వచ్చేస్తాను" అని చాలా ఉషారుగా, చాలా సంతోషంగా బయటకు నడిచింది.

మాలిని రూమ్‌లోకెళ్తున్న జాహ్నవి ప్రతాపరావు కొడుకు కన్పిస్తే ఆగింది.

"మీరు డిస్చార్జ్ అయి వెళ్తున్నారట కదా ఆంటీ" అని అతనూ ఆగాడు

"నాన్నగారికెలా ఉంది?"

'ఆశ్చర్యం ఆంటీ,! ఎంతమారిపోయారో మానాన్న!" ఆయనది జబ్బనీ, దానికి మందులు వుంటాయనీ మాకు ముందే తెలిసుంటే, పాపం ఆయనకు ఇన్నేళ్లు ఆ నరకం వుండేదీకాదు, మా అమ్మకు అశాంతీ తప్పేది.

'పోనీలే.... ఇప్పుడైనా మారారు. పూర్తిగా సేడిస్టిక్ నేచర్ పోయింది కదా!'

'పూర్తిగా, కొత్తనాన్న అయిపోయాడాంటీ. ప్చ్ ముందుగా మందిప్పించి ఉంటే... నేనూ డాక్టర్‌ని అయిపోయి ఉండేవాడిని... అని ఆగి 'ఇప్పుడైనా మించిపోయింది లేదు

లెండి ఆ...టీ. ఇంటికెళ్లగానే మరలా ఎమ్‌సెట్ వ్రాసి సీట్ తెచ్చుకుంటే మా నాన్న మెడిసిన్‌లో చేరుస్తారు... న్నా.

'అంత విరక్తిలో వున్న ఈ పసివాడు, మెంటల్ హెల్త్ సెంటర్ ట్రీట్‌మెంట్‌తో బాగయిన తన త...డిమీద అంతనమ్మకాన్ని పెంచుకున్నాడంటే మెడికల్ సైన్స్ ఎంత మహోన్నతమైంది!!'

'వస్తానాంటీ ఆ...ది బెస్ట్ ఆంటీ' అని ఆ అబ్బాయివెళ్లాక ప్రక్కనే వున్న లాన్‌లో చెట్టునీడన కూర్చున్న నలభై ...ళ్ల జంట మాట్లాడుకోవడం వినిపించింది.......

'ఇది ఇది సహజం సంది. ...నలభై ఏళ్లు దాటిన తర్వాత ముఖంలో ముడతలు పడడం సర్వసాధారణం' ఓదారుస్తోంది, ...తని భార్య ఏప్పరు

అతను మోడల్ అతిచక్కని అతని ముఖంలో ఏజింగ్ ప్రోసెస్ వల్ల పడిన ముడతలు అతనిని మానసిక అశాంతికి గురిచేస్తున్నాయి. ఆ సంగతి మురళీకృష్ణ ద్వారా జాహ్నవి వినేవుంది.

అతని కదే ఆలాపన అయి ఇంట్లో పిల్లలు, అత్తగారూ విసుక్కోవడం, తద్వారా అశాంతి, ఆఖరకు ఫేమిలీ వార్డుకు తీసుకురావడం అతనికి సపోర్టివ్ థెరపీ, పని చేయక ఈ మధ్యే మందులు ప్రారంభించడం అన్నీ తెలుసు జాహ్నవికి.

'ఉహూ నువ్వెన్నన్నా చెప్పు. నాకిది బాగలేదు. ఇది వరకులాగ నాకు నా అందమైన ముఖం కావాలి. ఇది వరకు రోజుల్లోలాగే గొప్పమోడల్‌గా మోడల్ ఫిల్మ్స్‌లో ఏక్ట్‌చేయాలి. ఇంచుమించుగా అతను ఏడుస్తున్నాడు. ఆమె అతన్ని ఓదారుస్తోంది.

హఠాత్తుగా జాహ్నవికి తన ఆనాటి మానసిక ధోరణి గుర్తొచ్చింది. అలా ఏపనీచేయకపోయినా, ఎంత విసిగించినా, ఏమీ అనని అత్తమామలు గుర్తొచ్చారు.

ఈ మనసు పాత్ర శరీరం మీద ఎంత ప్రభావం చూపిస్తుందీ! లేకపోతే దృఢకాయుడైన ఆ మనిషి ఆడపిల్లలా అలా ఏడుస్తాడా? స్పందనలులేని మనుషులు ఎంత అదృష్టవంతులు!

"ఏవిటండీ ఇక్కడ నిలబడిపోయారు?' రూము బయటకొచ్చింది షాహీనా. ఆమె భర్త భాషాది మరో కొత్త జబ్బు. ఎప్పుడూ అత్తమామల్ని సాధిస్తుంటాడట. భార్యను ప్రేమగానే చూసుకుంటాడట. కిచెన్‌లో ఒకరోజు షాహీనా చెప్పింది. ఆమె వయస్సు ముప్పై ఉంటుంది. ఒక్క బిడ్డ. ఆరేళ్ల ఆడపిల్ల. ఇంతకీ అతని అత్తమామల మీద కోపంరావడానికి కారణం చాలా సిల్లీది. వాళ్లపెళ్లి కుదిరేనాటికి అతనికి ఎమ్.ఎ. ఎగ్జామ్స్ రెండునెలలున్నాయి. 'పెళ్లి పరీక్షల తర్వాత చేసుకుంటాను' అని చెప్తే వాళ్ల నిక్కాకి మంచిరోజులు లేవని అల్లుణ్ణి ఒప్పించుకుని నెలకే పెళ్లి చేయడంతో అతను పరీక్ష తప్పడం, తద్వారా ఉద్యోగంలో చేరిపోవడం.... ఇప్పుడీ సాధింపు.

పాపం షాహీనా గానీ, షాహీనా అత్తమామలుగానీ, తల్లిదండ్రులుగానీ 'మరలా పరీక్షరాసి పాసయిపో. ఈ లోపల ఈ సంసారాన్ని మేము ఈదుతాము' అని ఎంత చెప్పినా అతని వాదనతనిదే. అతన సాదింపు అతనదే.

ఏమని సాధిస్తాడని ఒకరోజు తను ఆశ్చర్యంగా అడిగితే...

"అప్పుడు మీ అమ్మా నాన్న మన పెళ్లికి తొందర పెట్టి పట్టుబడ్డి నా జీవితం నాజీతం అంతా నాశనం చేసాడంటారు" ఇంకో మాటుండదు రోజుకి ఏ ఐదారుసార్లన్నా అంటాడు. ఎంతసేపని ఓర్చుకోగలం? అని ఏడ్చిందారోజు షాహీనా. జాలేసింది

'ఏవిటండీ జాహ్నవిగారూ ఆలోచనల్లో పడిపోయారు?' షాహీనా పలకరింపుతో

ఉలిక్కిపడింది.

"ఏమీ లేదు. నన్నీరోజు డిశ్చార్జ్ చేశారు. ఊరెళ్తున్నాం. చెప్పిపోదామని వచ్చాను"

"అబ్బా హేపీ కబురు చెప్పారు" అని క్షణం ఆగి

"మీరేమీ అనుకోకపోతే ఓ మాట" సంకోచంగా ఆగింది షాహీనా

"అడగండి" ఒక్కడుగు ముందుకేసి అన్నాను.

"మీరేమీ అనుకోకూడదు... మీకు ఇప్పుడు 'మీ వారు మిమ్మల్ని కేర్ చేయడం లేదని' మాటిమాటికీ అన్పించడం లేదా? ఇది వరకులాగ"

తన మనసు నాకర్థమయింది. నాలాగే తన భర్తమనసులో పదే పదే వేధిస్తున్న అనవసరమైన ఊహాతాలూకు జబ్బు అతనికీ తగ్గిపోతుందా? లేదా? అని తెలుసుకోవాలనే ఆశ ఆమెది.

"ఇందులో అనుకోవడానికేముందండీ నాకు ఇప్పుడు మనసు చాలా ప్రశాంతంగా వుంది. ఇది వరకు మనసు నిండా ఏవేవో అనుమానాలు, భ్రమలు, అపోహాలు...."

"చాలా కుషీగా వుంది" అంది షామీనా మరి ఆ కుషీ అనే మాట తన ఆరోగ్యం గురించో లేక ఆరోగ్య వంతుడుకాబోతున్న తన భర్త గురించో లేకపోతే భర్త జబ్బు నయ మయ్యాకే తమ ఆనంద దాంపత్య తాలూకు ఓ మెరుపుతీగలాటి ఊహకో....'

"మరి వస్తానండీ" అని వెనక్కు తిరగిన జాహ్నవిలో అదే రూమ్‌లోవుండి పూర్తిగా స్వార్థపరుడైన భర్తను కొద్దిగా మార్చుకుని సంతోషంగా వెళ్లిపోయిన మాధవి గుర్తొచ్చింది. 'ఆ మాధవిలా, రూపలా, స్వర్ణలా, విపులలా, ప్రతాపరావుభార్యలా తను దురదృష్టవంతురాలుకాదు. విమల్ తన విమల్ తనను ఎడిపించే భర్తకాదు.! గుండె నిండిపొర్లిపోతున్న ఉత్సాహంతో తన రూమ్‌లోకి అడుగుపెట్టిన జాహ్నవి ఆశ్చర్యంగా నిలిచిపోయింది. విమల్ రూమంతా సర్దేసి సామానంతా ఒక దగ్గర చేర్చి మంచంమీద కూర్చుని తనకొరకు ఎదురుచూస్తున్నాడు. తను పదినిముషాల్లో వస్తానని వెళ్లిపోయి అప్పుడే గంటఅయింది. అయినా విమల్ తనను ఒక్కమాటకూడా అనలేదు. కనీసం విసుక్కున్నట్టన్నా ముఖం పెట్టలేదు.

'ఎంత అదృష్టవంతురాలు తను! ఎంతలా హింసించిందిన్నాళ్లూ అతన్నీ!' చప్పున వెళ్లి అతన్ని ముద్దుపెట్టుకుంది జాహ్నవి.

'విమల్‌ని ఇక సుఖపెట్టాలి. ఇంకెప్పుడూ అతన్ని విసుక్కోకూడదు. అతను ఎలా ఉన్నా సర్దుకోవాలి. 'ఇలావుండు' అని శాసించకూడదని' జాహ్నవి మనసు జాహ్నవికి మాటిచ్చింది.

---

ఆవిశాలమైన కాంపౌండ్‌దాటి కారు గేట్‌దాకా వచ్చింది. డ్రైవ్‌చేస్తున్న విమల్ బ్రేక్‌వేసి క్షణం కారాపి వెనక్కు తిరిగి చూసాడు.

'ఎలాంటి స్థితిలో తీసుకొచ్చాడు జాహ్నవిని తనీ హాస్పిటల్‌కి? ఇంచుమించు మానసిక శవంలా, నడిచే బొమ్మలా, జీవంలేని రోబోలులా.... కానీ కానీ ఇప్పుడెలా తీసుకెళ్తున్నాడు, తన భార్యను, తన ప్రీతిని, తన ప్రాణాన్ని ఉరికే జలపాతంలా, హిమాలయ శిఖరాగ్రపు మంచుముత్యంలా అప్పుడే వికసించిన పువ్వులా తీసుకెళ్తున్నాడు. ఆమె మనసులో ప్రశాంతతని, గుండెల్లో ధైర్యాన్ని సిరంజి ద్వారా ఎక్కించుకుని తీసుకెళ్తున్నాడు. ఇటుకరాళ్లతో కట్టబడిన ఆవైద్య నిలయానికి, అందులో రాత్రి పగలు అనకుండా పనిచేసే వైద్య నిపుణులకు ముఖ్యంగా మురళికి తనెంత ఋణపడి వున్నాడు!'

అదే సమయంలో జాహ్నవిలో క్షణంలో క్షణం సేపట్లో తళుక్కున మెరిసిన ఓ కొత్తసత్యం.

'నేనెప్పుడు మారాను? నా మనసును ఎప్పుడు తొలి సంతోషరేఖ తాకింది? ఏ రోజు? ఏ క్షణం, విమల్ 'పట్ల తనను కేర్ చేయడం లేదనే తనఅపోహ తొలగిపోయింది?'

ఎంత ఆలోచించినా ఆమెకు గుర్తురాలేదు. కానీ కారు మాత్రం కదిలి స్పీడ్ అందుకుంది.

---

ట్రెయిన్ మెల్లిగా కదిలింది

"మీరు....మీరు.... మీరు డాక్టర్ మురళీకృష్ణకదూ!" ఆమె ముఖంలో సంతోషం. ఆమె మాటలో సంతోషం, ఆమె భావప్రకటనలో సంతోషం.

"మీరు జాహ్నవి కదూ!" అతను చిన్నగానవ్వాడు. "మీరు నన్ను గుర్తుపట్టకముందే మిమ్మల్ని నేను గుర్తు పట్టాను. కానీ... పలకరించడానికి సంకోచించాను" మరలా అన్నాడు.

జాహ్నవికి అతనితో చాలా చెప్పాలనుంది ఆ చెప్పాలనుకున్న దాంట్లో చాలావంతు కృతజ్ఞతతో తడిచిన వ్యక్తి కరణాంశమే తన ఉత్తరాలకు అతని దగ్గరనుండి జవాబులేదు. తర్వాత చెకప్‌కెళ్తే అతను లేడక్కడ.

"మమ్మీ! నాన్న రాలేదింకా...." ఏడ్చింది పాప ఆందోళనగా ఫ్లాట్‌ఫారం వైపు చూస్తూ

"వస్తారులేమ్మా" అని స్థిమితంగా అంటున్న జాహ్నవినే చూస్తూ అనుకున్నాడు మురళి

'జాహ్నవి మారింది. పూర్తి ఆరోగ్యవంతురాలైంది. ఆనాటి జాహ్నవిలో ఎంత అస్థిరత! అస్థిమితం!! '

"మీరు ఒక్క ఉత్తరమన్నా వ్రాయల్సింది. మీ అడ్రసు తెలిసేది మాకు' అసలు నా ఉత్తరం అందలేదా మీకు...?" పాపని ఒళ్లోకి తీసుకుంటూ అడిగింది.

"అందింది జాహ్నవీ... నేనే తిరిగి జవాబు వ్రాయలేదు. మీకు బాగయింది కదా!" అదే చాలనుకున్నాను.

'ఇతను మరో విమల్‌లావున్నాడు' అనుకుంది జాహ్నవి.

"అరె! మురళీగారు! ఎంత సుదినం!! ఎంతకాలమయింది మిమ్మల్ని చూసి!"

జాహ్నవి, మురళిల సంకోచాన్ని బ్రద్దలు కొట్టాడు మంచినీళ్లసీసాతో వచ్చిన విమల్. చనువుగా మురళి ప్రక్కన కూర్చున్నాడు

'బావున్నారా?'

బావున్నట్టు తలూపాడు డాక్టర్ మురళి. విమల్ కొడుకుని దగ్గరకు తీసుకుంటూ

"సారీ ఆరోజు మీరులేనిరోజు డిశ్చార్జ్ అయ్యాము. మీకు థ్యాంక్స్‌అన్నా చెప్ప లేదు" మంచినీళ్ల సీసా పాపచేతికందిస్తూ అన్నాడు.

"పరవాలేదు జాహ్నవిగార్కి బాగయింది అంతేచాలు"

"డాక్టర్! జాహ్నవిని మీరు మన్నించి పిలవాల్సిన అవసరం లేదు. 'జాహ్నవీ!' అని పిలిస్తేచాలు. జాహ్నవి మనసుకు ప్రాణంపోసి శరీరాన్ని బ్రతికించిన డాక్టర్ బ్రహ్మ మీరు. ఆమె మీకు పరాయిదికాదు."

డాక్టర్ మురళి కించిత్ ఆశ్చర్యంగా విమల్‌వైపు చూస్తే, జాహ్నవికి చప్పున స్వర్ణ భర్త అనుమానాలరావు గుర్తొచ్చాడు.

"మీరు నాకేకాదు మా వారికికూడా మంచి జీవితాన్నిచ్చారు" జాహ్నవి కూడా భర్తతో ఏకీభవిస్తూ అంది.

ఇద్దరూ అలాపొగడ్తుంటే మురళి కొద్దిగా ఇబ్బందిగా ఫీలయి పాప బుగ్గమీద సున్నితంగా తట్టి టాపిక్ మార్చాడు.

'మాలినిగారు మీకు తెలుసుకదా!'

'కట్నం తేలేదనీ గుర్తుచేసుకుంది జాహ్నవి...'

"ఆ ఆకేసే...అసలు ఇంకా మనదేశంలో చాలామందికి మన మనసుకు కూడా జబ్బులొస్తాయని తెలియదు విమల్. కాలేజీ చదువుల్లో అదీ ఒక పార్ట్ కావాలి" సర్దుకుని విమల్‌కి చోటిస్తూ అన్నాడు మురళి.

"నిజం నాకూ తెలీదు. జాహ్నవిని పూర్తి ఆరోగ్యంతో తీసుకెళ్లాకే చాలామందికి ట్రీట్‌మెంట్ గురించి చెప్పి, మెంటల్ హెల్త్ సెంటర్స్‌కి పంపించాను" మాటకలిపాడు విమల్,

"మీరు ఇందాక మాలినిగారి గురించి చెప్పబోయారు..." గుర్తుచేసింది జాహ్నవి.

"అవును జాహ్నవీ! మీరెళ్లిన మర్నాడే మాలిని ఆత్మహత్యచేసుకుంది"

"ఆత్మహత్య చేసుకుందా? ఇంతమందిమి బాగయి సంపూర్ణ ఆరోగ్యంతో డిస్చార్జ్ అయిన విషయం తెలిసికూడా ఆత్మహత్య ఎందుకు చేసుకుందో?" కించిత్ బాధతో, ఆశ్చర్యపోతూ అంది జాహ్నవి.

'అదేమ్మా. వాట్ఐవాన్‌టెడ్‌టుటెల్‌యు. ఆమె భర్త ప్రవర్తన మానసిక జబ్బువల్లని ఆమె నమ్మలేదు. అది అతని అహంకారం అనీ, పొగరనీ, నియంతృత్వమనీ గాఢంగా నమ్మింది. దానికీ కారణం వుంది. ఆమె భర్తని ఇది మూడోమారు ఆమె నిమ్‌హాన్స్‌కి తీసుకొచ్చి అడ్మిట్ చేయడం అసలామెకిష్టంలేదీసారి అడ్మిషన్‌కి తీసుకురావడం.

'ఎందుకని?'

'ఏదో నాలుగురోజులు ఇక్కడ చేర్చిన ప్రభావంతో, మందుల్లో వుండే మత్తుతో డల్ అయి ఆ పొగరు తగ్గుతోందనీ మరలా వెళ్లినా, తిట్లు దెబ్బలు తప్పవని అతను మారడని నిర్ణయించుకుని ఆత్మహత్య చేసుకుంది.

'దేవాలయం కంటె పవిత్రమైన హాస్పిటల్‌లో ఆత్మహత్య చేసుకుందా?" ఒకరకమైన ఉద్వేగానికి గురవుతో అంది జాహ్నవి. ఆమెకు ఆహాస్పిటల్ ఇచ్చింది చిన్న వరంకాదు.' నవ్వాడు మురళి

ఉహూ హాస్పిటల్‌లో ఆత్మహత్య చేసుకుంటే, మేము బ్రతికిస్తామని, "మాలిని చాలా తెలివిగా ప్లేన్ చేసింది. బంధువుల ఇంటికని వెళ్లి తన పర్స్‌లో హాస్పిటల్ అడ్రస్ పర్స్‌లో పెట్టుకుని లాల్‌బాగ్‌లో కొండచోటుకెళ్లి మాత్రలు మింగి అక్కడేపడుకుని వాచ్‌మేన్‌కి మర్నాడు నిర్జీవంగా దొరికింది. ఆమె ఆత్మహత్యాప్రయత్నం అలాసక్సెస్ అయింది

'పాపం ఎన్ని బాధలు పడిందో! మరలా బ్రతకాలని ఎంత ఆరాటపడిందో!' అని జాహ్నవి అనుకుంటే

"భర్తకారణంగా ఆత్మహత్య చేసుకుందని వ్రాసి పెట్టిందా?" అని అడిగాడు విమల్.

"నో విమల్ మన దేశంలో ఆడవాళ్లకి చనిపోయేప్పుడు కూడా 'నా భర్త అతను' అనేభావం పోదు. పతివ్రతలుకదా!' అని వ్యంగ్యంగా నవ్వి 'పైగా తన బిడ్డలకు తండ్రిని జైలుకు పంపి బిడ్డల్ని తండ్రిలేనివాళ్లను చేయలేదుకదా!"

"నిజం అది ఈ దేశంలో మగవాళ్లకు మరో ప్లస్ పాయింట్ అని ఆగి అది వది లేయండి ముందీసంగతి చెప్పండి అసలు, మీరు ఎక్కడ వర్క్‌చేస్తున్నారు? ఎంతమంది

పిల్లలు? హౌ ఈజ్ యువర్ లైఫ్?" విమల్ మురళివైపుకు పూర్తిగా తిరిగిపోతూ అన్నాడు.

దానికి జవాబు మురళి చెప్పకముందే జాహ్నవి అంది భర్తవైపు చూస్తూ

"భలేవారేమీరు సైకియాట్రిస్ట్ దాంపత్య జీవితం గురించి ఎలా వుందని అడక్కూడదు తప్పక బాగుంటుంది"

మురళీ నవ్వాడు

"లేదమ్మా! అలాటి థియరీని నమ్మకండి. మాలోనూ స్పందనలు నిగ్రహాన్ని కోల్పోయే అవలక్షణాలు ఉంటాయి. ఒకవేళ వాటిని కంట్రోల్ చేసుకున్నా, అతని మంచితనాన్ని అర్థం చేసుకునే భార్యవస్తేనే అతని మంచితనానికి విలువుంటుంది. అప్పుడే అన్యోన్యమైన దాంపత్యం అవుతుంది' చెప్తూ చెప్తూ ఆగి మరలా నవ్వి అన్నాడు.

"అపార్థం చేసుకోకండి. నా భార్య మంచిది బాగా అడ్జస్ట్ అవుతుంది" అని "నాకిద్దరు పిల్లలు విమల్" అని జతచేసాడు మురళి.

"ఏం చేస్తున్నారు?"

వాళ్ళ నోరు తెరవకముందే జాహ్నవి కొడుకు గబగబా చెప్పేసాడు.

"నేను ఫస్ట్‌క్లాస్, చెల్లి ప్లేక్లాస్"

"నీ పేరేంటి బాబూ?" వాడిని ముచ్చటగా చూస్తూ అడిగాడు మురళి.

"నా పేరు మురళి"

"చెల్లిపేరు?"

"కృష్ణకిషోరి"

కొత్తగా ధ్వనించిన ఆ పేరుగురించి ఆలోచిస్తుంటే, జాహ్నవి అంది

"రెండూ మీ పేర్లే డాక్టర్. మీ ఋణాన్ని ఇలా తీర్చుకున్నాము మేము"

'ఋణమా? భలేవారే అది నా డ్యూటీ'.

'నిజమే అది మీ డ్యూటీ అలాగే ఇది మా జాహ్నవి గుండెల్లో నుండి దూకిన కోరిక' మురళిని ఇక ఇబ్బందిలో పెట్టదల్చుకోనట్టు రైలు ఆగింది.

"ఇదే మా ఊరు. దిగిమా భోజనం చేసి వెళ్లకూడదూ?" మురళి వాళ్లఆప్యాయతకు, అభిమానానికి, కృతజ్ఞతాభావానికి చలించిపోయి, ఫార్మాలిటీకోసం కాకుండా మనస్ఫూర్తిగా ఆహ్వానించాడు.

జాహ్నవి, విమల్ ఇద్దరూ లేచి నిల్చున్నారు. అద్వితీయమైన భావావేశంతో ఇద్దరూ చేతులు జోడించారు.

"తప్పకుండా... తప్పకుండా వస్తాము మీ ఇంటికి వచ్చి మీ వాళ్లను చూడకుండా ఎలావుండగలం? తప్పకుండా వస్తాం. వచ్చి మిమ్మల్ని, మీ చిరంజీవుల్ని, మీ శ్రీమతిగార్ని మా ఇంటికి తీసుకెళ్లి మా ఆతిథ్యం మీరు స్వీకరించాక మేము తృప్తిపడ్తాం......"

మురళి విజిటింగ్ కార్డు తీసి విమల్ చేతిలో వుంచుతూ అన్నాడు,

"వచ్చేముందు ఫోన్ చేయండి"

"ఫోన్ ఎందుకు? మేమిద్దరం రేపు వస్తున్నాము మీరు మాతో మాఇంటికి రేపు రాగలరా?"

"రేపా!" ఆశ్చర్యంగా చూసాడు మురళి

'మీకు ఇబ్బంది అయితే మరో డేట్ చెప్పండి'

"నాకు ఇబ్బందిలేదు రేపు ఆదివారం హాస్పిటల్‌కు వెళ్లను 'ఈరోజే కలిసాం కదా

అందుకనీ' అని ఆగాడు.

"ఇప్పటికైనా మా జాహ్నవిని ఋణవిముక్తురాల్ని చేయరా?" అని జోక్ చేశాడు విమల్. నిజానికి అది జోక్‌లా ధ్వనించాలని ఈజీగా అన్నాడు కానీ, తన మనసేకాదు, జాహ్నవి మనసు కూడా డాక్టర్ మురళి పట్ల తాము ఇంతకాలం తీర్చుకోలేకుండా మిగిలిపోయిన ఋణభారంతో అసంతృప్తి ఫీల్ అవుతోంది.

'అలాగే మీ ఇష్టం' ట్రెయిన్ దిగేశాడు మురళి, మురళిని అనుసరించాడు విమల్.

కంపార్ట్‌మెంట్ కిటికీ దగ్గరకొచ్చి జాహ్నవి దగ్గర సెలవుతీసుకుని, పిల్లలకి చెయ్యి ఊపాడు మురళి

"బై మురళీ - బై కృష్ణా"

"బై అంకుల్"

ట్రైయిన్ అతన్ని దింపేసి, జాహ్నవిని, విమల్‌ని మోసుకుని వెళ్ళేప్రయత్నంలో వుంది.

జాహ్నవిలో కొత్త సందడి. క్షణాలు లెక్కపెట్టుకుంటోంది. భర్తతో డాక్టర్ మురళితో గడిపిన రోజులతాలూకు కబుర్లు, ఒకనాడు తను అసహ్యించుకున్న నిమ్‌హాన్స్ ఫేమిలీ వార్డు జ్ఞాపకాలు, ఆ జ్ఞాపకాల తాలూకు వ్యక్తుల స్మృతులు ఎన్నో ఎన్నో.... చెప్పుకోవాలని

మురళి కనుచూపుమేర దాటేవరకు కంపార్ట్‌మెంట్ వాకిట్లో నిల్చున్న విమల్ మనసు, మురళికి నమస్కరించింది.

"మురళీ! మీది మేము తీర్చుకోవాలన్నా తీరేఋణం కాదు. నా జాహ్నవిలో మీరు తెచ్చిన మార్పు చిన్నదికాదు'----